www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జనన, మరణ రికార్డులతో
ఓటర్ల జాబితా
అనుసంధానం 2

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచడానికే..
ఆర్‌జీఐ నుంచి నేరుగా మరణాల సమాచారం
వెంటనే బీఎల్వోలతో క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ
కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

శుక్రవారం | 2-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 33

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ.9.15 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఆర్ద్ర మ.1.04 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.12.49-2.23; దుర్ముహూర్తం: ఉ.8.24-9.14, మ.12.37-1.28; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.32

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైజింగ్ తెలంగాణను
ఎవరూ ఆపలేరు

ఆపాలనుకునే వారి కళ్లు, కాళ్లు కాలిపోతాయి



ఆర్టీసీలో సమ్మె పోటు రాష్ట్రానికే నష్టం
సమ్మె విషయంలో చర్చిద్దాం.. చేయగలిగింది చేస్తాం
రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదు.. అందరూ సహకరించాలి
15 నెలలుగా ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం
పదేళ్లలో రూ.8లక్షల కోట్లు ఎటు వెళ్లాయో తెలియట్లే
కపటనాటక సూత్రధారి కేసీఆర్ బయల్దేరాడు.. జాగ్రత్త
పథకాలు, వాటి అమల్లో తెలంగాణ నం.1గా నిలిచింది
కులగణనకు తెలంగాణ మోడల్‌ను పరిశీలించండి
కేంద్రానికి సహకరించేందుకు సిద్ధం: ముఖ్యమంత్రి రేవంత్

తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో కులగణనపై మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరని, ఎవరైనా ఆపాలనుకుంటే వారి కళ్లు, కాళ్లు కాలిపోతాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ అని, తెలంగాణ మోడల్‌నే కేంద్ర ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. త్వరలో రాబోయే గిగ్ వర్కర్స్ పాలసీ కూడా దేశానికి రోల్ మోడల్ అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన, గిగ్ వర్కర్స్ పాలసీ, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, శాంతి భద్రతలను కాపాడడంలో, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో, నిరుద్యోగ

మిగతా 13వ పేజీలో...



కులగణనలో తెలంగాణ
రాంగ్ రోల్‌మోడల్

50% ఇళ్లలో కూడా సర్వే చేయలేదు
మాకు ఆ మోడల్ ఏమాత్రం అవసరం లేదు
రాహుల్‌కు భయపడి కులగణన చేయట్లేదు
మత ప్రాతిపదికన ఎవరినీ బీసీల్లో చేర్చం
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 12



అది అశాస్త్రీయ కులగణన

ముస్లింలను బీసీలుగా చూపి,
తీవ్ర అన్యాయం చేసిన రేవంత్ సర్కారు
బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం
తొలుత కులగణన చేసింది
బిహార్‌లోని ఎన్డీయే సర్కారు: లక్ష్మణ్



గురువారం పాకిస్థాన్‌లోని టిల్లా ఫైరింగ్ రేంజ్‌లో ఆ దేశ సైనిక విన్యాసాలు

పాక్‌లో గుబులు!

ఇప్పటికే అంతర్గత సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న దాయాది దేశం

భారత్‌తో పోరు తప్పదేమోనని ఆందోళన
బంగ్లాను వాడుకుని భారత్‌పై ఒత్తిడికి ప్లాన్
అందుకే భారత్-బంగ్లా సరిహద్దుల్లో
పాక్ సైన్యం, ఐఎస్ఐ కదలికలు!
అటు ఎల్వోసీ వెంట నిఘా రాడార్లు,
ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థల మోహరింపు
పాక్ ప్రధాన నగరాలు కరాచీ, లాహోర్‌ల
గగనతలంపై నెల రోజులపాటు ఆంక్షలు
పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అదృశ్యం
దేశం వదిలి పారిపోయారనే ప్రచారం

న్యూఢిల్లీ, మే 1: అంతర్గత సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్.. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతర పరిణామాలతో ఆందోళన చెందుతోంది. ఇప్పటికే ఓవైపు అఫ్ఘానిస్థాన్, బలూచిస్థాన్, ఇరాన్‌లతో ఉద్రిక్త పరిస్థితులు, పాక్ ఆర్మీ చీఫ్ అదృశ్యమయ్యారనే ప్రచారం, సైన్యం, నేవీ యుద్ధానికి సిద్ధంగా లేవనే అంచనాలు.. మరోవైపు భారత్‌తో యుద్ధం తప్పదేమోననే యోచనతో ఆ దేశ ఆత్మస్థైర్యం దెబ్బతిన్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో పాక్ సైనికాధికారులు, పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కదలికలు ఉన్నాయని బయటపడటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో

మిగతా 2వ పేజీలో...

అమృత్‌సర్‌లో ఉగ్ర కుట్ర భగ్నం!

భారీగా ఆయుధాల స్వాధీనం 2
తుపాకులు, గ్రెనేడ్లు ఉండటంతో కలకలం
బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసుల ఆపరేషన్

పాకిస్థానీలు భారత్ వీడేందుకు గడువు పొడిగింపు

మానవతా దృక్పథంతో గడువు సవరించిన కేంద్రం

భారత్‌కు రూ.1100 కోట్ల సైనిక సామగ్రి సరఫరాకు అమెరికా ఆమోదం 2

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటాం
రాజ్‌నాథ్‌తో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్

'అవుట్ సోర్సింగ్' భారం
తగ్గించుకుందాం

అవసరానికి మించి ఉన్న ఉద్యోగులను సాగనంపిన సర్కారు

ప్రస్తుతం 1,27,326 మంది.. సర్దుబాటు చేశాక 19 వేల మంది తొలగింపు



హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు రెగ్యులర్ ఉద్యోగ నియామకాలు చేపడుతూనే.. ఆ స్థానంలో ఉండే తాత్కాలిక ఉద్యోగుల(అవుట్‌సోర్సింగ్)ను దశల వారీగా తొలగిస్తోంది. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు చూపుతూనే.. మరోవైపు ప్రభుత్వ విభాగాల్లో అవసరానికి మించి ఉన్న అదనపు ఉద్యోగుల భారాన్ని తగ్గించుకుంటూ పోతోంది. పొరుగు సేవల ద్వారా వివిధ విభాగాల్లో పని చేస్తున్న అదనపు సిబ్బంది సుమారు 19 వేల మందిని విధుల నుంచి తప్పించింది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్యను హేతుబద్ధీకరణ చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం ఆమేరకు శాఖల వారీగా తాత్కాలిక ఉద్యోగులను తొలగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్ కింద ప్రభుత్వ విభాగాల్లో సుమారు 1,27,326 మంది పని చేస్తున్నారు. వీరితోపాటు ఒప్పంద ప్రాతిపదికన ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లతో కలిపి మరో 81,341 మంది ఉన్నారు. ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులను సర్దుబాటు పేరుతో తొలగించవద్దని ఆయా సంఘాల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.. గ్రూప్-4 కింద నియామకమైన 8 వేల మందిని.. శాఖల వారీగా తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న వారి స్థానాల్లో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. రెగ్యులర్ ప్రాతిపదికన నియామకం అయిన

మిగతా 3వ పేజీలో...





అమరావతిలో ప్రధాని సభకు సిద్ధమవుతున్న పైలాన్

అమరావతి 2.0కు సిద్ధం

నేడు ప్రధాని మోదీ చేతుల మీదుగా
ఆంధ్రప్రదేశ్ రాజధాని పనులకు శ్రీకారం
రూ.49,040 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన
మరో రూ.8 వేల కోట్ల పనులకూ పచ్చజెండా
రెండున్నర గంటల పాటు ప్రధాని పర్యటన

ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

క్రియేట్ ఇన్ ఇండియా.. క్రియేట్ ఫర్ వరల్డ్
ముంబైలో వేవ్స్ సదస్సులో మోదీ ఆకాంక్ష
త్వరలో 'వేవ్స్ అవార్డు'లను అందజేస్తాం 10
వేవ్స్‌తో 'ఆరెంజ్ ఎకానమీ'కి నాంది: ప్రధాని
మోదీని పొగడ్తలతో ముంచెత్తిన రజనీ, షారుఖ్

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం అమరావతి నిర్మాణ పనులకు మోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు. రూ.49,040 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు మరో రూ.8 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ గన్నవరం రానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో వెలగపూడి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో

మిగతా 14వ పేజీలో...

పాక్ నుంచి తిరిగొచ్చిన
బెజవాడ కోడలు!

అటారీ సరిహద్దుకు చేరుకున్న మోనికా రజని
పుట్టినింటి వారిని చూసేందుకు పాకిస్థాన్‌కు
పహల్గాం ఉగ్రదాడితో తిరిగి భారత్‌కు రాక
స్వర్ణ దేవాలయాన్ని దర్శించి, విజయవాడకు
రజని భర్త పవన్ రబ్బర్ ఇండస్ట్రీస్ అధినేత

విజయవాడ(వన్‌టౌన్), మే 1(ఆంధ్రజ్యోతి): బెజవాడ యువకుడిని వివాహం చేసుకున్న పాకిస్థాన్ యువతి మోనికా రజని(35) తిరిగి భారత్ చేరుకున్నారు. కొద్దిరోజుల క్రితం తన పుట్టినింటి వారిని చూడటానికి ఆమె పాక్‌కు వెళ్లారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ పౌరులు దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. అదేవిధంగా పాక్ ప్రభుత్వం సైతం భారతీయులను తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ

మిగతా 14వ పేజీలో...

సీఎంవోలో అధికారుల 12
శాఖల మార్పు

ముఖ్య కార్యదర్శి శేషాద్రికి అదనంగా
వ్యవసాయం, పౌరసరఫరాల బాధ్యతలు
శ్రీనివాసరాజుకు విద్య, ఆర్‌అండ్‌బీ,
హౌసింగ్.. 'విద్య' నుంచి మాణిక్ ఔట్
వేముల శ్రీనివాసులుకు మహిళాశిశు
సంక్షేమం సహా మరికొన్ని బాధ్యతలు




జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు
నిరుటితో పోలిస్తే 12.6%వృద్ధి
నెలవారీగారూ.2లక్షలకోట్లు
దాటడం ఇది రెండోసారి 11
రాష్ట్రంలోనూ 12% వృద్ధితో
రూ.6983 కోట్ల జీఎస్టీ వసూళ్లు

ఎన్‌ఈపీ అమలు చేస్తున్నాం

యూజీసీ ఆదేశాలు పాటిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయానికి భిన్నంగా
ఉన్నత విద్యా మండలి వివాదాస్పద లేఖ



హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): 'జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 విద్యా వ్యవస్థకు గొడ్డలిపెట్టు.. విద్య కాషాయీకరణ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దీన్ని వాడుకుంటోంద'ని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ విద్యా కమిషన్, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, విద్యావేత్తలు, నిపుణులు ఒకవైపు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎన్‌ఈపీలో సూచించినట్లు ఉన్నత విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపింది. అలాగే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ గురువారం యూజీసీకి రాసిన లేఖ వివాదాస్పదంగా మారింది. ఆ లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. ఎన్‌ఈపీని తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఉచిత విద్యను లేకుండా చేసి, పూర్తిగా ప్రైవేటుపరం చేయాలన్న లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోందని రాష్ట్ర సర్కారు పేర్కొంటోంది. వీసీలు, ప్రొఫెసర్ల నియామకాలపై ఇటీవల విడుదల చేసిన ముసాయిదా బిల్లు కూడా వివాదాస్పదంగా మారింది.

తెలుగులో రాసిన వారికి
మార్కులు ఎలా కేటాయించారు?



గ్రూప్-1 పరీక్షపై టీజీపీఎస్సీని ప్రశ్నించిన హైకోర్టు
ఆంగ్ల సబ్జెక్టు నిపుణులే మూల్యాంకనం చేసి, కేటాయించారన్న టీజీపీఎస్సీ
ప్రిలిమ్స్, మెయిన్స్‌లో హాల్ టికెట్ నంబర్లు మారతాయని నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు
మెయిన్స్‌లో నంబర్లు మారడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు 14
పిటిషనర్ల న్యాయవాదులు
విచారణ నేటికి వాయిదా



భూపాలపల్లి జిల్లా గణపురంలో గాలివానకు నేలవాలిన వరి పంట

గాలివానతో అతలాకుతలం

భూపాలపల్లి, ములుగు, ఖమ్మం జిల్లాల్లో వర్ష బీభత్సం
విరిగిపడిన విద్యుత్తు స్తంభాలు, చెట్లు.. దెబ్బతిన్న పంటలు
మరోవైపు మండుతున్న ఎండలు.. వడదెబ్బతో ఒకరి మృతి
వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి: ఎన్‌హెచ్‌ఆర్సీ
తెలంగాణ, ఏపీ సహా 11 రాష్ట్రాలకు పలు సూచనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అర్ధరాత్రి గాలివాన అతలాకుతలం చేసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భూపాలపల్లి, ఖమ్మం, ములుగు జిల్లాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు, చెట్లు విరిగిపడి.. కరెంట్ సరఫరా, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలుల ఉధృతికి చేతికి అందివచ్చిన వరి, మొక్కజొన్న పంటలు

మిగతా 14వ పేజీలో...

మెటా కోడింగ్ అంతా ఏఐతోనే!

12-18 నెలల్లో ఇది సాధ్యం: జుకర్‌బర్గ్



న్యూఢిల్లీ, మే 1: వచ్చే 12 నుంచి 18 నెలల్లో తమ సంస్థ కోడింగ్ అంతా కృత్రిమ మేధే(ఏఐ) రాసేస్తుందని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ చెప్పారు. ఏఐకి లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. టెస్టులు నిర్వహించగలదని, బగ్స్‌ను కనిపెట్టగలదని తెలిపారు. తన పనితీరును తానే మెరుగుపరుచుకోగలదని అన్నారు. సిబ్బంది బృందంలో చక్కగా పనిచేసే వారి తరహాలోనే ఏఐ పనిచేస్తుందని.. త్వరలోనే టాప్ కోడర్స్ కంటే ఏఐ మెరుగు అవుతుందని వివరించారు.

ఎవ్వరూ కాపాడలేదు



మమ్మల్ని సమీపించిన ఉగ్రవాది - మీరు హిందువులా, ముస్లిములా అని అడిగాడు. కల్మా చదవమన్నాడు. మేము హిందువులం అని చెబుతుండగానే శుభంను కాల్చేశాడు. దాదాపు 45 నిమిషాలు కాల్పులు జరిగాయి. మమ్మల్ని కాపాడటానికి ఒక్కరూ ముందుకు రాలేదు. ఎవ్వరూ కాపాడరని ఉగ్రవాదులకు ముందే తెలుసు. అందువల్లే తాపీగా మతమేమిటో అడిగి తెలుసుకొని మరీ చంపేశారు. మేము వద్దు, వద్దంటున్నా- గుర్రాలవాడు బలవంతంగా మమ్మల్ని ఈ ప్రాంతానికి తీసుకొని వచ్చాడు. టెర్రరిస్టులకు స్థానికులు సహాయపడ్డారు. మేము ముస్లిములమైఉంటే బతికేవాళ్లం. హిందువులం కాబట్టే చంపేశారు.

- పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన శుభం ద్వివేది (కాన్పూర్) భార్య ఐశన్య

వాళ్లనేమీ అనొద్దు



ఆయన గొప్పగా బతికారు. మేమంతా గర్వపడేలా జీవించారు. అన్ని విధాలా ఆయన గౌరవాన్ని కాపాడతాం. ఉగ్రవాదులు కాల్పులు జరిపాక కూడా ఆయన కొద్దిసేపు బతికే ఉన్నారు. కానీ, కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆయనను చంపిన వాళ్లు బతక కూడదు. ఆ ఉగ్రవాదులను వదలకూడదు. అలాగని, ముస్లిములను, కశ్మీరీలను ప్రజలు వ్యతిరేకించాలని మేము కోరుకోవడం లేదు. మేము శాంతి కోరుతున్నాం. అవును.. శాంతి కావాలంటున్నాం. అదే సమయంలో మాకు న్యాయం కూడా జరగాలి

- ఉగ్రవాదుల దాడిలో అమరుడైన ఇండియన్ నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి (గురుగ్రామ్)

పీవోకేను స్వాధీనం చేసుకోవాలి

▸▸ ఈసారి వదిలిపెట్టకూడదు: ఒవైసీ

హైదరాబాద్, మే 1: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను స్వాధీనం చేసుకోవాలని, ఈసారి మాత్రం వదిలిపెట్టకూడదని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మోదీ ప్రభుత్వానికి సూచించారు. ఉగ్రవాదులను 'ఇంట్లోకి చొరబడి చంపుతామ'న్న ప్రధాని మోదీ గత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఈసారి ఇంట్లోకి చొరబడి అక్కడే ఉండాల'ని వ్యాఖ్యానించారు. గురువారం ఒవైసీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాక్ సైనికులు పోస్టులను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారన్న వార్తలపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'అదే నిజమైతే చాలా మంచిది. మనం వెళ్లి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాల'ని సూచించారు. మోదీ ప్రభుత్వం ఎల్‌వోసీ వెంబడి ఉగ్రవాదుల స్థావరాలను 2019లోనే నిర్మూలించకపోవడాన్ని ఒవైసీ విమర్శించారు. పీవోకే మనదేనని పార్లమెంటు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఈసారి కేంద్ర ప్రభుత్వం గట్టి చర్య తీసుకోవాలని సూచించారు.

ఒక్క ఉగ్రవాదిని కూడా వదలం: షా

న్యూఢిల్లీ, మే 1: పహల్గాంలో పర్యాటకులపై పాశవిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎవర్నీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని వెంటాడి పట్టుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో అస్సాం బోడో సమాజం నాయకుడు ఉపేంద్రనాథ్ బ్రహ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడికి గట్టిగా బదులిస్తామని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని చెప్పారు.

పాక్ జాతీయులు భారత్ వీడేందుకు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, మే 1: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులు భారత్ నుంచి వెళ్లిపోయేందుకు విధించిన గడువును కేంద్రం నిరవధికంగా పొడిగించింది. తొలుత ఏప్రిల్ 30 వరకు మాత్రమే భారత్ గడువు విధించింది. అయితే వాఘా-అటారీ సరిహద్దు వద్ద తమ జాతీయులను గుర్తించి లోపలికి అనుమతించడంలో పాక్ అధికారులు చురుగ్గా వ్యవహరించడం లేదు. దీంతో పెద్ద సంఖ్యలో పాక్ జాతీయులు వాఘా-అటారీ సరిహద్దు వద్ద వేచి చూస్తున్నారు. ఈ తరుణంలో భారత్ మానవతా దృక్పథంతో గడువును సవరించింది. దీంతో పాక్ జాతీయులకు ఊరట లభించినట్లైంది. మరోవైపు ఇప్పటివరకు 911 మంది పాక్ జాతీయులు భారత్ నుంచి వెళ్లిపోయారు. కాగా, వాఘా-అటారీ సరిహద్దు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ వద్ద అబ్దుల్ వహీద్ భట్ అనే 80 ఏళ్ల పాక్ జాతీయుడు మృతి చెందాడు. 1980లోనే వీసా గడువు ముగిసినా భారత్‌లో ఉన్న భట్ పక్షవాతంతో బాధపడుతున్నాడు.

పాక్‌లో గుబులు!

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌ను నేరుగా ఎదుర్కోలేని పాక్.. బంగ్లాదేశ్‌ను పావుగా వాడుకుని భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నం చేస్తోందని రక్షణ నిపుణులు, విశ్రాంత సైనికాధికారులు చెబుతున్నారు.



గురువారం సైనిక విన్యాసాల సందర్భంగా నినాదాలు చేస్తున్న పాక్ సైనికులు

బంగ్లాదేశ్‌లో పాక్ సైన్యం, ఐఎస్ఐ ఏజెంట్ల కదలికలు

భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో పాక్ సైన్యం అధికారులు, ఆ దేశ నిఘా సంస్థ ఐఎస్ఐ ఏజెంట్ల కదలికలు బయటపడ్డాయి. దీనితో భారత ప్రభుత్వం బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్ ప్రకటించింది. ఇది బంగ్లాదేశ్ వేదికగా భారత్‌పై ఒత్తిడిని పెంచేందుకు పాక్ వేస్తున్న ఎత్తుగడ అనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. నిజానికి పాకిస్థాన్‌కు నలువైపులా చిక్కులే. అఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ల పాలన తిరిగి మొదలైన తర్వాత రెండు దేశాలకూ పడటం లేదు. అఫ్ఘాన్ వేదికగా పనిచేస్తున్న తెహ్రీకే తాలిబాన్ పాకిస్థాన్ సహా పలు ఉగ్రవాద సంస్థలు తరచూ పాక్‌లో దాడులు చేస్తున్నాయి. ఇక బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఇటీవలి కాలంలో తరచూ పాక్ సైన్యంపై దాడులు చేస్తుండటం తలనొప్పిగా మారింది. ఇరాన్‌ను అడ్డాగా చేసుకున్న జైష్ అల్ అదిల్ వంటి ఉగ్రవాద సంస్థలు పాక్‌పై.. పాకిస్థాన్‌లోని కొన్ని ఉగ్రవాద సంస్థలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయి. దీనితో పాక్, ఇరాన్ రెండు దేశాలు కూడా పరస్పరం సరిహద్దులు దాటి ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితిలో భారత్ చర్యలతో పాక్ ఆందోళనలో పడిందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లో ఇటీవలి తిరుగుబాటు అనంతరం.. పాక్ అనుకూల మతవాద శక్తులు బలపడ్డాయని.. వాటిని పావుగా వాడుకుని భారత్‌ను ఇబ్బంది పెట్టాలన్నది పాక్ వ్యూహమని అంటున్నారు.

ఆర్మీ చీఫ్ మాయం వెనుక...

ఉగ్రవాదులను రెచ్చగొట్టి పహల్గాం ఘటనకు మూలకారకుడిగా ప్రచారం జరిగిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్.. అదృశ్యమయ్యాడనే వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఆయన కుటుంబంతో సహా విదేశాలకు వెళ్లిపోయారని.. లేదా రావల్పిండిలోని ఓ బంకర్‌లో దాక్కున్నారని ప్రచారం జరుగుతోంది. పాక్ ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వకుండా.. ప్రధాని షెహబాజ్‌తో ఆసిమ్ మునీర్ కలసి ఉన్న ఓ ఫొటోను విడుదల చేసింది. తాజాగా గురువారం కూడా.. 'భారత్ ఎలాంటి మిలటరీ చర్యలు చేపట్టినా.. తీవ్ర స్థాయిలో ప్రతిస్పందిస్తాం..' అంటూ ఆసిమ్ మునీర్ భారత్‌ను హెచ్చరించినట్లుగా ప్రకటన విడుదల చేసింది. కానీ ఆసిమ్ మునీర్ నేరుగా మీడియా ముందుకు మాత్రం ఇప్పటివరకు రాలేదు. ఇక పాక్ ప్రజల్లో పలుకుబడి ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌ను పదవీచ్యుతుడిని చేసి, జైలుపాలు చేయడం వెనుక ఆర్మీ హస్తంపై అక్కడి ప్రజల్లో ఆగ్రహం నెలకొంది. ఈ క్రమంలో ఆసిమ్ మునీరే ప్రణాళిక రచించారని.. భారత ఆర్మీ దాడికి దిగితే, పాక్ సైన్యానికి ప్రజల మద్దతు లభిస్తుందని, సైన్యంపై పట్టు పెంచుకోవచ్చని భావించారని ఆరోపణలు ఉన్నాయి. పాకిస్థాన్‌లోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ.. 'ది సండే గార్డియన్' ఆంగ్ల పత్రిక ఈ వివరాలను ప్రచురించింది. కానీ భారత ప్రతిస్పందన తీవ్రంగా ఉండటంతో.. ఆసిమ్ మునీర్ పట్ల పాక్ పాలకులు, ఆర్మీ అధికారుల్లోనే వ్యతిరేకత నెలకొందని, ఆయన అదృశ్యం వెనుక ఇదే కారణమై ఉంటుందని పేర్కొంది. మరోవైపు ఆర్మీ చీఫ్ అదృశ్యం, భారత్ దాడి భయంతో.. పాక్ ఆర్మీలో వివిధ ర్యాంకుల అధికారులు రాజీనామాలు చేస్తున్నారని, ఈ అంశం పాకిస్థాన్ పాలకుల్లో గుబులు రేపుతోందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. ఆసిమ్ మునీర్ అదృశ్యం వెనుక భారత్‌పై ఒత్తిడి పెంచే ప్రత్యేక వ్యూహమేదైనా ఉండొచ్చని రక్షణ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రధాన నగరాల గగనతలంపై ఆంక్షలు

పాక్‌లోని ప్రధాన నగరాలు కరాచీ, లాహోర్‌ల గగనతలంపై ఆ దేశం ఆంక్షలు విధించింది. మే నెల మొత్తం రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 వరకు ఎలాంటి ఎయిర్ ట్రాఫిక్ ఉండకుండా నిషేధం విధించింది. ఆ సమయాల్లో ప్రయాణించే పౌర విమానాలను ఇతర మార్గాల ద్వారా మళ్లించనున్నట్లు తెలిపింది. ఇక ఆ దేశానికి చెందిన అన్ని విమానాశ్రయాల్లోనూ ఈ నెల రోజులు హైఅలర్ట్ ప్రకటించింది.

బలహీనంగా పాక్ నేవీ..!

ప్రస్తుతం పాక్ నావికాదళం బాగా బలహీనంగా ఉందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. పాక్ నేవీలో ఎనిమిది జలాంతర్గాములు ఉన్నాయి. అందులో పీఎన్ఎస్ హష్మత్, పీఎన్ఎస్ హుర్మత్, పీఎన్ఎస్ హమ్జా ప్రస్తుతం పనిచేసే స్థితిలో లేవు. రెండు అగోస్టా-70, మూడు అగోస్టా 90బీ తరహా జలాంతర్గాములు మాత్రమే కాస్త మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఇందులో ఒక అగోస్టా-70, ఒక అగోస్టా 90బీ జలాంతర్గాములు.. మరమ్మతుల కోసం కరాచీ నేవీ బేస్‌లో ఉన్నట్టు ఇటీవల ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తించారు. మరో అగోస్టా-90బి జలాంతర్గామి కరాచీ షిప్‌యార్డ్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో పూర్తిగా నేలమీదకు తెచ్చి పెట్టి ఉంది. అంటే దానికి భారీ స్థాయిలో మరమ్మతులు, ఆధునికీకరణ అవసరం. అంటే ప్రస్తుతం పాక్ వద్ద ఒక అగోస్టా-70, ఒక అగోస్టా 90బీ జలాంతర్గాములు మాత్రమే పనిచేసే స్థితిలో ఉన్నాయి. భారత రిటైర్డ్ మేజర్ జనరల్ గగన్ దీప్ బక్షి ఇటీవల ఓ ఆంగ్ల మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలను వెల్లడించారు. కాగా, భారత్ నుంచి ఎలాంటి ముప్పు ఎదురవుతుందో అనే ఆందోళనలో ఉన్న పాకిస్థాన్ దాదాపు మూడేళ్లుగా ఖాళీగా ఉన్న జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ) పోస్టును భర్తీ చేసింది. ప్రస్తుత ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ముహమ్మద్ అసిమ్ మాలిక్‌ను పాక్ జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ)గా నియమించింది.

'ఎలక్ట్రానిక్ వార్'కూ సిద్ధం

భారత్ ఏక్షణమైనా దాడి చేయవచ్చనే ఆందోళనతో పాకిస్థాన్ తన రాడార్ నిఘా వ్యవస్థలు, సిగ్నల్ జామర్లతో కూడిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను నియంత్రణ రేఖ సమీపంలోకి తరలిస్తోంది. అందులో చైనా తయారీ టీపీఎస్-77 రాడార్ వ్యవస్థలు ఉన్నాయి. అవి సుమారు 463 కిలోమీటర్ల దూరం, 30.5 కిలోమీటర్ల ఎత్తు వరకు గగనతలంపై నిఘా పెట్టగలవని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. అదే చైనా తయారీ డీడబ్ల్యూఎల్-002 ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ (ఈడబ్ల్యూ) వ్యవస్థ.. శత్రుదేశాల రాడార్లు, జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) సిగ్నళ్లను జామ్ చేయగలదని వివరిస్తున్నారు. కానీ.. మన దేశం వద్ద అంతకన్నా అత్యాధునిక సంయుక్త, హిమశక్తి వంటి వ్యవస్థలు ఉన్నట్టు చెబుతున్నారు.

లోకం తీరు



కశ్మీర్‌లోనే పహల్గాం ఉగ్రవాదులు!

▸▸ దట్టమైన అటవీ ప్రాంతంలో దాక్కున్నట్లు ఎన్ఐఏ వెల్లడి

న్యూఢిల్లీ/శ్రీనగర్, మే 1: పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రత దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. అణువణువూ శోధిస్తున్నాయి. అయితే ఆ ఉగ్రవాదులు ఇంకా దేశం విడిచి పారిపోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తాజాగా వెల్లడించింది. వీరంతా దక్షిణ కశ్మీర్‌లోని దట్టమైన అడవుల్లో దాక్కున్నట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. దాడి జరిపిన తర్వాత ఎవరిపై ఆధారపడొద్దని ఆహారం, ఇతరత్రా సామగ్రి తీసుకొని పక్కా ప్లాన్‌తో అటవీ ప్రాంతంలోకి పారిపోయారని సమాచారం. ఆయా ప్రాంతాల్లో మరికొంత మంది ఉగ్రవాదులు ఉండే అవకాశం లేకపోలేదని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇక ప్రాథమిక దర్యాప్తు మేరకు.. దాడికి 48 గంటల ముందే నలుగురు ఉగ్రవాదులు బైసరన్ లోయకు చేరుకున్నారు. అరు, బేతాబ్ లోయలతో సహా మరో నాలుగు ప్రాంతాల్లో ఉగ్రవాదులు తొలుత రెక్కీ నిర్వహించి స్థానికులను కలిసి ఆరా తీశారని దాడి తర్వాత ఎన్ఐఏ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదులు భద్రత తక్కువగా ఉండే బైసరన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. ఉగ్రవాదుల వద్ద అధునాతన సమాచార పరికరాలున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వారు వాడిన పరికరాల్లో సిమ్‌లు ఉండవని.. ఇతరులు గుర్తించకుండా చిన్నపాటి ఎన్‌క్రిప్టెడ్ సందేశాలు పంపవచ్చని చెబుతున్నాయి. దాడి ప్రారంభమయ్యే (మధ్యాహ్నం 1.15 గంటల) వరకు భద్రతా దళాలు గుర్తించకుండా ఉగ్రవాదులు 3 శాటిలైట్ ఫోన్లు ఉపయోగించారని తెలిసింది.

ఆర్మీ చీఫ్‌తో ప్రధాని మోదీ భేటీ

ప్రధాని మోదీ బుధవారం ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదితో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ఇందులో పాల్గొన్నారు.

భారత్‌కు రూ.1100 కోట్ల సైనిక సామగ్రి సరఫరాకు అమెరికా ఆమోదం

న్యూఢిల్లీ, మే 1: భారత్‌కు 131 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.1109 కోట్లు) విలువైన సైనిక సామగ్రి (మిలటరీ హార్డ్‌వేర్) సరఫరాకు అమెరికా ఆమోదం తెలిపింది. అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే డిఫెన్స్ సెక్యూరిటీ కార్పొరేషన్ ఏజెన్సీ(డీఎస్‌సీఏ) ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు సమాచారం అందజేసింది. ఇండో-పసిఫిక్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ కింద ఈ విక్రయం జరగనుంది. లాజిస్టిక్స్ అవసరాలకు వాడే సామగ్రి, సీ(సముద్రం) విజన్ డాక్యుమెంటేషన్‌తోపాటు సీ-విజన్ సాఫ్ట్‌వేర్, రిమోట్ సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు భారత్ ప్రతిపాదనలు పంపినట్టు డీఎస్‌సీఏ పేర్కొంది. ఈ మేరకు అమెరికా మీడియాలో కథనాలు వెలువడగా.. దీనిపై భారత ప్రభుత్వం స్పందించలేదు. అమెరికా ఆయుధాలు, ఆయుధ సామగ్రి వినియోగం దిశగా భారత్‌ను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వేళ ఈ ఆమోదం లభించింది.

సీఐఎస్‌సీగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, మే 1: ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్.. చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్(సీఐఎస్‌సీ)గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. త్రివిధ దళాల మధ్య సమన్వయంలో సీఐఎస్‌సీ అత్యంత కీలకంగా వ్యవహరిస్తారు. లెఫ్టినెంట్ జనరల్ జేపీ మాథ్యూ సీఐఎస్‌సీగా బుధవారం పదవీ విరమణ చేయగా ఆ స్థానంలో ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు అశుతోష్ దీక్షిత్ సెంట్రల్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా పని చేశారు. దాదాపు 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో అశుతోష్ దీక్షిత్ వాయు సేనలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ, మే 1: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరను అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ ముడి చమురు సంస్థలు తగ్గించాయి. హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే వాణిజ్య సిలిండర్ ధర రూ.14.50 తగ్గిస్తూ గురువారం నోటిఫికేషన్ జారీచేశాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో వంటగ్యాస్ సిలిండర్ రూ.1,741లకు లభిస్తుంది. ఏప్రిల్ ఒకటో తేదీన రూ.41 తగ్గించిన తర్వాత మళ్లీ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడం ఇదే ప్రథమం. ఇక విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) కిలో లీటర్‌పై 4.4% అంటే రూ.3,954.38 ధర తగ్గించాయి. దీంతో ఢిల్లీలో ఏటీఎఫ్ కిలో లీటర్ పెట్రోల్ రూ.85,486.80లకు లభిస్తుంది. గత నెల ఒకటో తేదీన ఏటీఎఫ్ కిలో లీటర్ ధర రూ.5,870.54 (6.15శాతం) తగ్గించాయి.

నీట్‌పై తప్పుడు ప్రచార చానెళ్లను గుర్తించాం: ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, మే 1: ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 4న నిర్వహించే నీట్-యూజీ పరీక్షాపత్రం లీకైందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న సోషల్‌మీడియా చానెళ్లను గుర్తించామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ చానెళ్లు తప్పుడు ప్రచారంచేస్తున్నట్లు ఆ వర్గాల కథనం. ఈ తప్పుడు ప్రచారం ఆటకట్టించేందుకు ఎన్‌టీఏ ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్‌కు 1500కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో నీట్-యూజీ 2025 సమగ్రతను కాపాడేందుకు సదరు మోసపూరిత సోషల్‌మీడియా చానెళ్లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైన ఎన్‌టీఏ.. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్‌కు ఫిర్యాదుచేసినట్లు సమాచారం.

జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

▸▸ ఈసీ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మే 1: జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయబోతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తద్వారా ఓటరు జాబితాను కచ్చితత్వంతో నవీకరించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచడానికి వీలవుతుందని పేర్కొంది. ఇందుకోసం మరణాలకు సంబంధించిన సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) నుంచి ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు పొందుతామని తెలిపింది. మరణించిన వారి కుటుంబాల నుంచి సమాచారం వచ్చే వరకు వేచిచూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఓటరు సమాచార చీటీ (వీఐఎస్) ఓటర్లకు మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా అందులోని వివరాలను పెద్ద అక్షరాలతో ఉండేలా రూపొందించాలని ఈసీ నిర్ణయించింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని తేలికగా గుర్తించడంతో పాటు పోలింగ్ అధికారులు కూడా జాబితాలోని పేర్లను సులభంగా చూసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపింది. దీంతో పాటు బూత్ స్థాయి అధికారులకు ఫొటో ఐడీ కార్డు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

ఆయుష్షు తీసిన ఐదు ఫుల్‌బాటిల్స్!

▸▸ పందెం కట్టిన స్నేహితులు

▸▸ రూ.10వేల కోసం తాగి ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి



కార్తీక్ (ఫైల్)

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పది వేల కోసం ఆశపడ్డాడో... పౌరుషానికి పోయాడో కానీ, పందెం కోసం ఏకబిగిన మద్యం తాగి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా పూజారహళ్లి గ్రామానికి చెందిన కార్తీక్(21), అతని స్నేహితుల మధ్య మద్యం సేవించే విషయమై సవాల్ జరిగింది. నీరు కలుపుకోకుండా ఐదు ఫుల్ బాటిళ్ల మద్యం తాగితే రూ.10వేలు ఇస్తానని వెంకటరెడ్డి అనే వ్యక్తి చాలెంజ్ చేశాడు. కార్తీక్ ఈ సవాల్ స్వీకరించాడు. ఏకంగా ఐదు బాటిళ్ల మద్యం తాగేశాడు. కాసేపటికే అస్వస్థతకు గురవ్వడంతో కోలార్ జిల్లా ముళబాగిలు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక కార్తీక్ మృతి చెందాడు. వారం క్రితం జరిగిన ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కార్తీక్‌కు ఏడాది కిందట వివాహమైంది. వారం కిందట కొడుకు పుట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నంగిలి పోలీసులు వెంకటరెడ్డి, సుబ్రమణి సహా ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.

కులగణనపై కింకర్తవ్యం?

కేంద్రం నిర్ణయంతో కాంగ్రెస్ డైలమా.. నేడు వర్కింగ్ కమిటీ భేటీ



మల్లికార్జున ఖర్గే

▸▸ హెడ్‌లైన్ సరే.. టైమ్‌లైన్ ఏదీ?

▸▸ పక్కదోవ పట్టించే ఎత్తుగడ: జైరాం

▸▸ 515 కోట్లతో కుల గణన సాధ్యమా?

▸▸ రిజర్వేషన్లు 68% ఉండాలి: ఖర్గే

న్యూఢిల్లీ/బెంగళూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ కులగణన డిమాండ్‌తో మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడిన కాంగ్రెస్.. ఇప్పుడు అయోమయంలో పడింది. జనాభా లెక్కల సేకరణతోపాటే కులగణన కూడా జరపాలని మోదీ క్యాబినెట్ ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం ఆ పార్టీని విస్మయానికి గురిచేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణననే ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గ నిర్ణయంతో అది బీజేపీ చేతికి వెళ్లిందన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఈ అంశంపై తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శుక్రవారం ఢిల్లీలో భేటీకానుంది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం మీడియాతో మాట్లాడారు. వర్కింగ్ కమిటీ కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై విస్తృతంగా చర్చిస్తుందన్నారు. కులగణనను ఆమోదిస్తూ ప్రభుత్వం 'హెడ్‌లైన్' ఇచ్చిందని.. కానీ దాని అమలుకు డెడ్‌లైన్ ఎక్కడని ప్రశ్నించారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై గట్టి చర్య తీసుకోవాలన్న డిమాండ్ల నేపథ్యంలో కులగణనపై నిర్ణయం పక్కదోవ పట్టించే ఎత్తుగడగా అభివర్ణించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దుచేస్తూ నిర్ణయం తీసుకోకుండా ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఇందుకోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆ నిధులు ఏ మూలకు: ఖర్గే

దేశవ్యాప్తంగా కులగణన సర్వే జరిపేందుకు రూ.575 కోట్లు సరిపోతాయా అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు. గురువారం బెంగళూరు, హుబ్బళిలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. 'కర్ణాటకలో కులగణనకు పదేళ్ల కిందట రూ.168 కోట్లు ఖర్చు చేశారు. అలాంటిది దేశవ్యాప్తంగా దీనికి రూ.575 కోట్లే కేటాయించడం ఏమిటి? ఇది ఉత్తరప్రదేశ్‌లో సర్వేకు కూడా సరిపోదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రగతి పట్ల ప్రధానికి నిజంగా ఆసక్తి ఉంటే రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలి. కోటా ఇప్పటికే 50 శాతానికి మించిపోయింది. ముందుగా ఆ 50% పరిమితిని తొలగించాలి. 67-68 శాతానికి పెంచాలి. తమిళనాడులో కూడా 68% రిజర్వేషన్ అమలవుతోంది' అని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు లభించేలా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకుందని.. దానిని కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అమరవీరులుగా గుర్తించాలి: రాహుల్

పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో చనిపోయినవారికి అమరవీరుల హోదా ఇవ్వాలని రాహుల్‌గాంధీ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. వారి కుటుంబ సభ్యులకు వెన్నంటి ఉంటానని.. తమవారిని అమరవీరులుగా గుర్తించాలన్న వారి డిమాండ్‌కు మద్దతిస్తున్నానని, వారి మనోభావాలను గౌరవించాలని కోరుతున్నానని గురువారం 'ఎక్స్'లో తెలిపారు.

అమృత్‌సర్‌లో ఉగ్ర కుట్ర భగ్నం!

▸▸ భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్న బలగాలు

▸▸ వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉండటంతో కలకలం

న్యూఢిల్లీ, మే 1: భారత్-పాక్ సరిహద్దుల్లో మరో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ జిల్లాలోని భరోపాల్ గ్రామం సమీపంలో ఉగ్ర కుట్రను సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) భగ్నం చేసింది. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంది. బీఎస్ఎఫ్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పంజాబ్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు 2 హ్యాండ్ గ్రనేడ్లు, 3 పిస్టళ్లు, 6 మ్యాగజీన్లు, 50 రౌండ్ల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు నిమిత్తం వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఆగని పాక్ కవ్వింపు చర్యలు

పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. నియంత్రణ రేఖ వెంబడి భారత పోస్టులను లక్ష్యంగా చేసుకొని పాక్ సైన్యం జరిపిన కాల్పులు వరుసగా ఏడోరోజు గురువారం రాత్రి కూడా కొనసాగాయి. 'ఏప్రిల్ 30 -మే 1 అర్ధరాత్రి వేళ జమ్ము కశ్మీర్‌లోని కుప్వారా, ఉరీ, అఖ్నూర్ ప్రాంతాల్లో నియంత్రణ రేఖ వెంబడి పాక్ దళాలు కాల్పులకు తెగబడ్డాయి. చిన్నపాటి ఆయుధాలతో పాక్ బలగాలు జరిపిన కాల్పులకు భారత సైన్యం దీటుగా బదులిచ్చింది' అని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఇరు దేశాలకు చెందిన మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్లు గత మంగళవారం హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం కాల్పులకు పాల్పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన భారత్.. దాయాది దేశానికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

అరేబియా సముద్రంలో గస్తీ ముమ్మరం

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అరేబియా సముద్రంలో భారత నావికా దళం గస్తీని ముమ్మరం చేసింది. సముద్ర భద్రతను బలోపేతం చేసే దిశగా యుద్ధ నౌకలను మోహరించడంతో పాటు యాంటీ-షిప్, యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ మిసైళ్ల ప్ర యోగాలను విజయవంతంగా నిర్వహించినట్లు నేవీ వర్గాలు ధ్రువీకరించాయి. గుజరాత్ తీరంలోని అంతర్జాతీయ సముద్ర సరిహద్దు సమీపంలో భారత కోస్ట్ గార్డ్ సైతం నౌకలను మోహరించింది.

భారత్‌కు ఆత్మరక్షణ హక్కు: అమెరికా

▸▸ రాజ్‌నాథ్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడిన అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్

న్యూఢిల్లీ, మే 1: భారత్‌కు తనని తాను రక్షించుకునే హక్కు ఉందని, ఈ విషయంలో భారత్‌కు తమ మద్దతు ఉంటుందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ పేర్కొన్నారు. అలాగే, ఉగ్రవాదంపై చేసే పోరులోనూ భారత్‌కు తమ అండ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడిన పీట్.. పెహల్గాం ఉగ్రదాడి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పెహల్గాం ఘటనతో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తుందనే విషయం రుజువైందని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా పీట్‌తో అన్నారు. ఈ మేరకు వారి మధ్య జరిగిన సంభాషణపై కేంద్ర రక్షణ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. మరోపక్క, ఉగ్రవాదంపై చేసే పోరులో భారత్‌కు సహకరించేందుకు కట్టుబడి ఉన్నామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో అన్నారు. ఈ మేరకు రుబియో తనతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారని, పెహల్గాం ఘటనపై విచారం వ్యక్తం చేశారని జైశంకర్ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు.. పెహల్గాం దాడి నేపథ్యంలో భారత్ దౌత్యపరంగా వివిధ దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తాత్కాలిక సభ్య దేశాల్లో ఎనిమిదింటితో విదేశీ వ్యవహారాల శాఖ మాట్లాడింది. ఈ క్రమంలో విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్.. దక్షిణ కొరియా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి చోటేయుల్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడారు.



ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వైఎంసీఏ నుంచి ముషీరాబాద్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

'అవుట్ సోర్సింగ్' భారం తగ్గించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఒక జూనియర్ సహాయకునికి ఇచ్చే వేతనం ముగ్గురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనంతో సమానం అని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 58 వేల ఉద్యోగాలు కొత్తగా భర్తీ చేసింది. 25 విభాగాల్లో ఈ నియామకాలు చేపట్టింది. భర్తీ చేసిన ఉద్యోగాల వార్షిక వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్న అదనపు సిబ్బంది బడ్జెట్ కేటాయింపులను ఈ ఏడాది ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి శాఖల వారీగా తొలగింపునకు చర్యలు చేపట్టింది. పాఠశాల విద్యాశాఖలో దశలవారీగా 60 శాతం మందిని తొలగించాలని నిర్ణయించింది. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లతోపాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, ఆర్టీసీ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్ వంటి చోట్ల తాత్కాలిక ప్రాతిపదికన అవసరానికి మించి ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నూతన ఆర్థిక సంవత్సరంలో కొనసాగించవద్దని ఆయా శాఖాధిపతులకు ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులందాయి. గత ఏడాది ఆర్థిక శాఖ నుంచి ఇచ్చిన ఉత్తర్వుల్లోనే తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగే ఉద్యోగులకు సంబంధించి.. రెగ్యులర్ ఉద్యోగులు వచ్చే వరకు లేదా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు మాత్రమే కొనసాగిస్తామని స్పష్టం చేసిన ప్రభుత్వం.. ఆమేరకు చర్యలు చేపట్టింది. ఒక్క రిజిస్ట్రేషన్ శాఖ నుంచే 155 మంది తాత్కాలిక ఉద్యోగులను తప్పించారు.

ప్రత్యామ్నాయ అవకాశాలు చూపాలి

ఈ ఏడాది తొలగించిన 19 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో చాలా మంది గత రెండు దశాబ్దాలుగా వివిధ శాఖల్లో పని చేస్తున్నారు. వారికి ఉన్న అనుభవం, అర్హత ఆధారంగా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను చూపాలి.

- ఏలూరి శ్రీనివాస్‌రావు, టీజీవో అధ్యక్షుడు, ఉద్యోగుల ఐకాస ప్రధాన కార్యదర్శి

జాబితాలో పేరున్నా దక్కని ఇందిరమ్మ ఇల్లు

» మంచిర్యాల జిల్లాలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోటపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లులేని నిరుపేదల కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇంటి పథకం అమలుచేస్తోంది. ప్రతి పల్లెలోనూ గ్రామ కమిటీ ఖరారుచేసిన వారికే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని నిబంధన కూడా పెట్టింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామ కమిటీ ఎంపిక చేసిన 27 మందితో కూడిన తొలి జాబితాలో కుమ్మరి రవీందర్ అనే వ్యక్తి పేరు ఉంది. కానీ ఇళ్ల సంఖ్య పదికి తగ్గించాలని ఆదేశాలు రావడంతో ఆయన పేరును తొలగించారు. దీంతో తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని మనస్తాపంతో రవీందర్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. రవీందర్‌కు భార్య కళావతితోపాటు ఇద్దరు పిల్లలున్నారు. గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న రవీందర్ సొంతిల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, గ్రామ కమిటీ వల్లే తనకు ఇల్లు దక్కడం లేదని తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.



నుస్తులాపూర్‌లో ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'తో సమస్యలు పరిష్కరిస్తా

» వారంలో 3 రోజులు ప్రజల వద్దకు: ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా జీవితంలో ఉన్నంత కాలం ప్రజా సేవకు పాటుపడుతూనే ఉంటానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఆయన 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు రాత్రీ పగలు తేడా లేకుండా తన క్యాంపు కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి తనను కలచి వేసిందని అన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని రూపొందించానని తెలిపారు. వారానికి 3 రోజులపాటు అధికారుల బృందంతో ప్రజల వద్దకు వెళతామని, అధికారుల సమక్షంలోనే ప్రజల సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తామని వెల్లడించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు.. అవసరమైతే మంత్రులు, సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యే ఆన్ వీల్స్ యాప్ ద్వారా వచ్చిన సమస్యలను చూసేందుకు రోజూ రెండు గంటలు కేటాయిస్తానని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సత్యనారాయణ.. వాహనంలో అధికారులతో కూర్చొని కొంత మంది ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించారు.

పారా మిలిటరీ దళాలకు పాత పింఛనే ఇవ్వాలి

» ఎన్‌ఎంఓపీఎస్ కార్యదర్శి స్థితప్రజ్ఞ

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): పారా మిలిటరీ దళాలకు పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పింఛన్ స్కీం (ఎన్‌ఎంఓపీఎస్) కార్యదర్శి స్థితప్రజ్ఞ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడారు. ఉగ్రవాదుల చర్య అత్యంత హేయమైనదని, దీన్ని యావత్తు దేశం ఒక్కటిగా నిలబడి ఖండించాలన్నారు. మే 1న యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో జరగాల్సిన నిరసనను వాయిదా వేసి, దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉగ్రదాడులను ఖండిస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశామన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

» ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం



బాధ్యతలు స్వీకరిస్తున్న షానవాజ్ ఖాసీం

హైదరాబాద్ సిటీ, మే1(ఆంధ్రజ్యోతి): తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా నియమితులైన ఆయన నాంపల్లి ఆబ్కారీ భవన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా షానవాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ.. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను చెలామణీ చేస్తున్న ముఠాలు, కల్తీ కల్లుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తహసీల్దార్లను పాత ప్రాంతాలకు బదిలీ చేయాలి

» కొత్త సీఎస్‌తో 'ట్రెసా' ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భాల్లో బదిలీ అయిన తహసీల్దార్లను మళ్లీ వారి పాత ప్రాంతాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) ప్రతినిధులు గురువారం సీఎస్ కె.రామకృష్ణారావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కొత్త సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్‌ను కలిసినవారిలో ట్రెసా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్‌రావు, కార్యదర్శి వాణిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి వినతి పత్రం అందిస్తున్న మావోయిస్టు బాధితులు

ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలి

» ఛత్తీస్‌గఢ్ సీఎంకు మావోయిస్టు బాధితుల వినతిపత్రం

చర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని మావోయిస్టు బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, డిప్యూటీ సీఎం విజయశర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. బస్తర్‌ను మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టుల వల్ల అనేక మంది ఇబ్బందులు పడ్డారని, కొంత మంది కుటుంబాలను కోల్పోయారని పేర్కొన్నారు. ఒకవైపు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతుండగా మరో వైపు జార్ఖండ్‌లోని మహాదాండ అడవుల్లోని ఓ ప్రాంతంలో రోడ్డు పనులు నిర్వహిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను మావోయిస్టులు తగల బెట్టారు. కొద్ది రోజుల క్రితం ఇక్కడే ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. దీనికి నిరసనగానే మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని కర్రె గుట్టల్లో పదో రోజు కూంబింగ్ కొనసాగింది. మావోయిస్టుల కోసం కేంద్ర బలగాలు గుట్టలలో అణువణువూ గాలిస్తున్నాయి. గురువారం కూడా కర్రెగుట్టల్లో డ్రోన్‌లు, హెలికాప్టర్లు చెక్కర్లు కొట్టాయి. మావోయిస్టులు ఉన్నట్లు అనుమానిస్తున్న ప్రాంతాల్లో బలగాలు బాంబులు వేశాయి.

దూకుడు పెంచిన ఏసీబీ.. నెలలో 21 కేసులు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): గత ఏప్రిల్ నెలలోనే 21 అవినీతి, అక్రమాస్తుల కేసులు నమోదు చేసి ఏసీబీ అధికారులు దూకుడు కొనసాగిస్తున్నారు. ఇందులో 13 కేసులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నవేనని ఏసీబీ డీజీ విజయ్ కుమార్ తెలిపారు. అలాగే ఆదాయానికి మించి ఆస్తుల కేసులు రెండు నమోదయ్యాయని, ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 200 కోట్లకు పైగానే ఉంటుందన్నారు. 21 కేసుల్లో 20 మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎవరికైనా అవినీతికి సంబంధించిన సమాచారం తెలిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

భారీ పోలీసు బందోబస్తు మధ్య పులిచర్లకుంట తండాలో భూ సర్వే

దుద్యాల, మే 1(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పులిచర్లకుంట తండాలో గురువారం భారీ పోలీసు బందోబస్తు మధ్య భూ సర్వే చేశారు. 110 ఎకరాల్లో సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ కిషన్ నాయక్ తెలిపారు. చివరిలో కొందరు రైతులు తమకు తెలియకుండా సర్వే చేస్తారా? అంటూ ఆందోళన చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, అధికారులు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. పోలెపల్లి, హకీంపేట్, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణకు గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా గ్రామాల్లో అసైన్డ్, పట్టా భూముల్లో సర్వే చేసి రైతుల అంగీకారంతో భూములు సేకరించింది. రైతులకు పరిహారం కూడా చెల్లించింది. అయితే రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల్లో వివాదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో పులిచర్లకుంట తండాకు చెందిన ఒక రైతు ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూమి ఇచ్చాడు. మరికొందరు రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులతో తెలిపారు. దీంతో గురువారం దుద్యాల తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. గతంలో చోటుచేసుకున్న ఘటనలు, ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకొని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుస్తకాల ముద్రణకు తెలుగు వర్సిటీ ఆర్థిక సహాయం

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రచయితలు తమ రచనలను ముద్రించుకోవడానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతి ఇలా ఏ అంశానికి సంబంధించిన రచనలనైనా ముద్రించుకోవడానికి సహాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి లేదా యూనివర్సిటీలోని విస్తరణ సేవా విభాగం నుంచి పొందవచ్చని చెప్పారు. దరఖాస్తు పూర్తి చేసి ఏదేని ముద్రణా సంస్థ నుంచి పొందిన ఒక కొటేషన్‌ను జతపరిచి ఈ నెల 31వ తేదీలోపు వర్సిటీ చిరునామాకు పంపాలని రిజిస్ట్రార్ తెలిపారు.

రెండేళ్లలో 'పాలమూరు' పూర్తి

ఏడాదిలోగా కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్

» 3 నెలల్లోపు నార్లాపూర్-ఏదుల లింక్

» నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

(నార్లాపూర్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భూముల విలువలు పెరగడం, ప్రాజెక్టులకు భూములు ఇవ్వడానికి రైతాంగం ముందుకు రాకపోవడంతో భూసేకరణ క్లిష్టతరంగా మారిందని నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. భూముల సేకరణ తగ్గించుకుంటూ ప్రాజెక్టుల నిర్మాణానికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మూడు నెలల్లోపు నార్లాపూర్-ఏదుల లింక్ పనులను పూర్తిచేసి, పాలమూరు రిజర్వాయర్‌లలో 50 టీఎంసీల నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. గురువారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణ పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం వైస్‌ఛైర్మన్ చిన్నారెడ్డి, ఎత్తిపోతల పథకం సలహాదారు పెంటారెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. తొలుత నార్లాపూర్‌కు చేరుకున్న ఆయన నార్లాపూర్ పంపింగ్ స్టేషన్‌తో పాటు 6.4 టీఎంసీల సామర్థ్యం కలిగిన నార్లాపూర్ రిజర్వాయర్‌ను, ఆ తర్వాత పాలమూరు-రంగారెడ్డిలో ప్యాకేజీ-3లో ఓపెన్ కెనాల్ పనులను పరిశీలించారు. మూడు నెలల్లోగా లింక్‌ను పూర్తిచేయాలని అన్నారు. ఏ మాత్రం లాభసాటి కాకున్నా పనులు చేస్తున్నామని కాంట్రాక్టర్ చెప్పగా, గిట్టుబాటు కోసం మరో పని అప్పగిస్తామని, ఈలోగా కెనాల్ పనులు సత్వరం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు హామీ ఇచ్చారు. ఆ తర్వాత వనపర్తి జిల్లాలోని ఏదుల రిజర్వాయర్‌తో పాటు తీగలపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. 6.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లో నీటిని పంపింగ్ చేయడానికి వీలుగా ఒక్కోటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10 మోటార్లున్న దేశంలోనే అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఆ తర్వాత బిజినేపల్లి మండలం వట్టెంలోని పంపింగ్‌స్టేషన్, రిజర్వాయర్‌ను పరిశీలించారు. గత సీజన్‌లో వరదలకు వట్టెం పంప్‌హౌస్ మునగగా డీవాటరింగ్, మోటార్ల డ్రైరన్‌లను పరిశీలించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్‌లలో 50 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి వీలుగా ఉన్న ప్రతిబంధకాలన్నీ తొలగించాలని అధికారులను ఆదేశించారు. 2026మార్చిలోగా ఉద్దండపూర్ జలాశయం పూర్తిచేసి, నీటిని నిల్వ చేస్తామని ప్రకటించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎల్లూరు (కల్వకుర్తి రిజర్వాయర్)లోకి తరలించి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. ఈపథకం పూర్తి చేయడానికి అవసరమైన నిధులు, భూసేకరణ వంటి వివరాలతో ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. నార్లాపూర్‌తో పాటు వివిధ పంప్‌హౌస్‌లకు కరెంట్ కనెక్షన్ ఇవ్వడానికి వీలుగా సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం ట్రాన్స్‌కోకు రూ.262కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు.



పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

కృష్ణా జలాల్లో బీఆర్ఎస్ రాజీ

ప్రాజెక్టుల పరిశీలన అనంతరం నాగర్‌కర్నూల్‌లో విలేకరులతో మాట్లాడిన ఉత్తమ్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని కేటాయించగా, అందులో 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు కేటాయించాలని బీఆర్ఎస్ కోరిందని విమర్శించారు. 2015లో జరిగిన ఈ ఒప్పందం 2022-23 దాకా అమలయిందని, బీఆర్ఎస్ రాజీ ధోరణితో ఏపీ 511 టీఎంసీలను వినియోగించుకుందని అన్నారు. అంతేకాకుండా పలు వేదికల్లో ఈ ఒప్పం

సొరంగంలో చిక్కుకున్న ఆరు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకుపోయిన 6 కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆయా కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని మంత్రి ప్రకటించారు. టన్నెల్‌లో 50 మీటర్ల ప్రాంతం అత్యంత ప్రమాదకరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా హెచ్చరికలతో ముందు సహాయక చర్యలు ఏ విధంగా అమలు చేయాలనే దానిపై సాంకేతిక కమిటీని వేశామని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

బ్రిజేశ్ ట్రైబ్యునల్ తీర్పుపై రాష్ట్రాలతో 7న కేంద్రం భేటీ

» తీర్పును ప్రచురించేందుకు అభిప్రాయ సేకరణ



హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2) వెలువరించిన తీర్పును నోటిఫై చేయడానికి వీలుగా రాష్ట్రాల అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 7న కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రభావిత రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో సమావేశం కానున్నారు. కృష్ణా జలాల పంపిణీపై 2013 నవంబరు 29న ట్రైబ్యునల్-2 అవార్డు వెలువరించింది. దీనిని ప్రచురితం(కేంద్రం నోటిఫై) చేయొద్దని కోరుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసింది. తెలంగాణ ఏర్పడ్డాక ఆ రాష్ట్రం కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. ఈ తీర్పుపై విచారణ జరుగుతున్న క్రమంలో కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి వీలుగా కేంద్రం విధి విధానాలు జారీ చేయగా.. దీనిపై ప్రస్తుతం ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. అయితే ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి విచారణ జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ట్రైబ్యునల్ తీర్పును నోటిఫై చేయాలని మహారాష్ట్ర, కర్ణాటక కేంద్రాన్ని కోరుతున్న విషయం విదితమే. దాంతో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో ఈ నెల 7న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి భేటీ కానున్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం ఏకాభిప్రాయం కుదిరితే.. తీర్పును కేంద్రం నోటిఫై చేయనుంది. ఆ వెంటనే బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు అమలు కానున్నాయి.

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించండి

» కేంద్రానికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వినతి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శాసన సభ ఆమోదించిన బిల్లుకు చట్ట రూపం కల్పించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం సైతం చొరవ తీసుకుని అఖిల పక్షంతో ప్రధాని మోదీని కలిసి ఒప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం బీసీ కమిషన్ కార్యాలయంలో నిరంజన్ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే లక్ష్యంతో జనవరి 2024 నుంచి ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. జనాభా లెక్కలతో పాటు కుల గణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని నిరంజన్ స్వాగతించారు.

సిబ్బంది డుమ్మా.. డిగ్రీ పరీక్ష ఆలస్యం

» 5 నెలలుగా జీతాల్లేవని అలిగిన ఉద్యోగులు

» కళాశాల తాళాలు కూడా తీయని వైనం

» అధికారుల చొరవతో 2.15 గంటల ఆలస్యంగా పరీక్ష నిర్వహణ

» తూప్రాన్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో ఘటన



పరీక్ష రాసేందుకు వచ్చి కళాశాల వద్ద వేచి చూస్తున్న విద్యార్థులు

తూప్రాన్, మే 1(ఆంధ్రజ్యోతి): యాజమాన్యం తమకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదనే కారణంతో మెదక్ జిల్లా తూప్రాన్‌లోని నలంద డిగ్రీ కళాశాల సిబ్బంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారు. కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతుండగా.. గురువారం హఠాత్తుగా విధులకు డుమ్మా కొట్టారు. కనీసం కళాశాల తాళాలు కూడా తీయలేదు. దీంతో గురువారం పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు తీవ్ర భయాందోళన చెందారు. చివరికి వర్సిటీ, ప్రభుత్వ అధికారుల చొరవతో రెండున్నర గంటల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమవ్వడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. తూప్రాన్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం కంప్యూటర్ సైన్స్, గణితం, భౌతిక శాస్త్రం పరీక్షలుండగా.. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉంది. నలంద కాలేజీని నలుగురు విద్యార్థులకు పరీక్ష కేంద్రంగా కేటాయించారు. వారు నిర్దీత సమయానికి చేరుకున్నారు. కానీ, యాజమాన్యం, సిబ్బంది ఆ సమయానికి కళాశాల తాళం కూడా తీయలేదు. కాసేపు వేచి చూసిన విద్యార్థులు తమ కళాశాలకు సమాచారం ఇచ్చారు. మరోపక్క, ఓయూ నుంచి పరీక్షలకు అబ్జర్వర్‌గా ఉన్న సుదర్శన్ రెడ్డి పరీక్ష కేంద్రానికి చేరుకుని విషయం తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్డీవో ఆదేశాల మేరకు కళాశాల వద్దకు చేరుకున్న తూప్రాన్ తహసీల్దార్, పోలీసులు.. కళాశాల సిబ్బందికి ఫోన్ చేయగా ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు రావడం లేదని తేల్చిచెప్పారు. ఈలోగా కళాశాల సిబ్బంది ఒకరు వచ్చి తాళం తీయగా విద్యార్థుల తరఫున వారు సామగ్రిని ధ్వంసం చేశారు. అయితే, ప్రశ్నపత్రాలు డౌన్‌లోడ్ చేసేందుకు కళాశాలకు ఓయూ నిర్దేశించిన లాగిన్ ఐడీ లేకపోవడంతో.. జాయింట్ డైరెక్టర్ శ్రీనాథ్ ఆదేశాల మేరకు మరో కళాశాల నుంచి అధికారులు ప్రశ్నపత్రాలు తెప్పించి 2.15 గంటల ఆలస్యంగా ఉదయం 11.45 గంటలకు పరీక్షను ప్రారంభించారు. పరీక్ష నిర్వహణను తహసీల్దారు విజయలక్ష్మీ పర్యవేక్షించారు. పరీక్షలపట్ల నిర్లక్ష్యం వహించిన కళాశాల యాజమాన్యం, సిబ్బందిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బస్సు, ఆటో, బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

» మహిళతో పాటు నాలుగు పశువుల మృతి

» 11 మందికి గాయాలు.. ఇచ్చోడలో ఘటన

ఇచ్చోడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి ఆర్టీసీ బస్సు, ఆటో, బైక్‌లను ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో మహిళతో పాటు నాలుగు పశువులు చనిపోయాయి. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు 64 మందితో వెళుతుండగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కొకస్‌మన్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద పశువులు అడ్డువచ్చాయి. దీంతో డ్రైవర్ బస్సు వేగం తగ్గించాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు డివైడర్ పైకి వెళ్లి ఆగిపోయింది. రోడ్డు దాటుతున్న నాలుగు ఆవులను తప్పించబోయిన బస్సు ఒక ఆవును ఢీకొట్టింది. తప్పించుకున్న మరో మూడు పశువులపైకి లారీ దూసుకెళ్లింది. లారీ అతివేగంగా ఉండటంతో అదుపు తప్పి ముందున్న ఆటో, బైక్‌ను ఢీకొట్టింది. ఆ వెంటనే రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు, ఆటోలో ఉన్న ఐదుగురు, బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న జైనథ్‌కు చెందిన మేకల భీమక్క(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనా స్థలంలో నాలుగు పశువులు చనిపోయాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నవభావవతి.. అమరావతి!!

మహాకవులు జన సంక్షేమం కోసం సార్వకాలీన సంస్కారాలు ప్రబోధిస్తారు. సంఘర్షణలను ఎదుర్కొనే దీశక్తి నిస్తారు. భావి లక్ష్యాలను నిర్దేశిస్తారు. మహాసంకల్పాలకు సంసిద్ధులను చేస్తారు. కాలం ఏదైనా అటువంటి సంస్కారాలు, ధీశక్తులు, లక్ష్యాలు, మహాసంకల్పాల అవసరం ఎప్పుడూ ఉంటుంది. వాటిని పసిగట్టి, అవాహన చేసుకుని, మమేకమై ప్రజలు ముందుకు నడిచినప్పుడు ఆధునిక ప్రజాస్వామ్యం పరిపక్వతను పొందుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. అద్భుతాల సృష్టికి కేంద్రం అవుతుంది. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునః ప్రారంభమయ్యే నేటి శుభవేళ జనావళి అటువంటి పరిపక్వత దిశగా అడుగులేస్తేనే ఆంధ్ర ప్రగతిరథం పరుగులు పెడుతుంది.

అమరావతి ఒక రాజధాని నగరం మాత్రమే కాదు.. అదొక భావన.. జాతి పునర్నిర్మాణ పరికల్పన.. నవ నిర్మాణానికి ప్రేరణ.. రూపుకట్టే భవితను తలచుకుని పొంగుకొచ్చే అనుభూతి.. సమష్టి శ్రేయోసాధనకు ఆలంబన.. అంటూ ఎన్నో విశేషణాలతో ఆంధ్ర ఆలోచనాపరులు తాదాత్మ్యం చెందొచ్చు. ఇవన్నీ సాధారణ జనబాహుళ్యంలో ఎంత త్వరగా ఉదయిస్తే అంత త్వరగా అమరావతి ఆంధ్రావళికి జయగీతి అవుతుంది. అద్భుతమైన వాస్తుకళ ఉట్టిపడే ఆకాశ భవనాలు కట్టుకుంటే సరిపోదు. సంపద సృష్టికి, మేధో ఉత్కృష్టతకు కొత్త భావాలకు వేదికగా అమరావతి వెలుగొందాలి. మధ్యయుగాల నావికులు తమ సాహసోపేత సముద్ర యాత్రలతో కొత్త ఖండాలు, పురాతన దేశాలను కనుగొన్నట్టే సమష్టి సంక్షేమాల కోసం అమరావతి కేంద్రంగా అన్వేషణలు జరగాలి. 'అభివృద్ధి చెందిన దేశాలు కష్టపడి ఏళ్ల తరబడి చేసిన దీర్ఘయాత్రని అభివృద్ధి చెందే దేశాలు ఒక మహాముందడుగులో అందిపుచ్చుకోవాలని' విక్రమ్ సారాభాయి అన్న మాటలు ప్రేరణగా తీసుకుంటేనే అమరావతి అభివృద్ధి నిజంగానే ఊపందుకుంటుంది.

తొలుత కర్నూలులో మజిలీ చేసి, అనంతరం భాగ్యనగరం నుంచి కదలి, తుదకు అమరావతికి చేరిన ఆంధ్ర రాజధాని కోసం సంకల్పాలు ఘనంగా చెప్పుకున్నా, నిర్మాణ పథకాలను పటిష్ఠంగా రూపొందించుకున్నా భవిష్యత్తు గండాలు లేకుండా చూసుకోవటం ప్రాణావసరం. రాజకీయ కక్షలకూ, స్వార్థాలకూ అయిదేళ్లపాటు అమరావతి మూగసాక్షిగా నిలిచిపోయింది. నవ్యాంధ్ర ఆశలు, సంకల్పాలే పునాదులై లేచిన మహానిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. రాజధాని లేని రాష్ట్రంగా కొనసాగిన చరిత్ర నవభారతంలో ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే దక్కింది. భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఊపిరులు ఊది దేశంలో బలమైన సమాఖ్య వ్యవస్థ ఏర్పడటానికి కారణమైన ఆంధ్రకు ఆ దుస్థితి ఏర్పడుతుందని ఎవరూ ఊహించలేదు. ఒకటో రెండో విధానాలపై విబేధాలుంటే వాటిని ఉపసంహరించుకోవటమో, సంస్కరించటమో చాలా రాష్ట్రాల్లో జరిగింది. కానీ అందరి ఆమోదంతో ఏర్పాటైన రాజధానిని మూడుచోట్లకు మూడు ముక్కలుగా విసిరివేయటానికి అయిదేళ్లపాటు అహర్నిశలూ పథకాలు రచించటం ఆంధ్రలో మాత్రమే జరిగిన వైపరీత్యం! దీన్ని ఎదుర్కోటానికి భూములు ఇచ్చిన రైతులు కనీవినీ ఎరగని రీతిలో ఆందోళనలు చేపట్టాల్సి రావటమూ ఎక్కడా జరగలేదు. రాష్ట్ర రాజధాని కోసం స్వచ్ఛందంగా భూములు ఇవ్వటానికి రైతులు ముందుకు రావటమే దేశచరిత్రలోనే ఒక అద్వితీయ సంఘటన అనుకుంటే దానికీ ఎన్నో దుష్ట లక్ష్యాలను, ప్రేరణలను అంటగట్టటం ఆంధ్రలోనే జరిగింది. అమరావతికి ఎదురైన రాజకీయ విఘ్నాలు కళ్లముందు మెదలుతున్నా నగర విస్తరణ కోసం అవసరమైన మరిన్ని భూములు ఇవ్వటానికి రైతులు మళ్ళీ సంసిద్ధత వ్యక్తంచేయటం గొప్పగానే భావించాలి. ఎకరం భూమి వదులుకోటానికీ రైతులు ముందుకురాని పరిస్థితే దేశంలో చాలా చోట్ల ఉంది. అమరావతికి ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైతే ఎక్కడాలేని సానుకూలత ఇక్కడ ఉందనే చెప్పుకోవచ్చు. కాకపోతే భవిష్యత్తులో రాజధానిని అమరావతి నుంచి మార్చలేని విధంగా పార్లమెంటులో చట్టంచేయాలనే ప్రతిపాదన వచ్చింది. దానికి సాధ్యాసాధ్యాలు రాజ్యాంగబద్ధంగా ఉంటాయో లేవో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. గతంలోని చేదు అనుభవాలు అటువంటి డిమాండ్లు తలెత్తేలా చేస్తున్నాయి.

దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత పెట్టుబడులను ఆకర్షించటానికి ఏ రాష్ట్రం అవకాశాలను ఒకపట్టాన వదులుకోలేదు. పెట్టుబడులు ఇతరచోట్లకు పోకుండా రాష్ట్రాలు శతవిధాలుగా ప్రయత్నించాయి. ఏదో ఒకచోట ప్రాథమిక సౌకర్యాలను పటిష్ఠంగా ఏర్పాటుచేసి అక్కడికి పెట్టుబడులు తరలివచ్చేలా చేశాయి. అమరావతిలో మాత్రమే గడిచిన అయిదేళ్లలో ఆ ప్రక్రియకు గండికొట్టేలా వ్యవహారాలు జరిగాయి. పెట్టుబడులు పెట్టేవారు విధానాల్లో కొనసాగింపును కోరుకుంటారు. ఫలానాచోట రాజధాని ప్రాంతమనో, పారిశ్రామిక ప్రాంతమనో ఇచ్చిన హామీలను దృష్టిలో ఉంచుకునే పెట్టుబడులు పెట్టటానికి సంసిద్ధులు అవుతారు. అందుకే అమరావతి విషయంలో భవిష్యత్తులో మళ్లీ వెనకడుగులు పడకుండా చూడటమే పెద్ద సవాల్. జనబలంతోనే ఆ వెనుకడుగుల ప్రమాదం లేకుండా చూసుకోవచ్చు. అమరావతి అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా విధానాలు రూపొందించితే జన బలం వెన్నంటే ఉంటుంది. అదే అమరావతికి శ్రీరామరక్ష!

ఆవేదనలోనూ మతం ఉన్నదా?

ఈ దుఃఖ సమయంలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జీవించి ఉంటే ఏమి చేసి ఉండేవారు? కలకత్తా, నౌఖాలిలో ఛిద్రమైన మానవతను చిగురింప జేసినట్లుగానే ఆయన ఇప్పుడు కూడా కచ్చితంగా పహల్గాంకు వెళ్లి, ఉగ్రవాద బీభత్స బాధితుల కుటుంబ సభ్యులను, ఆ ఘాతుకం నుంచి ఎలాగో బయటపడ్డ వారిని పరామర్శించేవారు. వారితో కలిసి ప్రార్థనలు చేసేవారు. వేద మంత్రాలు పఠించాలని, భక్తి గీతాలు గానం చేయాలని, ఖురాన్ ప్రవచనాలు చదవాలని పట్టుబట్టి ఉండేవారు. పహల్గాంలోనే ఉండిపోయి వీధులలోను, కొండవాలుల్లోను సంచరిస్తూ ప్రతి గృహానికి, ప్రతి దుకాణానికి వెళ్లి గృహస్థులు, దుకాణదారులు, పట్టణవాసులు చెప్పేది సావధానంగా వినేవారు.

వారి చేతులను ఆత్మీయంగా తన చేతుల్లోకి తీసుకునేవారు. అంతులేని వ్యాకులత, వీడని భీతిలో ఉన్న వారు తమ పనులు తాము చేసుకునేందుకు సహాయపడేవారు. 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే కదా', వేదనకు సామాజిక అంతరాలు ఉండవని, జీవన వ్యాపకాలు కొనసాగేందుకు ఒకరికొకరు తోడ్పడుకుంటూ సమష్టిగా ముందుకు సాగాలని గాంధీ చెప్పి ఉండేవారు. గాంధీ ప్రేమానురాగాలు నిర్వీకమైనవి. సామాజిక విధుల పాటింపును ఆయన పట్టించుకునేవారు కాదు. సమాజ నిర్దేశాలు మానవతా మమతలు పంచేందుకు ఆటంకాలు అని ఆయన భావించేవారు. మనిషి శ్రేయస్సు పట్ల ఎటువంటి సంకుచితత్వాలు లేని ఈ ఆరాటమే, గాంధీతో విభేదించేవారితో సహా ఎంతో మంది, ఆయనను మహాత్ముడుగా గౌరవించేలా చేసింది. ఒక మతోన్మాది కాల్పులకు ఆయన బలై 77 సంవత్సరాలు గడిచిపోయాయి. పహల్గాం సృష్టించిన ఈ దురవస్థలో నా ఆలోచనలు ఆయన వైపుకు మళ్లాయి. ఆ మహనీయ మానవతా స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి కదా.

ఉగ్రవాద దాడుల్లో చనిపోయిన వ్యక్తుల మత నేపథ్యం గురించి నేను సాధారణంగా ప్రస్తావించను. కుల మతాలు, మరేయితర సామాజిక అంతరాలకు అతీతంగా ప్రతి మనిషి జీవితమూ చాలా విలువైనది. మానవత అఖండమైనది. ప్రతి సామాన్యుడి జీవితమూ దానిలో ఒక అంతర్భాగం. ఉగ్రవాద ఘాతుకంలో, ఏ మతం వాడైనా లేదా నాస్తికుడు అయినా ఒక వ్యక్తి జీవితం ఛిద్రమైపోవడం మన మనసును గాయపరుస్తుంది, మన ఆత్మను చీల్చివేస్తుంది. మనలను ఒక నిస్సహాయత ఆవహించేలా చేస్తుంది. ఏమి చేయాలి? ఏమి చేయాలో తెలియని పరిస్థితిలోకి మనలను నెట్టివేస్తుంది. దురాగతానికి పాల్పడినవారు తాము నిర్దిష్టంగా ఎవరిని లక్ష్యంగా చేసుకున్నది సందేహాతీతంగా చెప్పినప్పటికీ మన దుఃఖాలు, ఆవేదనలకు హత్యకు గురైన వారి సామాజిక– మత అస్తిత్వాలు కారణాలు కాకూడదు. బాధితుల సామాజిక, మత నేపథ్యాలను బట్టి మన ఆవేదనలు ఉండకూడదు. ఇది అరిగిపోయిన మాటే అయినప్పటికీ నేను మళ్లీ మళ్లీ చెప్పుతాను. ఉగ్రవాదులకు మతం లేదు. ఉగ్రవాదమే వారి మతం. తమది ఫలానా మతం అని వారు చెప్పవచ్చు. ఆ మతాన్ని తమ చర్యకు ఉపయోగించుకుని ఉండవచ్చు. అయితే అలా చేసే హక్కు వారికి లేదు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలను ఏ ప్రభుత్వమైనా చేపట్టి తీరాలి. హింసాకాండ, జాతి విద్వేషం, మత మౌఢ్యాన్ని తిరస్కరించిన మనుషులుగా ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు మనమూ పూనుకోవాలి. పౌర సమాజ సభ్యులుగా అది మన కర్తవ్యం.



కుల మతాలు, ఇతర సామాజిక అంతరాలకు అతీతంగా ప్రతి మనిషి జీవితమూ చాలా విలువైనది. ఉగ్రవాద ఘాతుకంలో, ఏ మతంవాడైనా, నాస్తికుడు అయినా ఒక వ్యక్తి జీవితం ఛిద్రమైపోవడం మన మనసును గాయపరుస్తుంది, మన ఆత్మను చీల్చివేస్తుంది. మనలను ఒక నిస్సహాయత ఆవహించేలా చేస్తుంది. దురాగతానికి పాల్పడినవారు తాము నిర్దిష్టంగా ఎవరిని లక్ష్యంగా చేసుకున్నది చెప్పినప్పటికీ మన దుఃఖాలు, ఆవేదనలకు హత్యకు గురైన వారి సామాజిక– మత అస్తిత్వాలు కారణాలు కాకూడదు.

అయితే నేడు బాధితుల మత అస్తిత్వం గురించి ప్రస్తావించకుండా ఉగ్రవాద దురాగతాల గురించి మాటా మంతీ జరపలేకపోతున్నాం. అలా చేయడంలో మనం ఒక సామాజిక బృందం పట్ల మన అపేక్షను వ్యక్తం చేస్తున్నాం. మరో వర్గం ప్రజల పట్ల వేలెత్తి చూపుతున్నాం. లేదా ఈ రెండిటి మధ్య ఒక సమతౌల్యతను పాటిస్తున్నాం. ఈ మూడు రకాల వైఖరులను మనం జాగరూకతతో ప్రదర్శిస్తున్నాం. ఈ బలవంతానికి ఆవలివైపు కొన్ని ఆశలు ఉన్నాయి. ప్రతి ఖండన మూల్యాంకనమవుతుంది. ఉగ్ర చర్యను ఖండించిన వ్యక్తి బాధితుడి సామాజికవర్గానికి చెందినవాడైతే బాధను వ్యక్తం చేయడంతో సరిపోతుంది. అయితే ఉగ్ర ఘాతుకానికి పాల్పడిన మతానికి చెందినవాడైతే ఆ ఖండన హెచ్చుస్థాయిలో ఉండాలని ఆశిస్తారు. ప్రతిస్పందన అంతకంటే ఏ మాత్రం తక్కువగా ఉన్నా ఆ వ్యక్తి మీద ఆరోపణలు వెల్లువెత్తుతాయి, వెలివేతకు దారితీస్తుంది. జనం ఇలా ఒక ఉచ్చులో చిక్కుకొని, తాము ఎటున్నాము, మిగతావారు తమను ఎలా చూస్తున్నారన్న సంశయంలో ఇరుక్కుంటారు. ఇలా ఆచి తూచి స్పందించాల్సిన పరిస్థితికి లోనైనప్పుడు దుఃఖం అనేది కేవలం ఒక బాహ్య వ్యక్తీకరణగా, ఒక ముసుగులాగా మిగిలిపోతుంది.

దుఃఖం ఒక శక్తిమంతమైన మానవానుభవం. మనలను సృజనాత్మక జీవులుగా పరివర్తన చెందించే శక్తి దానికి ఉన్నది. దుఃఖ సమయంలో సామాజిక చిరునామాలు అదృశ్యమవుతాయి, విభేదాలు, వ్యత్యాసాలు క్షయిస్తాయి. ఆనందం సైతం ఏకం చేయలేని విధంగా దుఃఖం మనుషులను సమైక్యపరుస్తుంది. సంతోష సంబరాల నుంచి మనం తేలిగ్గా వెనక్కి వెళ్లిపోగలం. అయితే బాధతో రోదించినప్పుడు, కుంగిపోయినప్పుడు మన చెంతనే ఎవరూ ఉన్నా వారిని చుట్టుకుపోతాం. పరస్పరం ఓదార్చుకుని సాంత్వన చెందుతాం. ఈ అనుద్దేశపూర్వకమైన భాగస్వామ్యంలో ఎటువంటి నిర్ణయమూ లేదు. ఒకసారి బాధాతప్త సమూహంలో భాగమైపోయినప్పుడు దాని నుంచి మనలను మనం విడదీసుకోవడం చాలా కష్టం. భావోద్వేగ సామీప్యత ప్రభావం మనలను వేరుపడనీయదు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ తమ నిజభావాలకు విరుద్ధంగా ప్రవర్తించరు. ఈ మానవ ప్రవృత్తి కారణంగానే పహల్గాం, దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఉగ్రవాద ఘాతుకం సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. ఆ దురాగతం తమకు ఏమి చేసిందో ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నప్పుడు వారి మాటల్లో ఆ మానవతా సున్నితత్వం మనకు అవగతమవుతుంది. వారి మాటల్లో ఆవేదన మనకు విశదమవుతుంది. ఆ దుర్మార్గ ఘటన తమ గడ్డపై జరిగినందుకు వారు లజ్జాభావంతో కుంగిపోతున్నారని కూడా మనం అర్థం చేసుకుంటాం. దురదృష్టవశాత్తు పహల్గాం ఉగ్రచర్యకు సాక్షులుగా ఉన్నవారి, ఆ ప్రాంతంలో నివసించే వారి ఆవేదనాపూరిత మాటలను ఉపేక్షించడం జరుగుతోంది.

పహల్గాం విషయమై మాట్లాడేవారు నాతో సహా ఎవరూ కశ్మీర్‌లో నివసిస్తున్నవారు కాదు, ఆ ఉగ్రవాద దాడికి ప్రత్యక్షంగా ప్రభావితమైనవారూ కాదు. అయినప్పటికీ ఆ ఘటన విషాదానికి సంబంధించి హృదయాన్ని మెలిపెట్టే కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఆ తీవ్ర మనోవ్యాకులతతో మనం ఏం చేస్తున్నాం? ఆ విషాద అనుభవంతో మనం అంటిపెట్టుకుని ఉండాలి. పరిసరాల నైసర్గిక శోభను వీక్షిస్తూ తన్మయులై ఉన్నవారు ఉగ్రవాద నైచ్యం కారణంగా కొద్ది నిముషాలలో నిండు జీవితాలను కోల్పోవడం ఎంత బాధాకరమైన విషయం! ఆ కఠోర వాస్తవాన్ని అంగీకరించేందుకు ఎంతగా గింజుకోవాలి? అయితే మనం అందుకు బదులుగా ఆ ఘాతుక చర్యకు బలయిన మనుషులను మరచిపోయి, వారిని ఫలానా సామాజిక సమూహాలకు చెందినవారుగా గుర్తిస్తున్నాం. ఆగ్రహాన్ని, విద్వేషాన్ని వ్యక్తం చేస్తున్నాం. దుఃఖాన్ని అతిక్రమించినప్పుడు మనం ఇతరుల బాధల్లో పాలుపంచుకోలేం. సహానుభూతిని వ్యక్తం చేయలేం. ఆత్మరక్షణ కొరవడిన మానవ దుర్బలత్వాన్ని నిర్నిబద్ధంగా పంచుకోలేము.

సామాజిక అనుబంధాలు రెండు విధాలుగా ఉపయోగపడతాయి. ఒకరు హిందువు అయితే, ఉగ్రదురాగతం పట్ల ఆవేదన వ్యక్తం చేసేందుకు ఆ ఘటన బాధితులు హిందువులు అన్నది స్పష్టమవడం తప్పనిసరి అవుతుంది. హతుడి మత అస్తిత్వం తెలియనప్పుడు బాధ వ్యక్తీకరణ హృదయపూర్వకంగా ఉండదు. హిందువులు 'ఇతరులు' మాదిరిగా తమ సొంత మతస్థుల 'బాగోగుల'కు ఒకటి కారనేది మరో ఆరోపణ. ఈ కారణంగా పహల్గాం విషాద ఘటనను మత సంఘీభావాన్ని పెంపొందించేందుకు ఉపయోగిస్తున్నారు. ఆ ఉగ్రచర్యను ఏవగించుకుంటున్నవారు కూడా ఇస్లాంను, ముస్లింలను నిందిస్తున్నారు. ఘాతుకానికి పాల్పడినవారిని ముస్లింలుగా పేర్కొనకపోతే ఆ దుష్కార్య ఖండన ఒట్టి దగా అని ఆక్షేపిస్తున్నారు. ఇదీ మనలను మనం, ఇతరులను భావిస్తున్న తీరు అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే భిన్న ప్రజలతో నెలకొల్పుకుంటున్న సంబంధాలు గురించి మనం విస్మయపడవలసి ఉన్నది. మన సాహచర్యాలూ, సంసర్గాలూ అన్నీ సామాజిక వర్గీకరణలతో ముడివడి ఉన్నప్పుడు ఆ సంబంధాలు నిజమైనవి అవ్వవు. అయినప్పుడు నిజమైన ప్రేమ ఎక్కడ మనకు లభ్యమవుతుంది?

తాత్వికుడు జిడ్డు కృష్ణమూర్తి నుంచి ఒక విలువైన మాటతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. ఒక భిన్న సందర్భంలో ఆయన ఇలా చెప్పారు: 'ప్రేమ ఆలోచన కాదు, ప్రేమ జ్ఞాపకమూ కాదు... ఈర్ష్య, ద్వేషం, హింస.. ఇలా ప్రేమ కాని ప్రతి దాన్నీ మనం తిరస్కరించాలి'.



(ద టెలిగ్రాఫ్)

◆ **టి.ఎమ్. కృష్ణ**
కర్ణాటక సంగీతవేత్త, ప్రజా మేధావి

చతికిలబడ్డ సంస్థలనూ సత్సంకల్పంతో సరిదిద్దవచ్చు

సర్వసాధారణంగా ప్రభుత్వ కార్పొరేషన్లు నష్టాల బాటలో పయనిస్తుంటాయి, ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తూ ఉంటాయి. వాటిని బాగు చేయడం అసాధ్యమనే నిర్లిప్త ధోరణి కూడా ఆయా శాఖల అధికారుల్లో కనిపిస్తుంది. కానీ అంకితభావం, ఆసక్తి, తాపత్రయం ఉంటే ఆ కార్పొరేషన్లను నష్టాల్లోంచి బయటపడేయటమే కాదు, వాటిని లాభాల బాట పట్టించి ప్రభుత్వానికి ఆసరాగా నిలబడేలాగా చేయవచ్చు. ఉదాహరణకు అటవీ అభివృద్ధి సంస్థనే తీసుకుందాం..

'కమిషన్ ఆన్ అగ్రికల్చర్' సిఫారసుల మేరకు 1975 జూన్ 16న ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఏర్పడింది. ఉడ్ ప్లాంటేషన్, అమ్మకాలే ప్రధాన లక్ష్యంగా 75 లక్షల రూపాయల మూలధనంతో ఇది ఏర్పాటైంది. వెదురు, యూకలిప్టస్, సుబాబులు, టేకు, పైన్స్ వంటి వృక్షాల కలపను అమ్మడం ద్వారా ఈ సంస్థ ఆదాయాన్ని పొందడానికి ప్రయత్నించేది. ఇందులో ప్రధానమైనది పేపర్ ఉత్పత్తికి వాడే పల్ప్‌ఉడ్. ప్రారంభంలో యూకలిప్టస్ ప్లాంటేషన్ల నుంచి వచ్చే పల్ప్‌ఉడ్‌ను మొదట ఉజ్జాయింపుగా (శాంపుల్ ప్లాట్) లెక్కించి, అప్పటి ఉమ్మడి ఏపీలోని పేపర్ మిల్లులకు మాత్రమే టెండర్ల ద్వారా అమ్మేవారు. టెండర్‌కు ధర టన్నుకు ఇంత అన్నట్లుగా టెండర్లు పిలిచేవారు. ఆ మొత్తం చెల్లించాక, ఆ పల్ప్ ఉడ్ తీసుకుపోవడానికి సదరు టెండర్‌దార్లకు దాదాపు రెండు నెలల సమయం ఇచ్చేవారు. కానీ ఈ ప్రక్రియలో ఓ సమస్య ఉండేది. శాంపిల్ ప్లాట్ విధానంలో 100 హెక్టార్ల ప్లాంటేషన్‌లో దాదాపు ఒక హెక్టారును ఎంచుకుని అందులో ఉన్న మొత్తం చెట్లు నరికి, దాంతో వచ్చిన పల్ప్‌ఉడ్ మందాన్ని లెక్కగట్టేవారు. ఇలా కేవలం ఉజ్జాయింపుగా లెక్కించి అమ్మే విధానం ద్వారా పల్ప్‌ఉడ్ లెక్కల్లో దాదాపు 50 శాతం వరకు తేడా వచ్చేది. దీంతో సంస్థకు భారీగానే నష్టాలు వచ్చేవి. పేపర్ మిల్లు వారు ఈ పల్ప్‌ఉడ్‌ను దాదాపు 50 రోజుల వరకు ఎండలోనే ఉంచి, అది పూర్తిగా ఆరాక చివరి పది రోజుల్లో తీసుకెళ్లి ఎఫ్‌డీసీ స్టాఫ్ సమక్షంలో తూకం వేసేవారు. ఈ కారణంగా పల్ప్ ఉడ్ దాదాపు 30–35శాతం తేడా వచ్చేది.



యూకలిప్టస్‌ను సెల్యులోజ్ ప్రాతిపదికన, వాటి ఘన పరిమాణం(గర్త్) ఆధారంగా అమ్మాలని కోరుతూ పై అధికారులకు నేను నివేదికలు పంపాను. ఈ విధానాన్ని 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆమోదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది ఆచరణలోకి రాలేదు. ఎట్టకేలకు 2004లో అప్పటి ఎఫ్‌డీసీ ఎండీ కేఎస్ రావు చొరవతో నా ప్రతిపాదన కార్యరూపం దాల్చింది.

నేను 1995లో ఐఎఫ్ఎస్ అధికారిగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఫ్‌డీసీ హైదరాబాద్ రీజియన్‌లో 'రీజనల్ మేనేజర్'గా బాధ్యతలు చేపట్టాను. అప్పటి వరకూ అనుసరిస్తూ వస్తున్న విధానం ద్వారా సంస్థకు నష్టం వస్తుందని గ్రహించాను. నేను బి.టెక్ (కెమికల్ ఇంజనీర్, ఆర్ఈసీ వరంగల్ నుంచి) కాబట్టి పేపర్ ఉత్పత్తి కర్రతేమపై కాకుండా, సెల్యులోజ్ కంటెంట్ పైనే ఆధారపడి ఉంటుందని నాకు తెలుసు. పేపర్ ఉత్పత్తిలో వాడే పల్ప్‌ఉడ్ సేకరణ విధానం, అమ్మకాల్లో ఎంతో ప్రయోగాత్మక కృషి చేశాను. యూకలిప్టస్‌ను సెల్యులోజ్ ప్రాతిపదికన, వాటి ఘన పరిమాణం(గర్త్) ఆధారంగా అమ్మాలని కోరుతూ నా పై అధికారులకు నివేదికలు పంపాను. ఈ విధానాన్ని 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆమోదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది ఆచరణలోకి రాలేదు. ఎట్టకేలకు 2004లో అప్పటి ఎఫ్‌డీసీ ఎండీ కేఎస్ రావు చొరవతో నా ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. ఇందులో యూకలిప్టస్‌ను కలపను ఆ చెట్ల జీబీహెచ్ (చెట్టు మొదలు నుంచి ఎంత ఎత్తులో నరకాలో నిర్ణయించే కొలత) గర్త్ నిర్ణయించడం, ప్లాంటేషన్ చేసిన ఏడేళ్ల తర్వాత పల్ప్‌ఉడ్‌ను హార్వెస్టింగ్ చేయడం, నరికిన రెండు రోజుల్లోపే కలపను తూకం వేయడం, పల్ప్‌ఉడ్‌ను వాల్యూమ్ బేసిస్‌లో అమ్మడం వంటి ప్రయోగాత్మక అంశాలున్నాయి. ఈ ప్రతిపాదనల అమలులో కొన్నిసార్లు నేను పై అధికారుల నుంచి ఒత్తిళ్లనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా వెనక్కి తగ్గలేదు.

టేకు చెట్ల హార్వెస్టింగ్‌లోనూ అప్పటి వరకూ ఉన్న విధానాలకు స్వస్తి పలికి, కొత్త విధానాలను తీసుకువచ్చాను. ఈ విధానాల ద్వారా సంస్థకు అదనపు ఆదాయాన్ని సమకూరేలా చేయగలిగాను. అలా ఈ పద్ధతుల ద్వారా 2008 నాటికే గతంతో పోల్చితే దాదాపు మూడు రెట్ల ఆదాయం వచ్చింది. ఈ ఎఫ్‌డీసీ (ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థ తనకు సంబంధించిన బ్యాంకు రుణాలన్నింటినీ 2016–17 మధ్య కాలం నాటికి తీర్చేసింది. మొత్తంగా చూస్తే 2003–04లో కేవలం రూ.7 కోట్లుగా ఉన్న ఉమ్మడి రాష్ట్ర ఎఫ్‌డీసీ నికర ఆదాయం 2024–25 నాటికి సుమారు రూ. 700 కోట్లకు చేరింది. ఇందులో 90 శాతం ఆదాయం యూకలిప్టస్ పల్ప్‌ఉడ్ నుంచే వస్తోంది. నా ప్రయోగాత్మక విధానం విజయవంతం కావడంతో, ఆ ప్రక్రియను ప్రస్తుతం తెలంగాణ ఎఫ్‌డీసీలో "Sammi Reddy's Method of 100 Trees Data" విధానం అంటూ నా పేరుతో పిలుస్తున్నారు.

ఈ ప్రయోగం సత్ఫలితాలను ఇస్తున్న క్రమంలో 2006 లోనే ప్రధానమంత్రి అవార్డుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం నా పేరును సిఫారసు చేసింది. భవిష్యత్తులోనూ అటవీ కార్పొరేషన్ లాభాల బాటలో పయనించాలంటే ఈ విధానాన్ని ఇలాగే కొనసాగించడంతో పాటు నేటి తరం అటవీ అధికారులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే అటవీ శాఖ అభివృద్ధికి కృషి చేయాలి.



• **సి. సమ్మిరెడ్డి**
ఐఎఫ్ఎస్, (రిటైర్డ్), 94939 76719

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

తెలుగుభాష ఇక్కట్లపై సమాలోచన సభ

దశాబ్దాలుగా తెలుగు భాష వినిమయం, ప్రాభవం పెరగడానికి తీసుకోవలసిన చర్యలను ప్రభుత్వాలకు తెలుగుభాషాభిమానులు నివేదిస్తూనే ఉన్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరుగుతున్న కొద్దీ విద్యలో తెలుగు ప్రాధాన్యత తగ్గిపోవడం, 'మీరు తెలుగు చదువుతున్నారా' అని అవమానకరంగా మాట్లాడటం అనుభవిస్తూ ఆందోళన పడుతున్నారు. జన వ్యవహారం వల్ల తెలుగు భాష సజీవంగా ఉంటుంది కావచ్చు. కానీ, ప్రపంచంలో అన్ని మాతృభాషలు కాలంతో పాటు ప్రగతిలో, ప్రామాణిక పదసంపద వృద్ధిలో ముందుండగా తెలుగు ఎందుకు విద్యలో, పాలనలో, న్యాయ స్థానాలలో తన స్థానం కోల్పోవటం అని విచారపడుతున్నారు. పూనిక వహించవలసిన ప్రభుత్వాలు తెలుగు ప్రగతికి ఒక విధానాన్ని ఎందుకు రూపొందించి అమలు చేయలేకపోతున్నాయని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్న వారి వైఫల్యం వల్ల తెలుగు భాషకు ఇక్కట్లు తప్పడం లేదు.

రాష్ట్రంలో విద్యలో అన్ని స్థాయిల్లో ఒక అభ్యసన విషయంగా తెలుగును ప్రవేశపెడతారని, ఒక విధానమంటూ రూపొందిస్తారని అందరూ ఆశించారు. కానీ ఓరియంటల్ కళాశాలలు, పండిత శిక్షణ కళాశాలలను మూసివేస్తున్నారు. సంస్కృతం ప్రవేశపెడుతూ అభ్యసనంలో ఏకంగా తెలుగునే కనుమరుగు చేస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు, కవులు, రచయితలు, చట్టసభల సభ్యులు పూనిక వహించవలసిన అగత్యం ఏర్పడింది. ఈ పరిస్థితిని చర్చించడానికి హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాల్‌లో మే 3వ తేదీ ఉదయం పది గంటలకు సమాలోచన సభ జరగనున్నది. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి చర్చను ప్రారంభిస్తారు. ప్రొ. జి.హరగోపాల్, గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, డా. శ్రీరంగాచార్య, మోతుకూరు నరహరి, డా. డి.చంద్రశేఖర్‌రెడ్డి, డా. నందిని సిధారెడ్డి, అల్లం నారాయణ, ప్రొ. పిల్లలమర్రి రాములు, కె.శ్రీనివాస్, యాకూబ్, ప్రొ. సాగి కమలాకర శర్మ, డా. సిల్మా నాయక్, వెల్దండి శ్రీధర్ తదితరులు చర్చలో పాల్గొంటారు.

– **తెలుగు భాషాభిమానులు**, తెలంగాణ

సమస్యలకు పరిష్కారం చూపే 'భూభారతి'

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో కేవలం రెండు ఆర్వోఆర్ చట్టాలు మాత్రమే వచ్చాయి. 1948, 1971లలో నాటి పాలకులు తెచ్చిన ఈ చట్టాలు చరిత్రలో నిలిచిపోయాయి. రాష్ట్రంలో ప్రస్తుతం భూ రికార్డులకు ప్రామాణికమైన ఖాస్రా పహాణీ, సేత్వార్, సెసాల వంటివి 1948 చట్టం ద్వారానే రూపొందించారు. 1971చట్టం ద్వారా తెచ్చిన భూ రికార్డును తెలిపే 1–బి రిజిస్టర్ ఎంతో ఉపయోగకరం. 1948ఆర్వోఆర్ చట్టంలో స్వల్ప మార్పులను చేసి 1971 చట్టాన్ని రూపొందించారు. కొంత ఆలస్యమైనా చట్టాలకు అనుగుణంగా వాటికి రూల్స్‌ను కూడా రూపొందించి అందుబాటులోకి తెచ్చారు. నాటి పాలకులు, అధికారులు ప్రజల కోణంలో నుంచి ఆలోచించి తెచ్చిన చట్టాలు కావడంతో అవి పది కాలాల పాటు ఉన్నాయి. ఈ చట్టాల అమలుతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతమైంది. కానీ ధరణి–2020 చట్టం ఇందుకు పూర్తిగా భిన్నమైనది.

ధరణిలో ఎలాంటి రూల్స్‌ను రూపొందించలేదు. ఇదే కాకుండా ఎలాంటి కొత్త రికార్డును తయారు చేయలేదు. 1971 చట్టం ప్రకారం హక్కుల రికార్డుగా ఉన్న 1–బి రికార్డే ఇందులోనూ హక్కుల రికార్డుగా కొనసాగింది. ధరణి పుణ్యమా అని గ్రామ, మండల స్థాయిలో అందాల్సిన సేవలు జిల్లా, రాష్ట్ర రాజధానులకు చేరాయి. రైతుకు ఏ చిన్న సమస్య వచ్చినా సీసీఎల్ఏకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ధరణిలో తప్పుల సవరణకు రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలూ లేవు. అంతేకాదు, ఏ చిన్న భూ సమస్య వచ్చినా కోర్టు మెట్లెక్కాల్సిందే.

రాష్ట్రంలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో రేవంత్‌రెడ్డి సర్కార్ నూతన చట్టం 'భూమి హక్కుల రికార్డు 2025' భూభారతి తీసుకొచ్చింది. నాటి పాలకులు ధరణి అని పేరు పెడితే, నేటి పాలకులు భూభారతి అని పేరు పెట్టుకున్నారు అనుకోవచ్చు. కానీ ఈ చట్టం కోసం దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలవుతోన్న ఆర్వోఆర్ చట్టాలను అధికారులు అధ్యయనం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులకు అనుగుణంగా రెవెన్యూ చట్టాల్లో తేవాల్సిన మార్పులతో పాటు భూ సంస్కరణలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

సామాన్య రైతులకు అర్థమయ్యేలా, మరోవైపు ఆధునిక టెక్నాలజీతో భూభారతి రూపకల్పన చేశారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ చట్టాలకు, ఆధునిక టెక్నాలజీకి అనుసంధానంగా ఉండేలా భూభారతిని తీర్చిదిద్దారు. గత ప్రభుత్వం సాదా బైనామాలను క్రమబద్ధీకరిస్తామనడంతో సుమారు 10 లక్షల దరఖాస్తులొచ్చాయి. కానీ ధరణిలో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం లేదు. ఇదే కాకుండా 2017లో చేసిన భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో వివిధ రకాల భూ సమస్యలున్న సుమారు 18 లక్షల ఎకరాల భూమిని 'పార్టు–బి'లో చేర్చి వదిలేశారు. అవి కూడా ధరణికి దూరమయ్యాయి. ఇవే కాకుండా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, ఇనాం భూములకు ఓఆర్‌సీ పొందిన, వారసత్వంగా వచ్చిన భూములను సైతం ధరణిలో చేర్చే అవకాశం లేదు. భూభారతిలో ఇలాంటి అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. వీటికి కావాల్సిన విధి విధానాలను కూడా భూభారతిలో రూపొందించారు. జూన్ 2, 2014 కంటే ముందు సాదా బైనామా పద్ధతిలో భూమిని కొనుగోలు చేసి, క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్డీఓ స్థాయిలో విచారణ చేసి ఈ భూభారతి ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వనున్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు తహసీల్దార్ స్థాయిలోనే విచారణ చేసి హక్కుల రికార్డులో మ్యుటేషన్ చేయనున్నారు. ఇదే తరహాలో హక్కుల రికార్డులో తప్పుల సవరణకు కూడా ఆర్డీఓ, జిల్లా కలెక్టర్లకు అధికారం ఇచ్చారు.

భూభారతి చట్టంతో పాటు ఏకకాలంలో రూల్స్‌ను కూడా తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం మంచి పని చేసింది. ఇదే విధంగా రెవెన్యూ ట్రిబ్యునల్స్‌ను కూడా మూడంచెలలలో ఏర్పాటు చేస్తే భూభారతి లక్ష్యం నూరు శాతం నెరవేరనుంది.



భూభారతిలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లు, జారీ చేసిన పాసు పుస్తకాలు, భూదార్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై జిల్లా కలెక్టర్‌కి రెండో అప్పీల్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ఆర్డీవో చేసిన మ్యుటేషన్లు, సాదాబైనామాల క్రమబద్ధీకరణపై అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్ తీర్పుపై భూమి ట్రిబ్యునల్‌కు రెండో అప్పీల్‌కు కూడా పోయేలా భూభారతిలో అవకాశాన్ని కల్పించారు. ధరణిలో దగాపడిన వారికి భూభారతిలో అనేక వెసులుబాట్లు కల్పించారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి ఏడాది పాటు అవకాశం ఇచ్చారు.

ప్రభుత్వ భూములకు పాసు పుస్తకాలు జారీ చేస్తే, దాన్ని విచారించి పాసు పుస్తకం రద్దు చేసే అధికారం సీసీఎల్ఏకు ఇచ్చారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు తహసీల్దార్, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులను కూడా బనాయించే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా రికార్డులను ట్యాంపర్ చేసినా, నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసినా అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే వారిని సర్వీసు నుంచి తొలగించే ప్రమాదం కూడా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భూ సమస్యలకు సంబంధించి పేదలు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు న్యాయ సేవా సంస్థలు, ఇతర సంస్థల ద్వారా ఉచిత న్యాయ సాయం కూడా అందించనున్నారు. భూభారతి చట్టంతో పాటు ఏకకాలంలో రూల్స్‌ను కూడా తెచ్చి ప్రభుత్వం మంచి పని చేసింది. ఇదే విధంగా రెవెన్యూ ట్రిబ్యునల్స్‌ను కూడా మూడంచెలలలో ఏర్పాటు చేస్తే భూభారతి లక్ష్యం నూరు శాతం నెరవేరనుంది. ప్రభుత్వం వెంటనే ఆ దిశగా ఆలోచన చేస్తే సివిల్ కోర్టులతో సంబంధం లేకుండా జిల్లా స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

■ **ఎన్. యాదగిరిరావు**
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

సంస్కృతం.. మార్కుల భాష కాదు

తెలుగు పండితులారా! సంస్కృతం కేవలం మార్కుల భాష అని తక్కువ చేయకండి. ఇటీవలి కాలంలో కొందరు సంభాషణా సంస్కృతంపై అవగాహన లేనివారు, భావోద్వేగంతో కూడిన కొందరు తెలుగువేత్తలు "సంస్కృతం మార్కుల కోసం నేర్చే భాష మాత్రమే" అని విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇది ఒక దుష్ప్రచారమే కాకుండా, ఒక పవిత్ర భాష ప్రతిష్ఠను అపహసించే వాదన. తెలుగు, సంస్కృత భాషలు– ఒకటి అపూర్వమైన మాధుర్యం, మరొకటి ఆలోచనల అమృతం. ఈ రెండు భాషల్ని నేర్చుకునే విద్యార్థికి జీవితం భవితవ్యంగా మారుతుంది. మేధస్సు వికాసమవుతుంది. సంభాషణ సంస్కృతాన్ని మనం నేర్చుకుంటేనే మన విద్యార్థులకు మూలభాషల గొప్పతనం, భావవ్యక్తీకరణ నైపుణ్యం బోధించగలం. మన సంస్కృతి, గౌరవం, భవితవ్యాన్ని నిలబెట్టే మార్గం తెలుగు, సంస్కృత భాషల కలయిక. మనం ఈ రెండింటినీ విభేదింపజేయకుండా ఒకదానినొకటి పోషించేలా భావి దిశను నిర్దేశించాలి.

– **నటరాజ్**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శుక్రవారం 2 మే 2025

పేరుకు ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పేరుంది. కానీ ఇక్కడి పరిస్థితి మాత్రం 'పేరుగొప్ప.. ఊరుదిబ్బ' అన్న చందంగా ఉంది. సుమారు 117ఎకరాల్లో ఏనుమాములలో నిర్మించిన ఈ మార్కెట్‌లో ఏటా సుమారు రూ.50కోట్లకు పైగానే లావాదేవీలు జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే మార్కెటింగ్ శాఖలో ఎంతో కీలకమైందిగా గుర్తింపు ఉంది. అలాంటి మార్కెట్‌లో సర్వం సమస్యలే.. సమస్తం అస్తవ్యస్తంలా మారింది. మార్కెట్‌కు వచ్చే రైతులకు కనీస వసతులు దేవుడెరుగు.. కనీసం అరుగాలం శ్రమించిన పంటలకు రక్షణ కూడా లేకుండా పోయింది. మార్కెట్‌లో అడ్తీదారులు, ఖరీదుదారులు సిండికేట్‌గా మారి ధరల్లో కోత పెడుతూ రైతులను నిలువునా దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రెండున్నరేళ్లుగా పాలక మండలి.. రెండు నెలలుగా కార్యదర్శి లేకపోవడంతో సమస్యలను ఎవరికీ చెప్పుకోలేక రైతులు దిగాలు చెందుతున్నారు. మెజారిటీ కోల్డ్‌స్టోరేజీలు సైతం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లటంతో దళారులు చెప్పిన ధరకు పంటలను అమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులున్నారు. మార్కెట్‌లో సిబ్బంది కొరత కూడా వేధిస్తుండటంతో రైతులు ఆగమవుతున్నారు. పర్యవేక్షణ కరువై.. వరంగల్ వ్యవసాయ మార్కెట్ దళారులకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అంతా.. అస్తవ్యస్తం!

సమస్యల వలయంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు ఆసియా ఖండంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరుంది. ఈ మార్కెట్ ద్వారా మార్కెటింగ్‌శాఖకు ఏటా సుమారు రూ.50కోట్లకు పైగా అదాయం వస్తుంది. అలాంటి కీలకమైన వరంగల్ వ్యవసాయ మార్కెట్ నిర్వహణపై ప్రభుత్వం సరైన దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటివరకు పాలక మండలిని నియమించలేదు. 2022 ఆగస్టు 18వ తేదీన గత పాలక మండలి పదవీ కాలం ముగిసింది. అయితే రాష్ట్రంలో అనేక వ్యవసాయ మార్కెట్ల పదవీకాలాన్ని ఆరు నెలల చొప్పున ఏడాది వరకు పొడిగించగా.. రాజకీయాల కారణాలతో వరంగల్ మార్కెట్ పాలక మండలికి మాత్రం ఆ పొడిగింపు అవకాశం దక్కలేదు. అయితే బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌లో తీవ్రమైన రాజకీయాలతో పాలకమండలిని ప్రకటించిన ప్రమాణస్వీకారం కూడా చేయకుండా అడ్డుకున్నారు. ఎస్సీ మహిళకు వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను రిజర్వు చేయడంతో హనుమకొండకు చెందిన ఎర్ర ప్రియాంకను చైర్మన్‌గా, వైస్ చైర్మన్ బండి జనార్దన్‌తో పాటు 18మందితో పాలక మండలిని జనవరి 28న ప్రభుత్వం ప్రకటించింది. ఈలోపు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావటంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యపోరుతో పాలకమండలి ప్రమాణస్వీకారం చేయకుండానే నిలిచిపోయింది.

- పాలకవర్గం లేక రెండున్నరేళ్లు
- ఇటీవల ప్రకటించినా.. ప్రమాణం చేయకుండానే రద్దు
- రెండు నెలల క్రితం కార్యదర్శి సస్పెన్షన్
- 109మంది సిబ్బందికి... పని చేసేది 39మందే..
- పర్యవేక్షణ కరువై దళారుల చేతిలో పత్తి, మిర్చి రైతుల దగా
- సిండికేట్‌తో వ్యాపారుల కమీషన్ దందా
- తేమ, తదితర కొర్రీల పేరుతో అన్నదాతల జేబులకు చిల్లు
- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌పై దృష్టిపెట్టని సర్కారు

ప్రకటించిన వారితో ప్రమాణస్వీకారం లేదు. ఇప్పటి వరకు కొత్త కమిటీని కూడా ప్రకటించ లేదు. దీంతో రెండున్నరేళ్లకు పైగా పాలక మండలి కరువైంది.


అక్రమాల నేపథ్యంలో కార్యదర్శిపై వేటు

సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాల నేపథ్యంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మలపై ప్రభుత్వం ఫిబ్రవరి 11వ తేదీన సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో రెండు నెలలకుపైగా వ్యవసాయ మార్కెట్‌కు కార్యదర్శి కూడా లేకుండా పోయారు. అటు పాలక మండలి, ఇటు కార్యదర్శి లేకపోవటంతో ఉద్యోగులకు వేతనాలు కూడా సక్రమంగా అందే పరిస్థితిలేదు. ఖజానాలో కాసులున్నా.. వాటిని డ్రా చేసేందుకు జాయింట్ సిగ్నేచర్ అవసరం కావటంతో ఇతర మార్కెట్లో అప్పులు తీసుకుని ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే దుస్థితి నెలకొంది. ఇక వ్యవసాయ మార్కెట్‌లో బాధ్యత గల అధికారులు, పాలక మండలి లేకపోవటంతో దళారులదే రాజ్యం అవుతోంది. ఏదైనా సమస్య వస్తే చెప్పుకునేందుకు ఎవరూ లేకపోవటంతో రైతులే సర్దుకపోవాల్సి వస్తోంది.

సిబ్బంది కొరత.. కోల్డ్‌సోరేజీల బ్లాక్..

అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 109మంది

మిగతా 7వ పేజీలో..



నిర్లక్ష్యం చేస్తే.. తీవ్ర అనర్థాలు

వేసవిలో మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఎంజీఎం, కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రణధీర్

ప్రస్తుత యాంత్రిక జీవనంలో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. మరీ ముఖ్యంగా కిడ్నీ సంబంధ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇక వేసవి వచ్చిందంటే చాలు.. శరీరంలో నీటిశాతం పడిపోయి ఆ ప్రభావం మూత్ర పిండాలపై పడుతోంది. అవగాహనలేక తొలిదశలో గుర్తించకపోతే తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, శరీరానికి సరిపడా నీటిని తాగుతూ ఉండాలని వరంగల్ ఎంజీఎం, కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరం రణధీర్ సూచించారు. ఎండల వేళ మూత్రపిండాల ఆరోగ్యం, జాగ్రత్తల గురించి ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా సలహాలు, సూచనలివ్వడంతో పాటు పలువురి సందేహాలను నివృత్తి చేశారు. ఈ ఫోన్‌ఇన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.

- వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి



లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కార్మికుడు చెమట చిందిస్తేనే దేశం ముందుకు..

- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో ఘనంగా మేడే వేడుకలు

వరంగల్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుడు చెమట చుక్కలు చిందిస్తేనే దేశం ముందుకు సాగుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మేడే జెండాను ఆవిష్కరించారు. గౌరవ అతిథులు కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు చింతాకుల అనిల్, ప్రవీణ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. శ్రామికశక్తికి, ఐక్యతకు, పోరాటాలకు గుర్తుగా మేడే నిలుస్తుందన్నారు. మేడే స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మేడే చారిత్రాత్మక దినమని, చికాగోలో ఉన్న కొంతమంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలలో వెలుగులు నింపారని అన్నారు. 8గంటల పనిదినం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనమని అన్నారు. 24గంటలలో 8 గంటలు పని, 8 గంటలు రిక్రియేషన్, ఎనిమిది గంటలు విశ్రాంతి అన్న పద్ధతిని పోరాటం ద్వారా సాధించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, నాయకులు జారతి రమేష్, యాకూబ్‌పాషా, భోగి సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట ఏసీపీ తిరుమల్ బదిలీ

హైడ్రా డీఎస్పీగా నియామకం

వరంగల్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్‌ను హైడ్రా డీఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం హైడ్రా కమిషనర్‌గా పనిచేస్తున్న ఏవీ రంగనాథ్ వరంగల్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో పుప్పాల తిరుమల్ ఎస్బీ విభాగంలో ఏసీపీగా పనిచేశారు. అప్పట్లో భూదందాలకు పాల్పడే వారికి అడ్డుకట్ట వేయడంలో రంగనాథ్‌కు కచ్చితమైన సమాచారం చేరవేసి తిరుమల్ మంచి నమ్మకం సంపాదించుకున్నాడు. ఈ క్రమంలోనే హైడ్రా డీఎస్పీగా అవకాశం వచ్చినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఏసీపీ తిరుమల్

పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలి

- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రామం, ఆవాసాలకు పరిశుభ్రమైన తాగునీరును సరఫరా చేయాలని, అందుకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం జిల్లాలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, రాజీవ్ యువ వికాసంపై సంబంధి శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన గ్రామాల్లో అద్దె ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో కూడా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఆయా గ్రామాల లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో బేస్‌మెంట్ దశకు వచ్చిన లబ్ధిదారు లకు బిల్లులు చెల్లింపు కోసం ఆన్‌లైన్ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక జాబితా ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, డీపీఓ లక్ష్మీరమాకాంత్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 4వ తేదీన జరిగే నీట్ పరీక్షకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం రాత్రి నీట్ పరీక్ష నిర్వహించే సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. పోలీస్, విద్య, ఆర్టీసీ, విద్యుత్, వైద్యం, ఆరోగ్య, పోస్టల్ తదితర శాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణ, చేయనున్న



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

ఏర్పాట్లు, భద్రత, తదితర అంశాలను ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీన జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షకు 11పరీక్షా కేంద్రాలను కేటాయించామని, 4,680మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల అభ్యర్థులను అనుమతిస్తారని, అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, బయోమెట్రిక్ హాజరు ఉండాలన్నారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణలో జిల్లాలో ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తమ వెంట తీసుకురావొద్దన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఉండాలని, అదనంగా మరొక ఫొటోను వెంట తెచ్చుకోవాలన్నారు. అలాగే అభ్యర్థులు లెటెస్ట్ ఫొటో ఉన్న ఐడీ ప్రూఫ్ తెచ్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, అదనపు డీసీపీ రవి, నీట్ పరీక్ష కోఆర్డినేటర్, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- అట్టహాసంగా ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, మే1(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కొనియాడారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని తెలిపారు. విద్య, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా క్రీడా శిక్షణాశిబిరాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. హనుమకొండ జేఎన్ క్రీడా మైదానంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించామన్నారు. విశిష్ట అతిథి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీర ధృఢత్వం పెంపొంది ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపొచ్చన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. జేఎన్ క్రీడా మైదానంలో సౌకర్యాలను కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం, క్రీడాధికారులు కృషి చేస్తారన్నారు. ఇండోర్ స్టేడియం మరమ్మతుల కారణంగా అందులో నిర్వహించే బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించాలని క్రీడా అధికారులను నాయిని ఆదేశించారు. డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మే 1నుంచి జూన్ 6వ తేదీ



వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరకు దాదాపు 18క్రీడాంశాల్లో హనుమకొండ నగరంతో పాటు జిల్లాలోని పది మండలకేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6గంటల నుంచి 8:30 గంటల వరకు పలు క్రీడాంశాల్లో నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదు ఇస్తామన్నారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా దాదాపు 2700మంది విద్యార్థులు శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రావిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు శ్యామల పవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లిల్లీ ఫోరెన్సీ, సాంబయ్య ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చరిష్మ ఎంపిక



జఫర్‌గడ్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జఫర్‌గడ్ మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన విద్యార్థి తాటికాయల చరిష్మ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చరిష్మ అత్యుత్తమ ప్రతిభను కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు రాష్ట్ర బాక్సింగ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శీలం పార్థసారథి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు న్యూఢిల్లీలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే 68వ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో చరిష్మ పాల్గొంటుందన్నారు. చరిష్మ మడికొండలోని తెలంగాణ సాంఘికసంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో టెన్త్ చదువుతోంది. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, పీడీ పద్మ, పీఈటీ సరిత, కోచ్ రమేశ్ శాంసన్, గ్రామస్తులు అభినందించి సత్కరించారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపండి

సీపీ సన్‌ప్రీత్‌సింగ్



సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది

వరంగల్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబసభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎస్సైలు యుగేందర్, రాజశేఖర్‌రెడ్డి, ఎలీషా, ఏఎస్సై కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ రాంరెడ్డిలను గురువారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేష్‌కుమార్, ఏసీపీలు సురేంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్‌ఐలు స్వర్ణన్‌రాజ్, సతీష్, శ్రీధర్, ఆర్‌ఎస్సై శ్రవన్‌కుమార్, ఏవో రామకృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీల పోరాటాలతోనే కులగణన

▸▸ తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ప్రొఫెసర్ వెంకటనారాయణ

కేయూ క్యాంపస్, మే 1 (ఆంధ్రజ్యోతి) : శ్రమ, ఉత్పత్తి కులాల త్యాగాల సమాజాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు బీసీ కుల గణనకు ముందుకు వచ్చిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. గురువారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద సమావేశంలో ప్రజా సంఘాల నేతలు డాక్టర్ కొట్టే భాస్కర్, నల్లాని శ్రీనివాస్, మల్లేశ్వర్, మంద వీరాస్వామితో కలిసి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి ముందు 95 ఏళ్ల కిందట బ్రిటీష్ ప్రభుత్వం కుల గణన చేపట్టిందన్నారు. బీసీ సంఘాల వీరోచిత పోరాటాలు, ప్రతిపక్షాల డిమాండ్‌లను గౌరవించి ప్రధాని మోదీ మంచి నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా తిరిగి ప్రజల డిమాండ్‌లను కేంద్రం దృష్టికి తెచ్చారని కొనియాడారు. బీసీ కులగణనపై కాలయాపన చేయవద్దని అన్నారు. రాష్ట్రంలోని చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తగిన ప్రాతినిధ్యం బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులగణనతోనే సామాజిక న్యాయం అందుతుందని భావించొద్దన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

11 మంది వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించిన 11 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్‌చారి జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆరుగురికి రూ.5వేలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.2,500 జరిమానా విధించారన్నారు.

ఫిల్టర్‌బెడ్లపై నిర్లక్ష్యపు నీడలు

అధ్వానంగా నగరంలోని మూడు ఫిల్టర్‌బెడ్ల నిర్వహణ

- సమయానికి బెడ్లు శుభ్రం చేయని సిబ్బంది
- తూతూ మంత్రంగా ఉద్యోగుల విధుల నిర్వహణ
- క్లోరిన్ గ్యాస్, ఆలం వేయడంలో నిర్లిప్తత
- పట్టింపులేని అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మహా నగర ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందడం లేదు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. వడ్డేపల్లి, రుద్రమాంబ కాకతీయ యూనివర్సిటీ, ప్రతాపరుద్ర దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ల పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. జాగ్రత్తగా భద్రపర్చవలసిన కోరిన్ గ్యాస్ దిమ్మలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం ప్రమాదాలకు సూచికగా మారింది. దీంతో చుట్టుపక్కల నుంచి చెత్తాచెదారం తాగునీటిలో కలుస్తున్నా.. తుప్పుపట్టిన ఇనుము వస్తువులు నీటిలో కలుస్తున్నా.. అక్కడి సిబ్బందికి పట్టింపులేకుండా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో కొన్ని చోట్ల పగిలిన పైప్‌లైన్‌లలో డ్రైనేజీ నీరు సైతం కనిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



వృథాగా పడవేసిన ఆలం కెమికల్ బ్రిక్స్



బహిరంగ ప్రదేశంలో పడవేసిన క్లోరిన్ గ్యాస్ దిమ్మలు



వడ్డేపల్లిలో నీటిలో కలుస్తున్న ఇనుప తుప్పు

అపరిశుభ్రత.. సిబ్బంది నిర్లక్ష్యం..

ఫిల్టర్‌బెడ్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు సిబ్బంది పర్యవేక్షణ లోపంతో మంచి నీరు కలుషితమవుతున్నాయి. ఫిల్టర్‌బెడ్లలో క్లోరిన్‌గ్యాస్, ఆక్వా కార్బన్, ఆలం కెమికల్ సమయాన్ని బట్టి విడుదల చేయడం లేదనే విమర్శలున్నాయి. పర్మినెంట్ ల్యాబ్ అసిస్టెంట్ లేకపోవడంతో నీటి శుద్ధీకరణ పరీక్షలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బల్దియా అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది ఉదాసీనతతో ఇదంతా జరుగుతోందని తెలుస్తోంది. ఫిల్టర్‌బెడ్లలో పనిచేస్తున్న కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరు వేసుకుని ఇతరత్రా వ్యాపారాల్లో నిమగ్నమవుతున్నట్లు సమాచారం.

హాజరు ఫుల్లు.. పనులు నిల్లు..

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డెపల్లి, కేయూ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లలో మూడు షిఫ్టులలో ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. వీరిని పర్యవేక్షించేందుకు ఒక డీఈ, ఒక ఏఈ పని చేయాల్సి ఉంది. కాగా, వడ్డెపల్లిలో మూడు షిఫ్టులకు 22 మంది, కేయూ రుద్రమాంబ ఫిల్టర్‌బెడ్‌లో 33మంది, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్డులో మూడు షిఫ్టులకు 24 మంది పనిచేస్తున్నారు. పరిసరాల శుభ్రంతో పాటు బెడ్లలో నిలిచిన పాకురు, మలినం శుభ్రం చేయాలి. నీటి శుద్ధీకరణ, ఆలం మిక్సింగ్, క్లోరిన్ గ్యాస్ సరఫరా, నీటి ఇన్‌కవింగ్, ఔట్ గోయింగ్‌పై దృష్టి సారించి పని చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం వడ్డెపల్లి, కేయూ, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లలో పని చేస్తున్న హెల్పర్లు, ఆపరేటర్లు, ఏఈ, డీఈ స్థాయి అధికారులు విధులకు డుమ్మా కొడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. షిఫ్టులవారీగా పని చేయాల్సిన సిబ్బంది ఇక్కడ బయోమెట్రిక్ హాజరు వేసుకుని పది మందిలో ఇద్దరు పని చేస్తూ మిగతా వారు అండర్‌స్టాండింగ్ పద్ధతితో తప్పించుకుని తిరుగుతూ వ్యక్తిగత పనులపై దృష్టిసారిస్తున్నారు. కొన్ని సమయాల్లో అధికారులు నిలదీస్తే ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో చెప్పిస్తున్నట్లు తెలుస్తోంది.

క్లోరిన్, కెమికల్ కాంట్రాక్టర్ ఒకే ఒక్కడు

నగరంలోని మూడు ఫిల్టర్‌బెడ్ల నిర్వహణతో పాటు నీటిని శుద్ధీకరించేందుకు ఉపయోగించే కోరిన్ గ్యాస్, ఆలం, ఆక్వా కార్బన్ కాంట్రాక్ట్‌ను ఓ బడా వ్యాపారి పదేళ్లుగా చేజిక్కించుకుంటూ ఆధిపత్యం చెలాయిస్తున్నట్లు తెలిసింది. నీటిని శుద్ధి చేయడానికి నాణ్యతగల క్లోరిన్ గ్యాస్, స్వచ్ఛమైన ఆలం కలపాల్సి ఉండగా నాసిరకం కెమికల్ నీటిలో కలుపుతూ నగర ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఇంకా మూడు ఫిల్టబెడ్‌లకు 70 నుంచి 100 ఎంఎల్‌డీ నీరు రావడం, ఫిల్టర్‌చేసిన తర్వాత బయటకు పంపే సమయంలో ముగ్గురు పూర్తిస్థాయి ల్యాబ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలి. కానీ సదరు కెమికల్ కాంట్రాక్టర్ ఒకే వ్యక్తిని నియమించుకుని రెండురోజులకో ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి నీటి పరీక్షలు చేయిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో నీటి శుద్ధీక రణలో కెమెకల్ హెచ్చుతగ్గులు జరిగి ప్రజలు చర్మ వ్యాధులు, గొంతు నొప్పి సమస్యలువచ్చే అవకాశాలున్నట్టు సీనియర్లు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికైనా ఫిల్టర్‌బెడ్లలో పనిచేసే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, పనితీరుతో పాటు కెమికల్ నాణ్యతా లోపాలపై బల్దియా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్

విష్ణుపురిలో వ్యక్తి అదృశ్యం



డి.భరత్

కాజీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): కాజీపేట విష్ణుపురిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం... విష్ణుపురికి చెందిన దామెర భరత్‌కు మతిస్థిమితం సరిగాలేదు. దీంతో గత నెల 23న ఇంటినుంచి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్‌స్టేషన్ ఫోన్ 87126 85245 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో చోరీ

కాజీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత్‌నగర్‌లో ఓ ఇంట్లో దుండగులు చోరీ చేశారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో గురుకుంట్ల సంపత్‌కుమార్ ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలకొట్టి ఉంది. దుండగులు ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారం విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఎర్లీబర్డ్ స్కీమ్ గడువు పొడిగింపు

వరంగల్ కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 30 వరకు ముగిసిన ఎర్లీబర్డ్ స్కీమ్‌ను మే 7 వరకు పొడిగిస్తూ హైదరాబాద్ సీడీఎంఏ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయినట్టు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 సంవత్సరాలకు వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో నివసిస్తున్న ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్స్ యజమానులు ముందస్తుగా పన్నులు చెల్లించే వారికి ఎర్లీబర్డ్ స్కీమ్ ద్వారా 5శాతం ఫీజు రాయితీతో చెల్లించవచ్చని తెలిపారు. ప్రజలకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు వెల్లడించారు.

ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిల ఎంపిక



ప్రణయ



రాజు



ప్రసీద

వరంగల్ లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జిల ఎంపికలో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న నర్సంపేటకు చెందిన అంబటి ప్రణయ 2023లో లా డిగ్రీ పూర్తి చేశారు. అదే విధంగా వరంగల్‌ఫోర్ట్ రోడ్డుకు చెందిన గంగిశెట్టి ప్రసీద 2022 నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వరంగల్ జిల్లా ఫ్యామిలీ కోర్టులో టైపిస్ట్‌గా పనిచేస్తున్న కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లాడె రాజు జూనియర్ సివిల్ జడ్జి పదవికి ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఒకేసారి ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీ కోసం పనిచేసే వారినే గుర్తించండి

▸▸ గ్రామ, మండల, డీసీసీ అధ్యక్షుల నియామకానికి కసరత్తు చేపట్టండి

▸▸ 2017కు ముందు నుంచి ఉన్న వారే పదవులకు అర్హులు

▸▸ జూమ్ మీటింగ్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

హనుమకొండ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి) : పార్టీ జెండా మోసి కష్టించి పనిచేసిన వారికే పదవులు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, టీపీసీసీ అబ్జర్వర్లకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి కాంగ్రెస్ జిల్లాల అధ్యక్షులు, టీపీసీసీ అబ్జర్వర్లు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ఆమె జూమ్ మీటింగ్ నిర్వహించారు. పార్టీ పరమైన ఆదేశాలు, కార్యక్రమాల నిర్వహణ, కమిటీల నిర్మాణంపై దిశా, నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ అధ్యక్షులు, టీపీసీసీ అబ్జర్వర్లు ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం దిశగా గాంధీభవన్ సమావేశం ఆదేశాలు, ప్రణాళిక ప్రకారం సంస్థాగత నిర్మాణ చర్యలను నటరాజన్ ప్రస్తావించారు. గ్రామ,మండల, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియపై దిశా, నిర్దేశం చేశారు. తొలి దశలో భాగంగా జిల్లా కాంగ్రెస్ సమావేశాల నిర్వహణ వివరాలను చర్చించారు. సమావేశాలు నిర్వహణ పూర్తి కావడంతో ఇక రెండో దశగా మే 3వ తేదీ నుంచి నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశాల్లో గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులు ఎంపిక ప్రక్రియను పార్టీ శ్రేణులకు వివరించాలని సూచించారు. గ్రామ, మండల అధ్యక్షుల ఎంపిక కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అన్ని సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ఉంటుందన్నారు. ఈ కోణంలో దరఖాస్తుల స్వీకరణ ఉండాలని సూచించారు. చివరగా ఐదుగురి పేర్లతో కూడిన ప్రతిపాదనలు టీపీసీసీకి అందజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుల ఎంపికలో కూడా అబ్జర్వర్లు ఐదుగురి పేర్లను టీపీసీసీకి ప్రతిపాదించాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ అంతా 20వ తేదీలో పూర్తి కావాలని ఆదేశించారు. ఆ తరువాత ఏఐసీసీని టీపీసీసీ సంప్రదించి ఎంపిక పూర్తి చేస్తుందని వివరించారు.

కులగణన సంబురాలు జరపాలి

గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గాల వారీగా కులగణన సంబురాలు జరపాలని మీనాక్షి నటరాజన్ శ్రేణులను ఆదేశించారు. ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ ఆలోచనను చివరకు బీజేపీ అంగీకరించిందనే విషయానే ప్రజలకు తెలియచేయాలని సూచించారు. ఇది కాంగ్రెస్ విజయంగా ప్రజలకు స్పష్టీకరించాలన్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు.

2017కు ముందు నుంచి ఉన్న వారే అర్హులు

పార్టీలో 2017కు ముందు నుంచి ఉన్న వారికే పదవులు ఉంటాయని ఆ మేరకు గ్రామ, మండల, జిల్లా అధ్యక్షుల పేర్లతో కూడిన ప్రతిపాదనలు పంపించాలని మీనాక్షి ఆదేశించారు. గ్రామ, మండల అధ్యక్షుల్లో ఇప్పటికే పని చేస్తున్న వారి పనితీరు మెరుగ్గా ఉంటే వారి ఎంపికను సైతం పరిశీలించే దిశగా ఆలోచనలు చేయాలన్నారు. అయితే ఎంపిక విషయంలో శ్రేణుల అభిప్రాయ సేకరణ జరపాలన్నారు. ఎంపికలో తప్పిదాలు జరగడం, శ్రేణులు ఫిర్యాదులు చేస్తే దీనిపై క్షేత్రస్థాయి విచారణ చేపడతామని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. విచారణలో వివక్షతో కూడిన ఎంపిక జరిగినట్లు నిర్ధారణ అయితే అబ్జర్వర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో జూనియర్ అసిస్టెంట్ మృతి



చంద్రమౌళి (ఫైల్)

దుగ్గొండి, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన మండలంలోని దేశాయిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. దేశాయిపల్లికి చెందిన అంకేశ్వరపు సారయ్యకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు అంకేశ్వరపు చంద్రమౌళి(40) హనుమకొండలోని కుడా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 29న దేశాయిపల్లిలో శుభకార్యం ఉండగా స్వగ్రామానికి వచ్చారు. బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉన్న మామిడి కాయలను కట్టెకు కొడవలి కట్టి కోస్తున్న సందర్భంగా చెట్టుపైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్‌షాకుకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108 వాహనంలో దుగ్గొండి పీహెచ్‌సీకి తీసుకుపోతుండగా మార్గమధ్యలో చంద్రమౌళి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం మృతుడి తండ్రి అంకేశ్వరపు సారయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రణాళికలో.. ఫెయిల్!

- 'పది' ఫలితాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాల వెనుకబాటుకు కారణాలెన్నో..
- అధికారుల ఉదాసీనత వల్లేనని అభిప్రాయాలు
- స్కూళ్లను పట్టించుకోని ఎంఈవోలు
- విజయోస్తు, 120 రోజుల కార్యాచరణ అమల్లో తీవ్ర నిర్లక్ష్యం
- ప్రత్యేక చొరవ చూపని జిల్లా విద్యా, పాలనాధికారులు





హనుమకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంది అన్న సామెతలా ఉంది హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పదో తరగతి ఫలితాల పరిస్థితి. అన్ని హంగులు, సౌకర్యాలున్నా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏ ఏటికాయేడు వెనుకబడి పోతున్నాయి. హనుమకొండ జిల్లా కిందటేడు రాష్ట్రస్థాయిలో ఉండగా, ఈసారి మరీ అధ్వాన్నంగా 18వ స్థానానికి పడిపోవడం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తోంది. వరంగల్ జిల్లా పరిస్థితి అంతే. కిందటేడు రాష్ట్రస్థాయిలో 22వ స్థానంలో ఉండగా, ఈ సారి మరో మెట్టుదిగి 23వ స్థానంలో నిలిచింది. ఇందుకు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రభుత్వం రూపొందించిన విజయోస్తు, 120రోజుల ప్రణాళికలను సక్రమంగా అమలు చేయకపోవడమే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వెనుకబాటుకు అనేక కారణాలు ఉన్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈరెండు జిల్లాల విద్యాశాఖాధికారులు ఉత్తీర్ణత 93శాతానికి పైనే ఉన్నట్టు చెబుతున్నప్పటికీ మొత్తంగా చూస్తే సరాసరి 4.68శాతం ఉత్తీర్ణత తగ్గిందన్నది వాస్తవం. ఇందుకు కారణం టెన్త్ విద్యార్థులను పరీక్షలకు తగిన రీతిలో సిద్ధం చేయడంలో నిర్లక్ష్యం, ఉదాసీనతే ప్రధానంగా కారణంగా చెబుతున్నారు. విజయోస్తు, 120 రోజుల ప్రణాళిక అమలులో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండల విద్యాశాఖాధికారుల ఉదాసీనత కూడా ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఈ రెండు జిల్లాలోని ఎంఈవోలు పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేయకపోవడం వల్ల విద్యా ప్రణాళిక గాడితప్పినట్టు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, పాలనాధికారులు ఉదాసీనత కూడా ఉత్తీర్ణతా శాతం తగ్గడానికి కారణంగా చెబుతున్నారు.

అన్నీ ఉన్నా..

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విద్యాపరంగా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. పైగా హనుమకొండ ఎడ్యుకేషన్ హబ్. ముఖ్యంగా ఈ రెండు జిల్లాల్లో ఉన్నన్ని ప్రైవేటు పాఠశాలలు మరెక్కడా లేవు. వీటిలో కార్పొరేట్ స్కూళ్లే ఎక్కువ. అయినా ఈ రెండు జిల్లాలు ఉత్తీర్ణతలో వెనుకబడ్డాయి. సర్కార్ బళ్లు ఇక్కడ బాగా పని చేశాయన్నది స్పష్టమవుతోంది.

ప్రణాళిక అమలులో విఫలం

పది పరీక్షల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేట్టు వారిని సన్నద్ధం చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ మొదటి నుంచి ప్రయత్నాలను చేస్తోంది. ఆ మేరకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రణాళికలను సూచించింది. ఇందులో భాగమే విజయోస్తు కార్యక్రమం, 120 రోజుల ప్రణాళిక. ఈ రెండింటినీ సమర్థవంతంగా అమలు చేయడంలో మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలు విశేషంగా కృషి చేశాయి.

కొరవడిన మోటివేషన్

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పదోతరగతి విద్యార్థులను మోటివేట్ చేయడంలో తగినంత కృషి జరగలేదని తెలుస్తోంది. ఈ విషయంలో విఎగతా జిల్లాల కలెక్టర్లు, డీఈవోలు ప్రత్యేక చొరవ చూపారు. వినూత్న ప్రయత్నాలు చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూడడంతో పాటు వేకువజామున విద్యార్థులు చదివేలా ఉపాధ్యాయులతో ఫోన్‌లో మేలుకొలుపు చేయించారు. విద్యార్థులను చదివించాలని స్వయంగా తల్లిదండ్రులకు టెలీకాన్ఫరెన్సులు పెట్టి దిశానిర్దేశం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. చివరగా విద్యార్థులకు సూచనలు చేస్తూ విజయోస్తు పేరిట లేఖలు కూడా రాశారు. ప్రణాళికాబద్ధంగా చదవాలి, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి, మానసిక ఒత్తిడిని అధిగమించాలి, మంచి ప్రజంటేషన్ నైపుణ్యాలు అలవరుచుకోవాలి వంటి స్ఫూర్తిదాయకమైన సూచనలు చేశారు. కానీ ఇలాంటి స్ఫూర్తి హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కనిపించలేదన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒకప్పుడు టెంత్ ఫలితాల్లో వరుసగా రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచింది. ప్రత్యేక కృషి, పట్టుదల, చిత్తశుద్ధితోనే పూర్వవైభవం సాధ్యం.

నిర్లక్ష్యం చేస్తే.. తీవ్ర అనర్థాలు

- వేసవిలో మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన అవసరం
- శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి
- వరంగల్ ఎంజీఎం, కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరం రణధీర్
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన


డాక్టర్ బైరం రణధీర్

వరంగల్ మెడికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలి.. ఆహార అలవాట్లతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం కిడ్నీ సంబంధ వ్యాధులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పుడైతే వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల అనేక మందిలో మూత్రపిండాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే అనేక తీవ్ర అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకుగాను వరంగల్ ఎంజీఎం, కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బైరం రణధీర్‌తో గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశేష స్పందన రాగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన అనేకమంది డాక్టర్‌కు ఫోనే చేయగా.. వారికి డాక్టర్ రణధీర్ సూచనలు, సలహాలు ఇచ్చారు. అనేక అనుమానాలను నివృత్తి చేశారు. వాటిలో కొన్ని...

వేసవిలో మూత్రం రావడం లేదు?
కె.సతీష్‌రెడ్డి, చిట్యాల మండలం, భూపాలపల్లి జిల్లా

డాక్టర్ : మీరు రోజు 5 నుంచి 6 లీటర్ల వాటర్ తాగుతున్నట్టు చెబుతున్నారు. ఎండ వేడిమి వల్ల డీ హైడ్రేషన్ అవుతుంది. ఒకేసారి లీటర్ నీళ్ల తాగకుండా కొంచెం, కొంచెం తాగితే ఫలితం అనుకూలంగా ఉంటుంది. అర గంటకోసారి, గంటకోసారి నీళ్ల తాగాలి. పగటి పూట ఎక్కువగా నీరు తీసుకోండి. అలాగే ఆహారంలో ఉప్పు శాతం తగ్గించాలి. మాంసాహారం కూడా ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది.

రెండేళ్ల నుంచి షుగర్ ఉంది.. దాని ప్రభావం కిడ్నీలపై ఉంటుందా?
వెంకన్న, కేసముద్రం

డాక్టర్: మీకు రెండు సంవత్సరాల నుంచి షుగర్ వ్యాధి ఉందని చెబుతున్నారు కదా ప్రతీ మూడు నెలల నుంచి ఆరు నెలలకు ఒకసారి మధ్య కిడ్నీలను తప్పకుండా పరీక్ష చేయించుకోవాలి. దీన్నే డయాబెటిక్ నెఫ్రోపతి అంటారు. కిడ్నీల పనితీరు, ప్రోటీన్స్ లాస్ అయ్యే విధానాన్ని తప్పకుండా పరిశీలించుకోవాలి. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రండి ఈ పరీక్షలన్నీ ఉచితంగా అందజేస్తాం.

చెట్టు మీద నుంచి కింద పడ్డ తర్వాత మూత్ర సమస్య వచ్చింది? ఏం చేయమంటారు?
బి.భిక్షపతి, వడ్లకొండ, జనగామ జిల్లా

డాక్టర్: ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి కిందపడ్డారుకదా అప్పుడు యూరిన్ పైప్‌తో యూరిన్ పాస్‌చేశారు. ఇప్పుడు ఆ పైప్ ఎక్కడం లేదంటున్నారు. మీది 49 సంవత్సరాలు కాబట్టి ఒకసారి కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని 102 నెంబరుకు రండి తప్పకుండా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందిస్తాం.

పల్లీలతో చేసిన ఆహారం తీసుకుంటే క్రియాటిన్ పెరిగుతుందా?
ఇరుకుళ్ల నవీన్, హనుమకొండ

డాక్టర్: అలాంటిదేమీ లేదు. ఒక వేళ పల్లీలు, పల్లి చెట్నీలు మోతాదుని మించి తింటే కొలెస్ట్రాల్ లెవెల్ పెరిగి కిడ్నీలపై ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి మూడు నెలలకు ఒకసారి లిపిడ్ ప్రొఫైల్ చేయించుకుంటే మంచిది.

మాకు వంశపారంపర్యంగా కిడ్నీ సంబంధ వ్యాధులు వస్తున్నాయి?
పరశురాం నాయక్, బలరాంతండా, హసన్‌పర్తి మండలం, హనుమకొండ జిల్లా

డాక్టర్: అతి దాహం, అతి మూత్రం అని మీరే చెబుతున్నారు కదా.. ఇప్పటికే మాంసాహారం బంద్ చేశారు. మద్యం కూడా బంద్ చేశారు. కేవలం బీపీ మాత్రమే ఉందని చెప్తున్నారు. ఒక్కసారి మీరు రిపోర్ట్స్ తీసుకొని వైద్యులను సంప్రదించండి.

నాకు కిడ్నీలో 15ఎంఎం స్టోన్ ఉంది ఏం చేయమంటారు?
రాజు గీసుగొండ, వరంగల్ జిల్లా

డాక్టర్: మీకు కుడివైపు కిడ్నీలో 15ఎంఎం రాయి ఉన్నట్లు ఇప్పటికే ధ్రువీకరించారు. మీకు తప్పకుండా సర్జరీ అవసరం పడుతుంది. కానీ అది ఎమర్జెన్సీనా? కాదా? అనేది కొన్ని పరీక్షల ఆధారంగా నిర్ణయించాల్సి ఉంటుంది.

నాకు 5 ఎంఎం స్టోన్ ఉంది మూత్రంలో పడిపోతుందా?
తిరుపతి, చిట్యాల, భూపాలపల్లి జిల్లా

డాక్టర్: ఎడమవైపు బ్లాడర్ ముందు ఆగి ఉందని మీరే చెబుతున్నారు కదా. ఒక వారం ఆగి చూడండి. మీరు మంగళవారం గాని గురువారం గాని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రండి. పరీక్షలు నిర్వహిద్దాం. ఆ పై ఎలాంటి వైద్యం అవసరమవుతుందో నిర్ధారణకు రావొచ్చు.

మూత్రం పసుపు రంగులో వస్తుంది?
పి.రాధాకృష్ణ, ఏటూరునాగారం, ములుగు జిల్లా

డాక్టర్: మీరు వేసవికాలంలో ఐదు లీటర్ల వరకు నీటిని తాగాలి. తప్పకుండా రంగు మారి సాధారణ మూత్రం వస్తుంది. అదే విధంగా ఎండలో తిరగాల్సి వచ్చినప్పుడు మరికొంత అదనంగా నీరు తీసుకోండి. మిగతా సమస్యలు ఏమి లేవని మీరు చెబుతున్నారు కాబటి కేవలం నీరు తాగడంపై శ్రద్ధ పెడితే ముందు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు.

నడుము నొప్పి విపరీతంగా ఉంది?
రత్నాకర్, మల్లారెడ్డిపల్లి హసన్‌పర్తి మండలం, హనుమకొండ జిల్లా

డాక్టర్: ఎనిమిది రోజులుగా నడుము నొప్పి ఉంటుందంటున్నారు. ఎరుపు రంగులో మూత్రం వస్తుందని కూడా చెబుతున్నారు. ఇది డీ హైడ్రేషన్ వల్ల సంభవిస్తుంది. నీరు ఎక్కువగా తాగాలి. అయినా తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పుష్కరిణీ పాహిమాం..



- పరమ పవిత్రం.. మూడు నదుల సంగమ క్షేత్రం
- ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు
- ముస్తాబవుతున్న కాళేశ్వర తీరం


గోదావరి వద్ద భక్తుల రద్దీ (ఫైల్)


త్రివేణి సంగమ గోదావరి, (ఇన్‌సెట్‌లో) కాళేశ్వరాలయంలోని లింగాలు

మహదేవపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : నదీ స్నానం అనేది ఒక సంకల్పం.. అందులో త్రివేణి సంగమ ప్రాంతంలో పుణ్యస్నానమాచరిస్తే సర్వ పాపాలు పోతాయని పురాణాలు చెబుతున్నాయి. గోదావరికి హారతి ఇస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఏ నది నీటినయితే తాగి జీవిస్తున్నామో.. వ్యవసాయానికి ఏ నది నీటిని వాడుతున్నామో ఆ నదినే తల్లిగా పూజించాలంటు న్నాయి. అందుకే ప్రతీ 12ఏళ్లకోసారి వచ్చే పుష్కరాల సమ యంలో ఆయానదుల నీటిలో స్నానమాచరించేందుకు కోట్లాది భక్తులు తపిస్తుంటారు. మరణించిన తర్వాత ముక్తి లభిస్తుందని నమ్ముతారు.

ఎంతో పవిత్రం.. త్రివేణి సంగమం..

గంగా, యమున, సరస్వతి నదులు కలిసిన చోటు ప్రయాగ కంటే కూడా పవిత్రమైందని నమ్మకం. అలాంటి త్రివేణి సంగమంలోని సరస్వతి నది పుష్కరాలు సమీపిస్తున్నాయి. కాళేశ్వరంలో ఉన్న త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం వద్ద స్నానమాచరిస్తే జీవించినప్పుడే ముక్తి లభిస్తుందనేది పెద్దల మాట. ప్రయాగలో స్నానమాచరిస్తే మరణాన్ముక్తి.. కాళేశ్వరంలో స్నానమాచరిస్తే జీవన్మాన్ ముక్తి జరుగుతుందని పండితులు సైతం చెబుతున్నారు. కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల సంగమం ఉండగా.. గోదావరి అంటే గోహత్యాపాతకాన్ని దూరం చేసిన నది అని పేరు. గౌతమ మహర్షి తాను పొందిన వర ప్రభావంతో దేశమంతా క్షామం వచ్చి తిండి దొరకని సమయంలో ఎంతో మందికి అన్నదానం చేసేవాడట. దీనిని చూసి ఓర్వలేని కొందరు మాయ గోవుని గౌతముని పొలంలోకి పంపించారు. దాన్ని బయటకు తోలడానికి ఆయన ఒక గరిక విసిరాడని, వెంటనే గోవు మరణించిందని, పండితులంతా గౌతముని గోహత్యా పాతకాన్ని చూసి గంగానదిని తీసుకుని తెచ్చి ఈ ప్రాంతాన్ని జలమయం చేస్తే పాతకం పోతుందని సూచనలు చేశారట. ఈ క్రమంలో గౌతముడు శివుని కోసం ఘోర తపస్సు చేసి నాసికాత్రయంబకం నుంచి తీసుకొచ్చాడడని, అలా బయలుదేరిన గోదావరి.. మంజీర, మాండవి, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి అనే ఉపనదులను తనలో ఐక్యం చేసుకుని సప్త చీలికలుగా మారి సముద్రంలో కలుస్తోంది. కాళేశ్వరంలో తన తీరంలో ముక్తీశ్వరుడిగా స్వయంభువుగా వెలసి భక్తులకు ముక్తి కలిగించాలని గోదావరి శివుని గురించి తపస్సు చేసి సాధించింది. భక్తులు స్నానాలు , దానాలు, పిండ ప్రదానాలు చేసి పునీతులవడానికి వీలు కల్పించింది. కాళేశ్వరంలో అష్ట తీరాలతో త్రివేణి సంగమంగా విరాజిల్లుతోంది. ఈ త్రివేణి సంగమం ఒడ్డును కాళేశ్వరుడికి నిత్యం వేలాది మంది పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో నదీ స్నానమాచారించి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ప్రతీ పౌర్ణమి నాడు, ప్రత్యేక రోజుల్లో అఖండ గోదావరి హారతి నిర్వహిస్తుంటారు. అలహాబాద్ తర్వాత త్రివేణి సంగమంలో కొలువైన క్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం. ఈ క్షేత్రం దగ్గర ఉన్న నదిని అమ్మవారిగా పూజిస్తారు. సాయంకాల ప్రదోషకాల వేళ నదీ హారతి ఇస్తారు.. అంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు చేసే పాపం పోగొట్టుకోవడానికి గోదావరి నదీ స్నానాలు చేస్తారని నానుడి. పుష్కరాల సమయంలో నదీ స్నానమాచరిస్తే శరీర శుద్ధితో పాటు పాపలు కొట్టుకుపోతాయని పురాణాలు చెబుతున్నాయి. గోదావరి మాతకు చీర, సారెతో పాటు ప్రదోషకాలం హారతివ్వడం చాలా గొప్ప ఆవిష్కరణ అంశమని పురోహితులు చెబుతున్నారు.

నదీ స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయి..



గోదావరి నదీ స్నానం చేస్తే సమస్త పాపాలు పోతాయి. పంచ భూతాల్లో ఒకటైన నీటిని ప్రకృతిని పూజించడం మన సనాతన ధర్మం గొప్పదనం. సమస్త చరాచర ప్రాణకోటికి ప్రాణాధారమైన నదికి ప్రతీ పౌర్ణమికి హారతి ఇవ్వడం జరుగుతుంది. నదీ స్నానం పుణ్యంతో పాటు పాపాలు తొలుగుతాయి. త్రివేణి సంగమంలో గోదావరి స్నానం మరింత మేలు చేకూరుస్తుంది. భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయి.

- కృష్ణమూర్తి శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

ఈ నెలలోనే పుష్కరాలు

ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు జరగనుండగా కాళేశ్వరంలోని ముక్తీశ్వర సన్నిధి ముస్తాబవుతోంది. ప్రతీ 12 ఏళ్ల కోసారి జరిగే ఈ పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఏ నదిలో పుష్కరం వస్తుందో ఆ నదిలో కచ్చితంగా స్నానం చేయాలనేది పెద్దల మాట. పుష్కరం అనే మాట విన్నప్పుడు మనకు మాత్రం సంఖ్య 12.. 12 ఏళ్లకోసారి వచ్చే పెద్ద పండుగ పుష్కరాలు.. మహా నదుల వద్ద ఈ ఉత్సవాలు జరుగుతాయి. సరస్వతి పుష్కరాల వేళ కాళేశ్వరం వచ్చే లక్షలాది భక్తులకోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

పుష్కరాలకు.. పుష్కలంగా నీరు

భక్తులకు అపోహలు అవసరం లేదంటున్న అధికారులు


గోదావరిలో ఉన్న నీళ్లు, బండలను తొలగిస్తున్న ప్రొక్లయినర్

మహదేవపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరంలో.. రాష్ట్రంలో ఎక్కడా జరుగనటువంటి సరస్వతీ పుష్కరాలు కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్నాయి. అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లను కేటాయించింది. ఇందుకోసం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అయితే గోదావరిలో నీళ్ల లేవని, సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పవన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో భక్తులు.. కాళేశ్వం వద్ద నీరు లేదని అపోహలకు గురవుతున్నారు. అయితే గోదావరిలో పుష్కలంగా సరస్వతి స్నానాలు చేసేందుకు నీళ్ల పుష్కలంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులతో పాటు ప్రభుత్వం తెలిపింది. ప్రాణహిత, గోదావరి, సరస్వతి నదుల సంగమం వద్ద లక్షలాది భక్తులు నదీ స్నానాలు చేసేందుకు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వసతులు కల్పిస్తోంది.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఇక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం కాళేశ్వరంలో పర్యటించి అభివృద్ధి పనుల నిర్వహణ తీరుపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కదిలిన యంత్రాంగం గురువారం గోదావరి తీరంలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. పుష్కర ఘాట్ నుండి వీఐపీ ఘాట్ వరకు ఇసుక లేకుండా బండలు తేలడంతో ప్రొక్లయినర్ సాయంతో బండలను తొలగించి చదును చేస్తున్నారు. అంతేగాకుండా గోదావరి అంచున మట్టిపెల్లలు, బురదను తొలగిస్తున్నారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

మిస్ ఇండియా రన్నరప్‌గా.. ఓరుగల్లు సుందరి

విజయానికి అడుగుదూరంలో ఆగిన దీక్ష


రన్నరప్‌గా నిలిచిన దీక్ష


నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకున్న దీక్ష

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ వేదికగా వచ్చే నెల మొదటి వారంలో పలు దేశాలకు చెందిన సుమారు 200మంది సుందరీమణులకు మిస్‌వరల్డ్ పోటీలు జరగనుండటంతో.. ఇప్పుడు అందరి దృష్టి ఆ పోటీల వైపే మళ్లింది. ఈ క్రమంలో ఓరుగల్లు చరిత్రలోనే మొట్టమొదటి సారిగా వైద్యవిద్యను అభ్యసిస్తున్న హనుమకొండ పరిమళకాలనీకి చెందిన దీక్ష డ్యాక హైదరాబాద్‌లో మిస్ ఇండియా పోటీల్లో సత్తా చాటింది. ఏప్రిల్ 30 బుధవారం అర్ధరాత్రి వరకు హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో విజయానికి అడుగు దూరంలో ఆగిపోయింది. అనేక పోటీ పరీక్షలను ఎదుర్కొని ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచింది.ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' గురువారం ఆమెను పలకరించింది. తనకు చిన్నప్పటి నుంచి కేవలం చదువులే కాక ఆటపాటలు సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఎంతో ఇష్టమని వీటితో పాటు ప్రజలకు ఎంతో సేవ చేయలన్నా ఆశయంతో ఉండేదాన్ననని చెప్పారు. తాను ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతున్నానని, ప్రైమరీ నుంచి విద్యాభ్యసమంతా వరంగల్ నగరంలోనే కొనసాగిందని ఆమె తెలిపారు. తన తల్లి అనితాదేవి ప్రోత్సాహంతో అనేక పోటీల్లో సులభంగా గెలిచిన తాను మిస్ ఇండియా పోటీల్లో నిలిచినట్లు తెలిపారు. గత ఫిబ్రవరిలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న తనకు దశల వారీగా నిర్వాహకులు సిమ్మరింగ్ స్టార్‌లైట్, క్రియేషన్స్ వారు నిర్వహించిన పలు రకాల కల్చరల్ రౌండ్, జీకే రౌండ్, పిక్చర్స్ ర్యాంప్ వాక్ తదితర విభాగాల్లో సునాయసంగా గెలిచి గుజరాత్, రాజస్థాన్, కేరళవారిని వెనక్కు నెట్టి ఫైనల్‌కు చేరుకున్నట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడలోని పార్క్‌లైన్ హోటల్‌లో అట్టహాసంగా నిర్వహించిన ఫైనల్ పోటీలో రన్నరప్‌గా నిలిచానని అన్నారు.

తాను మిస్ఇండియా కిరీటాన్ని అందుకోలేకపోయినా.. రన్నరప్‌గా నిలిచినందుకు కూడా సంతోషంగానే ఉందన్నారు. దీన్ని ఒక అనుభవంలా తీసుకుని ముందు మరింత కష్టపడతానన్నారు. ఇప్పటికైనా చదువుల్లోకాని ఆట పాటల్లో కాని వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని అన్నారు. మరో రెండేళ్లలో చదువుపూర్తయి వైద్యురాలిగా పేదలకు తనవంతు సేవలందిస్తానని చెప్పారు. వరంగల్ నగరం నుంచి మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని గెలుపు అంచులదాకా వెళ్లిన దీక్ష డ్యాక.. చరిత్రలో ఓరుగల్లు సుందరిగా తన పేరును సార్థకం చేసుకున్నారు.

అంతా.. అస్తవ్యస్తం!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులు పని చేయాల్సి ఉంది. అయితే కేవలం 39మంది మాత్రమే ప్రస్తుతం పని చేస్తున్నారు. అదనంగా 70మంది చేసే పని కూడా ఉన్నవాళ్లతోనే చేయిస్తుండటంతో అదనపుభారంతో ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. పైగా సకాలంలో రైతులకు సేవలు అందటం లేదు. మార్కెట్‌లో ఏదైనా సమస్య వస్తే పరిష్కరించేందుకు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇక వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 28కోల్డ్ స్టోరేజీలున్నాయి. ఒక్కొక్క కోల్డ్ స్టోరేజీలో లక్ష నుంచి లక్ష యాభైవేల బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. సుమారు 40వేల బస్తాలను స్టోరేజీ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఈ కోల్డ్‌స్టోరేజీల్లో అత్యధికంగా వ్యాపారుల చేతుల్లోనే ఉండటంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన పంటలను కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వచేసి.. ధర ఎక్కువ వచ్చినప్పుడు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే రైతులు కూడా ధర తక్కువ ఉన్న సమయాల్లో కోల్డ్ స్టోరేజీల్లో తమ పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో గతేడాది లక్షకు పైగా మిర్చి బస్తాలను రైతులు కేసముద్రం, మహబూబాబాద్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లకు తరలించి అక్కడ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. దీంతో అదనపు భారాన్ని భరించాల్సి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోల్డ్ స్టోరేజీలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం, మార్కెట్ అధికారుల్లో కొందరు వ్యాపారులతో కుమ్మక్కై కోల్డ్‌స్టోరేజీలను బ్లాక్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంతకో కొంతకు తమ పంటలను విక్రయించుకోవాల్సిన పరిస్థితులను కల్పించి, రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులు ఆగమాగం

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు చత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి రైతులు పంటలను తీసుకొస్తారు. అయితే మార్కెట్‌లో దళారీ వ్యవస్థ పాతుకుపోవటంతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సీజన్‌లో ప్రతీరోజు మిర్చి, పత్తికి సంబంధించి 25వేల నుంచి లక్షకు పైగా బస్తాలు మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. అయితే అడ్తిదారులు, ఖరీదుదారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కమీషన్లకు కక్కుర్తి పడి కొందరు అడ్తిదారులు రైతులను దోచుకుంటున్నారు. అలాగే తేమ పేరుతో అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరల్లో కోత పెట్టి రైతును దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. మార్కెట్లో దళారులు నిర్ణయించిందే ధర కావటంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పంటలను అమ్ముకోవాల్సి వస్తోంది. ఇటీవల పత్తి కొనుగోళ్ల అక్రమాల్లో జరిగింది ఇదే. రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి, కౌలుదారులకు ఇచ్చే టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) రశీదులను మార్కెట్ అధికారుల నుంచి తీసుకున్నారు. వీటితో సీసీఐకి ఎక్కువ ధరకు పత్తిని అమ్ముకున్నారు. ఈ కేసులోనే రాష్ట్రంలో వరంగల్‌తో పాటు ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. ప్రభుత్వం పాలకమండలితో పాటు పూర్తిస్థాయిలో అధికారులను నియమించకపోవడంతో దళారులు దోపిడీకి అంతం లేకుండా పోతోందనే వ్యాఖ్యలున్నాయి. రెండు నెలలుగా పూర్తి స్థాయి మార్కెట్ కార్యదర్శి కూడా లేకపోవటంతో రైతులను దోపిడీ దారుల నుంచి కాపాడే వారు లేకుండా పోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆసియా ఖండంలోనే అతిపెద్ద వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పాలక మండలి, సిబ్బంది, కార్యదర్శిని నియమించి, దళారులపై నిఘా పెట్టి, పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పసుపు, పల్లికాయ యార్డులు

ప్రకృతి ప్రసాదం.. నేల వంకాయ

వేసవిలో లభించే పోషకాల సమాహారం..


నేల వంకాయలు


నేల వంకాయలు సేకరిస్తున్న మహిళ

కొత్తగూడ, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి ప్రసాదమైన నేల వంకాయ ఎన్నోపోషకాల సమాహారం. ఇది పలు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో ఏజెన్సీ ప్రాంతంతో పాటు పలు మైదాన ప్రాంతాల్లో లభ్యమయ్యే ఈ నేల వంకాయను పూర్వీకుల కాలం నుంచి నేటి వరకు ప్రజలు ఆహారంగా తీసుకుంటున్నారు. అధిక మొత్తంలో కేలరీలు ఉండే నేల వంకాయలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్ సీ, బీ6, పొటాషియం, తక్కువ మొత్తంలో మెగ్నీషియం, పాస్పరస్, పోలేట్ పుష్కలంగా లభిస్తుంది.

మంచి ఔషధగుణాలు..

తొడిమ వద్ద ముళ్లను కలిగి ఉండే నేల వంకాయలను కూర రూపంలో తీసుకోవటంతో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు కలిగి ఉంటుంది, ఆస్తమా, దగ్గు, శ్వాసకోశ సంబంధ సమస్యలతో పాటు మూత్ర సంబంధిత వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది, కాలేయాన్ని కూడా శుభ్రం చేస్తుందని విద్యావంతులు, నిపుణులు పేర్కొంటున్నారు. నేల వంకాయలను ఆయుర్వేద మందుల్లో పొడిరూపంలో లేదంటే కషాయంగా వాడుతారు. కాగా, గర్భిణులు, పిల్లలు అధిక మొత్తంలో ఈ నేలవంకాయలను తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌ను సిద్ధం చేయండి..

- 15న ప్రధాని మోదీ వర్చువల్‌గా పునఃప్రారంభిస్తారు
- దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్


వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్

గిర్మాజిపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద రూ.25 కోట్లతో ఎయిర్‌పోర్ట్ తరహాలో అధునాతన సదుపాయాలతో అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఈనెల 15న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలని దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్ అధికారులను ఆదేశించారు. గురువారం సికింద్రాబాద్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజనీర్ మల్లికార్జున్ వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అమృత్ భారత్ అభివృద్ధి పథకం కింద పూర్తిచేసిన నాలుగు ప్లాట్‌ఫారాలు, కవర్ షెడ్లు, నూతనంగా ఏర్పాటుచేసిన భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, 3 లిఫ్టులు, 3 భారీ ర్యాంపులు, కోచ్ ఇండికేటర్లు, కార్పొరేట్ తరహాలో సాధారణ, పేమెంట్ ఏసీ విశ్రాంతి మందిరాలు, వీఐపీ లాంజ్‌లను పరిశీలించారు. వరంగల్ వైపు సర్క్యులేటింగ్ ఏరియాలో రైల్వే కోచ్ మోడల్, గ్రీనరీ, పార్కింగ్ పాయింట్‌లను చూశారు. ఇంకా ఏమైనా పనులు పెండింగ్ ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ 15న ప్రధానమంత్రి ప్రారంభించేలా స్టేషన్‌ను సిద్ధం చేయాలని వరంగల్ ఐఓడబ్లు శ్రీనివాస్‌ను ఆదేశించారు. మొదటి ప్లాట్‌ఫారంపై పేమెంట్ టాయిలెట్ చిన్నగా ఉందని దీనిని పెద్దగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎ.డి.ఈ.ఎన్ శ్రీనివాస్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరం


శిక్షణా శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

హనుమకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యూజిక్ అంశాల్లో 42రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణా కార్యక్రమాన్ని డీఈవో డి.వాసంతి ప్రారంభించారు, హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా డీఈవో వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ శిక్షణకు హాజరై ప్రావీణ్యం పొందాలని, టెక్నికల్ టీచర్స్‌గా ఎంపిక కావడానికి అర్హత సాధించాలని కోరారు. కోర్సు ఇన్‌చార్జ్ ఎ.వెంకటరమణ, బి.సంధ్యారాణి, కోఆర్డినేటర్ బి.రమేష్, ఎం.డి.నయీంపాషా, హనుమకొండ మండల విద్యాధికారి జి.నెహ్రూ, శిక్షణా కేంద్రాల ప్రధానోపాధ్యాయుడు వి.జగన్నాథం, జీహెచ్‌ఎం ఎం.ఉమ, విషయ బోధకులు, టెక్నికల్ బోధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదిలో రిషి స్కూల్ ఉత్తమ ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న రిషి పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రాజు

హనుమకొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎల్లంబజార్‌లోని రిషి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. డి.అశ్రిత 591, పి.వాగ్దేవి 577, టి.గమన 570, ఆర్.హసిని 570, అనుర ఇరామ్ 570, ఆర్.అమ్రిన్ కాటూన్ 566, టి.మిత్రబింద 562, వి.సాహితి 561, ఎ.సాయిశ్రీ 560, ఇ.మేఘన 560, ఎ.అక్షయ 552, ఎం.శ్రీనిధి 557, జె.మధునిక 556, జె.స్నేహిత 554, ఆర్.శీజ 552, డి.సుస్వర 552, కె.శ్రీజై 570, ఎన్.సవేశిన్ 569, వి.మణిసాయి శంకర్ 564, కె.సాయిరూపేశ్వర్ 560, వి.ఆదిత్య 559, సయ్యద్ రియాజ్ అహ్మద్‌కు 553 మార్కులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థుల విజయభేరి


హర్షవర్ధన్‌రెడ్డి, బి.మాన్విత్‌రావు, డి.ఆనంది, ఎస్.హర్షిణి

వరంగల్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పాపయ్యపేట చమన్‌లోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో విజయభేరి మోగించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ లలితా నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థులు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి 580, బి.మాన్విత్‌రావు 574, డి.ఆనంది 569, ఎస్.హర్షిణి 566 మార్కులు సాధించినట్లు తెలిపారు. అంతేకాకుండా తమ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించిందని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. వీరి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పది ఫలితాలలో ఎల్లాపూర్ ఎస్‌పీఆర్ ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ జగన్‌మోహన్

హసన్‌పర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ జగన్‌మోహన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన ఫలితాలను వెల్లడించారు. యు.సాయిశ్రీ 586, టి.ఆనంది 585, ఎం.సాయితక్ష 582, కె.రఘువీర్ 581 మార్కులు సాధించి ఫలితాలలో విజయదుందుభి మోగించారని హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా 275 మందికి 560కి పైగా, 34 మందికి 550కిపైగా, 56 మందికి 500లకు పైగా మార్కులతో మొత్తం 171 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై ప్రతీ విద్యార్థి 75 శాతం మార్కులు సాధించినట్లు ఆయన వివరాలను వెల్లడించా రు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.శేషగిరిరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ విద్యార్థినుల ప్రతిభ

హసన్‌పర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల (హసన్‌పర్తి) విద్యార్థినులు ప్రతిభకనబర్చినట్లు ప్రిన్సిపాల్ పి.సుధాకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగగా, 71 మంది విద్యార్థినులు ఎగ్జామ్స్ రాసినట్లు పేర్కొన్నారు. ఇందులో 70 మంది విద్యార్థినులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఎం.సాత్విక 567, వి.వైష్ణవి 559, జి.నిక్షిత 549, బి.దీపిక 547, వి.మౌనిక 538 మార్కులు సాధించి, తమ సంత్తాను చాటుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కల్వర్టు కోసం కందకం

• నెలలు గడుస్తున్నా కొనసాగని పనులు


రెడ్డికాలనీ, కుమార్‌పల్లికి వెళ్లే రహదారిపై కల్వర్టు కోసం తీసిన కందకం

రెడ్డికాలనీ, మే 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ రెడ్డికాలనీ, కుమార్‌పల్లికి వెళ్ల రహదారిపై కల్వర్టు కోంస కందకం తీశారు. నెల రోజులు గడుస్తున్నా పనులు జరగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. హనుమకొండ డీసీసీ భవన్ నుంచి వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులకు కల్వర్టు కోసం గుంతలు తీశారు. పనులు మర్చిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా రాకపోకలు నిలిచిపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరం నడిబొడ్డులో ప్రధాన రహదారిపై పరిస్థితి ఇలా ఉంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎర్ర జెండాలతో ఎరుపెక్కిన నగరం

వరంగల్ కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గురువారం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో బల్దియా కార్యాలయాలు, వార్డు ఆఫీస్‌లు, బల్దియా హాజరు అడ్డాల వద్ద ఎర్ర జెండాలు ఆవిష్కరించి మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సీపీఎం, సీపీఐ, ఐఎన్‌టీయూసీ. సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఎర్రజెండాలను ఎగురవేశారు. బల్దియా ఆవరణలో ఏర్పాటు చేసిన మేడే వేడుకలలో సీఐటీ యూ వరంగల్ అధ్యక్షుడు, కార్యదర్శి జన్ను ప్రకాశ్, సింగారపు బాబురావులు హాజరై ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. అనంతరం వారు సంయుక్తంగా మాట్లా డారు. కార్యక్రమంలో శ్యామ్, రాజు, చారి, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

• వరంగల్ మెడికల్: వరంగల్ హాస్పిటల్ ఆవరణలో గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ మేడే జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

• కేయూ క్యాంపస్: కేయూ మొదటి గేటు వద్ద గురువారం మేడే వేడుకలను పురస్కరించుకుని సీఐటీయూ కేయూ శాఖ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పుల్లా శ్రీనివాస్, శ్రీధర్‌కుమార్‌లోథ్‌లు హాజరై మాట్లాడారు.

• హనుమకొండ చౌరస్తా: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ పాలనలో కాపాడుకోవాల్సిన గత్యంతరం ఏర్పడిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. గురువారం హనుమకొండ అశోకజంక్షన్‌లోని మునిసిపల్ కార్యాలయం ముందు 139వ మేడే వేడుకలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బల్దియాలో ఘనంగా 139వ మేడే వేడుకలు


హనుమకొండ అశోక జంక్షన్‌లో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, మునిసిపల్ కార్మికులు

• కార్మిక రాజ్యస్థాపనతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్ అధ్యక్షతన మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి ఎర్రజెండా ఎగరవేసి మాట్లాడారు.

• కాజీపేట: కాజీపేటలో అన్ని కార్మిక సంఘాలకు నాలుగు నెలల్లో కార్మిక భవన్ నిర్మించి తీరుతామని, అందుకోసం 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట బాపూజీనగర్ పోచమ్మగుడి కమ్యూనిటీ హాల్‌లో గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మేడే జెండా ఆవిష్కరించిన అనంతరం కార్మిక భవన్ స్థలం మంజూరి పత్రాలను కార్మిక నాయకులకు అందజేసి మాట్లాడారు. ఆ తర్వాత ఎమ్మెల్యేను కార్మికులు ఘనంగా సన్మానం చేశారు. స్థానిక కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, నాయకులు పాల్గొన్నారు.

• వడ్డేపల్లి: వడ్డేపల్లి క్రాస్ రోడ్డులోని ప్రణయ్ మార్గ్‌లో శ్రీచైతన్య ఆటో డ్రైవర్స్ యూనియన్ అడ్డా అధ్యక్షుడు బచ్చు రవీందర్ ఆధ్వర్యంలో మేడే జెండాను తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌భాస్కర్ ఆవిష్కరించారు. ఎన్జీవోస్ కాలనీ సెంటర్‌లో సెంట్రింగ్ సలాక మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే జెండాను విజయ్ భాస్కర్‌తో పాటు 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు ఆవిష్కరించారు. వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్ర జెండాను తెలంగాణ రాష్ట్ర ఫిషర్‌మెన్ కాంగ్రెస్‌కవిటీ మెంబర్ మండల సమ్మయ్య ఆవిష్కరించారు. హనుమకొండలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మేడే జెండాను గాదె ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు.

• న్యూశాయంపేట : బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులతో కలిసి రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. మేడే వేడుకలలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్‌తోపాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేట జంక్షన్‌లో శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో హనుమకొండలోని పలుచోట్ల మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంసీపీఐ (యూ) పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి ఎర్రజెండా ఎగురవేశారు.

• మడికొండ: కాజీపేట మండలం రాంపూర్‌లో మేడే వేడుకలను గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మడికొండ గ్రామ శాఖ కార్యదర్శి మాలోతు శంకర్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్,జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, మునిగండ్ల భిక్షపతి, స్వామి, భిక్షపతి, స్వరూప, రాసమల్ల కుమార్, దీనా, మోహన్, రామానుజ, ఏలియా పాల్గొన్నారు.


కాజీపేటలో కార్మిక భవనానికి స్థలం మంజూరు పత్రాలను కార్మికులకు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని


కాజీపేటలో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్


బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న శ్రీనివాసరావు


సీపీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబురావు

గౌరవెల్లి ప్రాజెక్టుకు భూ సేకరణ పూర్తి చేయాలి

▸▸ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి) : గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం హనుమకొండ జిల్లా పరిధిలోని వేలేరు, భీమదేవరపల్లి మండలాల్లో భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ, పరకాల నియోజకవర్గంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు, జాతీయ రహదారుల నిర్మాణ పనులలో పూర్తి చేయాల్సిన వాటిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయా పనులకు సంబంధించిన పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భీమదేవరపల్లి, వేలేరు మండలాల పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువకోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ మే చివరి నాటి కల్లా ప్రాథమిక డిక్లరేషన్ పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలో భాగంగా భూములు కోల్పోతున్న పరకాల, దామెర, శాయంపేట, ఆత్మకూరు మండలాల పరిధిలోని గ్రామాల నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులలో భాగంగా ఫీల్డ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, జాతీయ రహదారుల శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా చేయాలి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు వేగంగా చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం పశ్చిమ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ఏర్పాటు, కాజీపేట బస్టాండ్, కాజీపేట దర్గా ఆర్వోబీ, తదితర అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకర్గంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ సంస్థల భవనాలకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి, ఆ సర్వే రిపోర్టును అధికారులు తెలియజేయాన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో, కాజీపేట తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూతన పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించండి : మేయర్


పోతననగర్‌లో పైపులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ పోతన డంపింగ్ యార్డ్‌లో ఉంచిన పైప్‌లైన్‌లను పరిశీలించారు. వరంగల్ జెమిని టాకీస్ నుంచి 12 మోరీల వరకు పాత పైప్‌లైన్ ఉండడం వల్ల తరుచుగా నీరు లీకేజీ జరుగుతోందని, వెంటనే కొత్తపైప్‌లైన్ పునరుద్ధరణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈఈ రవికుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు కంటేశ్వర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

దేశంలో కులగణన కూడా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గురువారం ముఖ్యమంత్రిని మేయర్ గుండు సుధారాణి కలిసి అభినందనలు తెలిపారు. సీఎం క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

వడ్డెపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని సత్యసాయి సేవా సమితి హనుమకొండ శాఖ జిల్లా అధ్యక్షుడు గండి వెంకటేశ్వర్లు, కన్వీనర్ నోముల కైలాష్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు టీవీఎన్ మూర్తి, నర్సింహరావు, నారాయణ, పద్మిని, అరుణ, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు గంగిల్ల లింగారెడ్డి

హసన్‌పర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ కమ్యూనిస్టు గంగిల్ల లింగారెడ్డి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మేడే వేడుకలను పురస్కరించుకొని 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో గురువారం గంగిల్ల లింగారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు నేదునూరి రాజమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీపీఐ జెండాను ఎగురవేసి లింగారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బీకేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాంరెడ్డి సేవలు అభినందనీయం

హనుమకొండ కలెక్టరేట్, మే1(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ శాఖ అధికారి రాంరెడ్డి సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కొనియాడారు. జిల్లా బీసీ వెల్ఫేర్ డీడీగా పని చేసి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేసిన గడ్డం రాంరెడ్డి - సువర్ణలత దంపతులను గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంక్షేమ శాఖ అధికారిగా రాంరెడ్డి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ కుమార్, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, రాంరెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.


రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సమ్మె విరమణ

కేయూ క్యాంపస్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కేయూ పరిపాలన భవనం ఎదుట 10 రోజులుగా పార్టుటైమ్ అధ్యాపకులు చేస్తున్న దీక్షలు గురువారం విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు తెలిపారు. ఈసందర్భంగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెలో పార్టుటైమ్ అధ్యాపకులు చేసిన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని వివరించారు. ఈ కార్యక్రమంలో కేయూ పరిపాలన అధికారులు ప్రొఫెసర్లు రాజేందర్ కట్ల, వాసుదేవారెడ్డి, టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు నరేందర్, దేవోజీ, భాగ్యమ్మ, విజయ, శ్రీకాంత్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం చేయని విద్యార్థులకు మెస్ బిల్లులు వేయొద్దు : డీవైఎఫ్ఐ

కేయూ క్యాంపస్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కేయూ కామన్ మెస్‌లో భోజనం చేయని విద్యార్థులకు మెస్ బిల్లులు వేయకుండా మినహాయింపు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి కోరారు. ఈ మేరకు గురువారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి మెస్ బిల్లులపై వినతి పత్రాన్ని అందచేశారు. మొదటి ఏడాది విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో రెండో ఏడాది విద్యార్థులు సైతం సెలవులకు ఇంటికి వెళ్లారని తెలిపారు. ఇంటికి వెళ్లిన విద్యార్థులకు మెస్ బిల్లులు వేయవద్దని కోరారు. గత ఏడాది వేసవిలో ఇంటికి వెళ్లిన విద్యార్థులకు మెస్ బిల్లులు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాగర్, సాయి, గణేశ్, ఎం.శ్రీసాయి, ఎన్.ప్రవీణ్, ధన్‌రాజ్, ఎస్.గణేశ్, పి.యుగేందర్, వినయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేందర్ పవార్

వడ్డెపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు శాశ్వత పట్టాలను ఇచ్చి భూ సమస్యలను పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేందర్ పవార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ప్రైవేటు సమావేశ మందిరంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తేజావత్ వాసు నాయక్, శ్రీను నాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

హనుమకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారతీయ యాత్రికులకు నివాళులర్పిస్తూ అమరవీరుల స్థూపం వద్ద జీటీఏ ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రకాశ్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జా వెంకటేశం, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరాచారి, వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నరేంద్ర స్వామి, బిల్లా కోటేశ్వర్ రావు, వరంగల్ జిల్లా ఉపాధ్యాక్షుడు సాంబమూర్తి, కోశాధికారి రాములు, ఆకోజు కిరణ్, కురసపల్లి భిక్షపతి తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

పేద మెరిట్ విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచిత విద్య



హనుమకొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తీర్ణులై అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచిత విద్య అందిస్తున్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 560 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు 100 శాతం ఫీజులో రాయితీ, 540 నుంచి 560 మార్కులు వస్తే 60 శాతం ఫీజులో రాయితీ, 520 నుంచి 540 మార్కులు వస్తే 50శాతం రాయితీ, 500నుంచి 520 మార్కులు వస్తే 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఐఐటీ మెడికల్ కోచింగ్‌కు దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థ అయిన కోటా రాజస్థాన్ మోషన్ ఐఐటీ, జేఈఈ, నీట్ జూనియర్ కళాశాల హనుమకొండలో విద్యార్థులుఅడ్మిషన్ పొంది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. హనుమకొండ లోని నయీంనగర్‌లో కోటా రాజస్థాన్ నుంచి ఏర్పడిన మోషన్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరుగుతోందన్నారు.

నేడు శంకర, రామానుజ జయంతి

హనుమకొండ కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ శుద్ధ పంచమి, శుక్రవారం జగద్గురు ఆదిశంకరచార్య, భగవత్ రామా నుజాచార్యుల జయంతి వేడుకలు జరుగనున్నాయి. తెలంగాణ బ్రహ్మణ సేవా సమితి ధన్వంతరి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయ సమీపంలోని కూడా గార్డెన్స్‌లో అనేకమంది పండిత ప్రముఖుల సమక్షంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమాలు జరుగనున్నాయి. శంకరాచార్య, రామానుజుల అష్టోత్తర నామాల అర్చన, భజన బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి.

గీతాసారం

మనస్సును లొంగదీసుకుందాం

పెంపకం వల్ల, సమాజం వల్ల మనం కులం, జాతి, మతం వర్గం లాంటి అనేక కృత్రిమమైన విభజనలకు లోనవుతాం. ఈ విభజనలన్నిటినీ అధిగమించి అందరినీ సమానంగా చూడడమే సమత్వం వైపు తొలి అడుగు. ఇది బాహ్య ప్రవర్తన కన్నా చాలా లోతైన విషయం.



సమత్వం లేదా సమానత్వం అనేది భగవద్గీతలో అనేక చోట్ల కనిపించే కీలకమైన అంశం. సమత్వ భావన, సమత్వ దృష్టి, సమత్వ బుద్ధి గురించి శ్రీకృష్ణుడు అనేక చోట్ల ప్రస్తావించాడు. బాధను, సంతోషాన్ని, లాభాన్ని నష్టాన్ని జ్ఞాని సమానంగా చూస్తాడంటూ అనేక ఉదాహరణలు కూడా ఇచ్చాడు.

సమత్వాన్ని అర్థం చేసుకోవడం సులభం. కానీ దాన్ని ఆచరణలో పెట్టడం కష్టం. ఒక మాటలో చెప్పాలంటే... మనలోని సమత్వం స్థాయి ఆధ్యాత్మిక ప్రయాణంలో మనం సాధించే పురోగతికి సూచిక. 'పౌరులందరూ చట్టం ముందు సమానమే' అంటూ సమత్వాన్ని ఆధునిక సమాజాలు అంగీకరించాయి. సమత్వం వైపు మన పురోగతిలో తదుపరి స్థాయి... దగ్గరగా ఉన్న ఇద్దరు వ్యక్తులను సమత్వ దృష్టితో/ భావనతో చూడడం. ఇందుకు ఉదాహరణ... మన పిల్లలు అంతగా రాణించని సందర్భాలలో మన మిత్రుల పిల్లలు రాణిస్తూ ఉంటే చూసి సంతోషించగలగడం. అత్తను, తల్లిని సమానంగా చూడడం, కూతురును, కోడలును ఒకే విధంగా ఆదరించడం. ఇతరులను మనతో సమానంగా చూసే సామర్థ్యం... సమానత్వానికి పతాకస్థాయి. ఇతరులకు పదోన్నతి, కీర్తి, ప్రతిష్ఠలు, ఆస్తులు దక్కినప్పుడు... సమత్వభావనతో వ్యవహరించగలిగే సామర్థ్యం ఇది. ఇతరుల బలహీనతలను మనలో, మనలోని సామర్థ్యాలను ఇతరులలో చూడగలిగితేనే ఇది సాధ్యపడుతుంది.

అందుకే మనల్ని ఇతరులలో, ఇతరుల్ని మనలో చూడాలని శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. చివరికి తనను (శ్రీకృష్ణుణ్ణి) అందరిలో, అన్నిటిలో చూడమని చెప్పాడు. ప్రతిదాన్ని విభజించి చూసేలా సామాజికంగా శిక్షణ పొందిన మనస్సు... అత్యున్నత స్థాయి సమత్వాన్ని పొందడానికి పెద్ద అవరోధం. మన మీద మనస్సు అధిపత్యం చెలాయించేలా అనుమతించడానికి బదులు మనమే మనస్సును లొంగదీసుకోవాలి. అప్పుడే సమత్వ భావనను సాధించడం సాధ్యపడుతుంది.

కె. శివప్రసాద్

ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాలను 'త్రిమతాలు'గా వ్యవహరిస్తారు. వాటిని ప్రవచించినవారు శ్రీమధ్వాచార్యులు, శ్రీఆదిశంకరులు, శ్రీమద్రామానుజాచార్యులు. వారిలో ఆదిశంకరులు, రామానుజాచార్యుల మధ్య సుమారు 400 ఏళ్ళ కాల వ్యవధి ఉన్నప్పటికీ... వారిద్దరి జన్మ తిథి వైశాఖ శుద్ధ పంచమి (నేడు) కావడం విశేషం. వారు స్థిరపరచిన సంప్రదాయాలు ఈనాటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ... భక్తి, ఆధ్యాత్మికతలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

అద్వైత దీప్తి

ధర్మ సంస్థాపనకోసం ప్రతి యుగంలోనూ జన్మిస్తానన్నాడు శ్రీకృష్ణుడు. హిందూ ధర్మం శాఖోపశాఖలుగా చీలిపోయి, ఛాందసత్వం పెరిగిపోయి ధర్మానికి హాని కలిగినప్పుడు... దాన్ని చక్కదిద్ది, సన్మార్గాన్ని చూపించడానికి సాక్షాత్తూ శంకరుడే ఆదిశంకరునిగా అవతరించారంటారు పెద్దలు. జీవుడు, దేవుడు ఒకటేననే అద్వైతాన్ని ప్రబోధించడంతో పాటు అపారమైన ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను గ్రంథరూపంలో అందించిన మహనీయుడు ఆదిశంకరాచార్యులు.

భారతీయ తత్త్వ చింతనపై ఎన్ని తరాలైనా చెరగని ముద్రవేసిన ఆచార్యులలో ప్రథముడు, జగద్గురువు ఆది శంకరులు. బౌద్ధ, జైన మతాలను నాటి పాలకులు అవలంబించి, వాటి వ్యాప్తికి దోహదం చేయడంతో ప్రమాదంలో పడిన హిందూ ధర్మాన్ని పునరుద్ధరించడానికి ఆయన ఎనలేని కృషి చేశారు. ఆసేతు హిమాచలం పర్యటించారు. వైదిక మతాన్ని, అద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడం కోసం దేశం నాలుగు దిక్కుల్లో పీఠాలు స్థాపించారు. వందల ఏళ్ళ తరువాత కూడా ఆ మఠాలు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నాయి. ఇది శ్రీశంకరుల సంకల్ప శుద్ధికి తార్కాణం.

శ్రీ శంకరులు కేరళలోని కాలడి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లితండ్రులు ఆర్యాంబ, శివగురు. అయిదేళ్ళ వయసులో... తల్లి అనుమతితో ఆపత్సన్యాసాన్ని స్వీకరించిన శంకరులకు క్రమ సన్యాసాన్ని గోవింద భగవత్పాదులు అనుగ్రహించారు. తదనంతరం వారణాసి నగరంలో వ్యాసుని ఆదేశం మేరకు రచనా వ్యాసంగాన్ని చేపట్టారు. వ్యాస విరచిత ప్రస్థాన త్రయమైన భగవద్గీతకు, ఉపనిషత్తులకు, బ్రహ్మ సూత్రాలకు భాష్యాలు రాశారు. అలాగే, దేవతలను స్తుతిస్తూ ఆయన రచించిన శ్లోకాలు నేటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రీ శంకరులు పుట్టినప్పుడు ఆయనకు నిర్దేశితమైన ఆయుష్షు ఎనిమిదేళ్ళే. సన్యాసంతో మరో ఎనిమిదేళ్ళు, వ్యాసుడి అనుగ్రహంతో మరో పదహారేళ్ళు... మొత్తం ముప్పై రెండేళ్ళపాటు ఆయన ఈ భూమిపై జీవించారు. ఆ కాలంలోనే ఆయన అనన్య సామాన్యమైన అద్భుతాలెన్నో చేశారు. హిందూ ధర్మంలోని వివిధ శాఖలలో ఉన్న ఛాందస భావాలను, మూఢ విశ్వాసాలను శ్రీ శంకరులు తొలగించారు. దైవం అనే గమ్యాన్ని చేరడానికి ప్రయాణించే మార్గాలు వేరైనంత మాత్రాన... తమ మార్గమే గొప్పది అనే పిడివాదం తగదని బోధించారు. షణ్మత స్థాపనాచార్యునిగా వినుతికెక్కారు. ఆ మత మార్గాల్లోని సాత్వికతను వెలికి తీసి, వారి వారి సంప్రదాయాలకు అనుగుణంగా తమ దేవతలను ఆరాధించడానికి వీలుగా... పంచాయతన పూజను ఏర్పాటు చేశారు. దేశంలో ఆలయ వ్యవస్థను పటిష్ఠం చేసి, పూజావిధానాలను నిర్దేశించారు.



ఏం చెప్పారు?

శ్రీ శంకరులు ప్రతిపాదించిన సిద్ధాంతం అద్వైతం. అంటే రెండు కానిది. అంటే ఆత్మ, పరమాత్మ (బ్రహ్మం) వేరు కావు. ఇది అద్వైత సిద్ధాంతానికి పునాది. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ న పరః...' అంటే బ్రహ్మమే సత్యం. మనకు కనిపించే ఈ ప్రపంచం సమస్తం మిథ్య. జీవుడికి, దేవుడికి (బ్రహ్మనికి) భేదం లేదు. ఇదే బ్రహ్మ జ్ఞానం. ఈ జ్ఞానాన్ని పొందినవారు జీవన్ముక్తులు అవుతారు. శ్రీ ఆదిశంకరుల అద్వైతం భారతీయ తత్త్వ సిద్ధాంతాల్లో అత్యున్నతమైనది అనేది పండితుల అభిప్రాయం. దీన్నే 'మాయావాదం' అని కూడా అంటారు.

సమతా స్ఫూర్తి

"జ్ఞానం అందరిదీ. అది రహస్యం కాకూడదు. దాన్ని పొందడానికి ఎలాంటి ఆంక్షలు, నిషేధాలు ఉండకూడదు" అని నినదించడమే కాదు, గురువు ఆదేశాన్ని ధిక్కరించి, లోకానికి అష్టాక్షరీ మంత్రాన్ని ఎలుగెత్తి ప్రకటించిన ఆధ్యాత్మిక విప్లవకారుడు శ్రీమద్రామానుజాచార్యులు. అచంచలమైన భక్తితో ఆరాధిస్తే ఎవరైనా ఆ భగవంతుడి అనుగ్రహాన్ని అందుకోవచ్చని స్పష్టం చేసిన శ్రీరామానుజులు... శ్రీవైష్ణవ ధర్మాన్ని కుల, లింగ భేదాలకు అతీతంగా రూపుదిద్దారు. "సకల జగత్తుకు కారకుడు భగవంతుడైన ఆ శ్రీమన్నారాయణుడు. ఆయన పట్ల భక్తిప్రపత్తులను కలిగి ఉండాలి. అప్పుడే పూర్వ ప్రస్తుత కర్మల వల్ల కలిగిన సుఖదుఃఖాల నుంచి విముక్తి పొందగలం. దీనికి వైష్ణవ ధర్మానుసరణ దోహదం చేస్తుంది" అని ప్రవచించిన శ్రీమద్రామానుజాచార్యులది విశ్వమానవ సిద్ధాంతం. సమతను, మానవతను చాటిచెప్పిన ఆయన వెయ్యేళ్ళ క్రితమే కులమతాలకు అతీతంగా సహపంక్తి భోజనాలను ప్రోత్సహించారు. అతి గోప్యమైన తిరుమంత్రాన్ని సామాన్య ప్రజానీకానికి వెల్లడి చేశారు. ఎన్నో గ్రంథాలు రచించి, శ్రీ భాష్యకారులుగా ప్రసిద్ధి చెందారు.

త్రిమతాచార్యుల్లో ముఖ్యుడైన శ్రీమద్రామానుజులు... కేశవాచార్యులు, కాంతిమతి దంపతులకు తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జన్మించారు. చిన్న వయసులోనే జ్ఞానం కోసం అన్వేషించారు. తనకు తగిన గురువు తిరుగోష్టియూరులో ఉన్నారని తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. కానీ గురువు పదే పదే ఆయనకు పరీక్షలు పెట్టారు. కాలినడకన శ్రీరంగం నుంచి పద్దెనిమిది సార్లు తిరుగుతూనే ఉన్నారు. చివరకు గురువు ఆయనకు అష్టాక్షరీ మంత్రాన్ని బోధించి, దాని రహస్యాలను వెల్లడించారు. వేరే ప్రాంతం నుంచి వచ్చి... ఉపదేశం పొందిన శ్రీరామానుజుల గురించి ప్రజలకు తెలిసింది. "మాలాంటి వారి పరిస్థితి ఏమిటి? మాకు ముక్తి ఎలా లభిస్తుంది?" అని వారు ఆయనను అడిగారు. 'దేవుడికి మానవులందరూ సమానమైనప్పుడు, అందరూ ఆ దేవదేవుణ్ణి ఆరాధిస్తున్నప్పుడు... తిరుమంత్రం రహస్యంగా ఎందుకు ఉండాలి?' అనే అంతర్మథనానికి రామానుజులు గురయ్యారు. వెంటనే అక్కడ ఉన్న ఆలయ గోపురాన్ని ఎక్కి, ప్రజలందరినీ పిలిచి... 'ఓం నమో నారాయణాయ' అనే ఆ మంత్రాన్ని ప్రకటించారు. దీనివల్ల గురువు ఆగ్రహానికి గురైనా లెక్క చేయలేదు. ఆ తరువాత ఆయన ప్రముఖ వైష్ణవ ఆలయాలను సందర్శించారు. జీర్ణస్థితిలో ఉన్నవాటిని పునరుద్ధరించారు. బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యాలు రాశారు. వాటితోపాటు ఆయన రాసిన గద్యాలు, ఇతర వేదాంత రచనలు శ్రీరామానుజ నవరత్నాలుగా ప్రఖ్యాతి చెందాయి. నూట ఇరవయ్యేళ్ళ పాటు పరిపూర్ణంగా జీవించిన ఆయన కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ పర్యటించి, వైష్ణవ సంప్రదాయానికి, తన విశిష్టాద్వైత సిద్ధాంతానికి ప్రాచుర్యం కల్పించారు.


ఏం చెప్పారు?

"ఆత్మ, పరమాత్మ వేరు వేరు. దేని స్వభావం దానిదే. కానీ ఆ రెండిటికీ విడదీయలేని సంబంధం ఉంది" అని శ్రీమద్రామానుజులు ప్రవచించారు. ఈ సిద్ధాంతమే విశిష్టాద్వైతంగా ప్రాచుర్యం పొందింది. "ప్రపంచం అనేది భ్రమ కాదు, ఆ పరమాత్ముడి సృష్టి. మోక్షాన్ని పొందడానికి భగవద్భక్తే ప్రధాన మార్గం. ఇది కేవలం ఉన్నతవర్గాలవారికో, పండితులకో పరిమితమైనది కాదు, కాకూడదు. అది అందరిదీ. విష్ణువుపై చిత్తాన్ని ఉంచి, నిర్మలమైన మనస్సుతో ఆరాధించేవారు ఎవరైనా వైష్ణవులే"నన్నది శ్రీరామానుజ ఉవాచ.



ఈ యోగం గురించి ఆనాడే...

సహజయోగ



"ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు మాత్రమే మానవులు అత్యున్నతమైన ఆనంద స్థితికి చేరుకోగలరు. దీనికోసం తపస్సులు చేయనక్కరలేదు. ఉపవాసాలు ఉండనక్కర్లేదు. ఏ కులం, మతం, ప్రాంతం వారైనా, పురుషులైనా, స్త్రీలైనా దాన్ని సాధించవచ్చు" అని ప్రబోధించడమే కాదు... సహజయోగ ద్వారా దాన్ని ఆచరణాత్మకంగా నిరూపించారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. కాగా, ఇటువంటి మార్గాన్ని మానవాళికి చూపించడానికి ఒక యోగి రాక గురించి, ఆ యోగం తాలూకు లక్షణాల గురించి పూర్వ గ్రంథాలలో ప్రస్తావన ఉండడం విశేషం. సప్త ఋషులలో ఒకరైన భృగు మహర్షిని జ్యోతిష శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారు. ఆయన 'భృగు సంహిత' కన్నా ముందే గొప్ప నాడీ గ్రంథాన్ని (భృగు నాడి) రచించారు. పురాతన జ్యోతిష గ్రంథాల్లో నేటికీ దాన్ని ప్రామాణికమైనదిగా పరిగణిస్తారు. దీనిలో భవిష్యత్తులో జరగబోయే గొప్ప ఆధ్యాత్మిక సంఘటనలను కూడా అందులో వివరించారు. ఆ గ్రంథాన్ని మూడు వందల ఏళ్ళ క్రితం ఆచార్య శ్రీభుజేందర్ మరాఠీ భాషలో తర్జుమా చేశారు. అందులో ప్రస్తావితమైన భవిష్య వాణి ప్రకారం:

ఇప్పుడు అందరికీ సాధ్యమే...

బృహస్పతి మీనరాశిలో ఉన్నప్పుడు... పరబ్రహ్మ స్వరూపమైన ఒక గొప్ప యోగి భూమిపై అవతరిస్తారు. కొన్నేళ్ళ తరువాత... ఒక కొత్త యుగం ప్రారంభం అవుతున్నట్టు చాలామందికి స్పష్టంగా తెలుస్తుంది. మానవుడి జీవితం సంపూర్ణ పరివర్తనకు లోనవుతుంది. అలాంటి సమయం ఆసన్నమయ్యేవరకు... ఒక యోగి లేదా భక్తుడు మోక్షం ద్వారా లభించే ఆనందం పొందాలన్నా, జీవిత పరమార్థం తెలుసుకోవాలన్నా కేవలం భక్తి, జ్ఞానం, ప్రాచీన యోగమార్గాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే సాధ్యం. కానీ దానికోసం అతను తన సూక్ష్మ శరీరంలో నిద్రాణ స్థితిలో ఉన్న వివిధ చక్రాల శక్తులను మేలుకొలపడం కోసం, కుండలినీ శక్తి ఉద్దీపన కోసం తీవ్రమైన తపస్సు చేయవలసి ఉంటుంది. కానీ ఆ గొప్ప యోగి రూపొందించే సరికొత్త యోగ పద్ధతి ద్వారా మానవులు తమ జీవితకాలంలోనే మోక్షం తాలూకు ఆనందాన్ని పొందగలుగుతారు. దేనినీ త్యాగం చేయవలసిన అవసరం ఉండదు. అప్పటిదాకా గొప్ప గొప్ప యోగులు మాత్రమే... అదికూడా వారు సమాధి స్థితికి చేరుకొని, మరణించడానికి ముందు మాత్రమే ఈ బ్రహ్మానందాన్ని అనుభవించగలుగుతారు. కానీ ఈ కొత్త తరహా యోగం ద్వారా సమాధి స్థితిలోకి చేరకుండానే అది సాధ్యం అవుతుంది. ప్రారంభంలో ఈ యోగాన్ని, తద్వారా మోక్షాన్ని పొందడం లక్షల్లో ఒకరికి మాత్రమే సాధ్యం అవుతుంది. ఆ తరువాతి కాలంలో మానవ జాతి మొత్తానికి అది వ్యాప్తి చెందుతుంది. అప్పుడు ప్రజలు నిత్యావసరాలకు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. వారు సాధారణ జీవితాలను గడుపుతూనే... ఈ యోగ పద్ధతి ద్వారా భగవంతుడితో ఐక్యతను అనుభూతి చెందుతారు. అజ్ఞానం, మాయ ముసుగులు తొలగిపోతాయి. గతంలో యోగులు చాలా కష్టపడి, తీవ్ర తపస్సు ఫలితంగా సాధించిన అనంతమైన ఆనందం, మోక్షం ఎంతోమంది మానవులకు సులభంగా అందుబాటులోకి వస్తుంది.

కొత్తదేం కాదు...

ఆ గ్రంథంలో పేర్కొన్న సమయం... నిర్మలాదేవి సహజయోగ పద్ధతిని ఆవిష్కరించిన సమయం దాదాపుగా సరిపోతున్నాయి. ఆమె భౌగోళికంగా భారతదేశానికి మధ్యలో ఉన్న చింద్వారా ప్రాంతంలో... పగలు, రాత్రి సమానంగా ఉండే విషువత్తు రోజున... 1923 మార్చి 21 మధ్యాహ్నం పన్నెండు గంటలకు జన్మించారు. 1970 మే 5వ తేదీన సహజ యోగ మార్గాన్ని ఆవిష్కరించారు. ఎలాంటి తపస్సులు, బాధలు, ఉపవాసాలు లేకుండా, అన్ని కోరికలను త్యజించాల్సిన అవసరం లేకుండా... దీని ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందవచ్చునని స్పష్టం చేశారు. కుండలినీ శక్తిని ఆమె ఉత్థానం చేయడాన్ని, ఆ శక్తి ఉత్థానం చెందినప్పుడు వివిధ చక్రాల వద్ద కలిగే ప్రతిస్పందించడాన్ని వేలాది మంది తిలకించారు. తరువాత ఎందరో ఈ మార్గంలోకి ప్రవేశించి, సహజయోగను ఆచరించడం మొదలుపెట్టారు. ఒకప్పుడు ఋషులు కఠోరమైన తపస్సు చేస్తే కాని సాధ్యం కాని కుండలినీ శక్తి జాగృతి... నేడు సాధారణ గృహస్థ జీవితం గడుపుతున్న సామాన్యులకు ఎలా సాధ్యమయిందనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ... "మానవాళి తమ పరిణామక్రమంలో అత్యున్నత స్థాయికి చేరుకొనే సమయం ఇప్పుడు ఆసన్నమయింది కాబట్టి. వారిలోపల ఉన్నదాన్నే నేను పరిచయం చేశాను. కొత్తగా ఏదీ వారికి ఇవ్వడం లేదు" అని చెప్పారు. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో సహజయోగులు ఉన్నారు. సహజయోగపై పరిశోధనలు చేసినవారు పలు విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లు ప్రదానం చేశాయి. ఢిల్లీ విశ్వవిద్యాలయం సహజయోగను ప్రత్యామ్నాయ వైద్యంగా గుర్తించింది. సహజయోగ సాధనలో ఉద్భవించే చైతన్య తరంగాల ద్వారా వ్యాధులను ముందే గుర్తించి, నయం చేసే పద్ధతులు కూడా అభివృద్ధి చెందుతున్నాయి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సద్బోధ

నిజంగానే చిత్రం



ఒక మహారాజుకు తన పడకగది గోడపైన హిమాలయ శిఖరాల దృశ్యం ఉంటే బాగుంటుందని అనిపించింది. తక్షణం తన రాజ్యంలోని ప్రముఖ చిత్రకారుణ్ణి పిలిపించాడు. "నా పడక గది గోడ మీద హిమాలయ శిఖరాల ఆకృతిని చూడముచ్చటగా, రంగులతో తీర్చిదిద్దాలని కోరాడు. స్వయంగా తీసుకువెళ్ళి ఆ గోడను చూపించాడు. అప్పుడు ఆ చిత్రకారుడు మహారాజా! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. కానీ నాకు కొంత గడువు ఇవ్వండి. మా ఇంటి గోడ మీద ఆ చిత్రాన్ని సిద్ధం చేస్తాను. మీరు దాన్ని చూసి మార్పులు, చేర్పులు ఏవైనా సూచించండి. ఆ ప్రకారం మీ పడక గది గోడ మీద... సరైన రంగులను వినియోగించి ఆ దృశ్యాన్ని తీర్చిదిద్దుతాను" అన్నాడు. అందుకు రాజు అంగీకరించాడు. చిత్రకారుడికి కొంత డబ్బు ఇచ్చి పంపించాడు.

ఆ తరువాత రెండేళ్ళు దాటాయి, మూడేళ్ళు గడిచాయి. చిత్రకారుడి జాడ లేదు. ఆ చిత్రాన్ని గురించి ఆలోచనలు రాజును వెంటాడుతున్నాయి. ఒక రోజు చిత్రకారుడు రాజ భవనానికి వచ్చాడు. "మహారాజా! చిత్రాన్ని సిద్ధం చేశాను. తమరు మా ఇంటికి వచ్చి, ఆ చిత్రాన్ని చూడాలని విన్నవించుకుంటున్నాను" అన్నాడు. వెంటనే రాజు అతనితో బయలుదేరి వెళ్ళాడు. చిత్రకారుడి ఇంటి గోడ మీద ఉన్న చిత్రాన్ని పరిశీలించాడు. అద్భుతం! తను ఊహించినదానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఆకర్షణీయంగా ఉంది. గతంలో రాజు అనేకసార్లు హిమాలయాలకు వెళ్ళాడు. ఆ అందమైన పర్వత శిఖరాలను ప్రత్యక్షంగా చూసి పరవశించిపోయాడు. చిత్రకారుడు తీర్చిదిద్దిన ఆ చిత్రంలోని శిఖరాల అందం అతణ్ణి ఏకంగా ఉన్నత లోకాల్లోకి తీసుకుపోతోంది. రాజుకు నోట మాట రాలేదు. కొయ్యబొమ్మలా అలాగే నిలబడిపోయాడు. కొద్దిసేపటి తరువాత తేరుకొని, ఆ చిత్రకారుడితో "నేను ఎన్నోసార్లు హిమాలయాలకు వెళ్ళి వచ్చాను. కానీ ఆ పర్వతం చుట్టూ తిరుగుతూ, తిరుగుతూ పైకి వెళ్ళే ఈ బాట ఎక్కడా కనబడలేదే? ఈ ఆలోచన నీకు ఎలా తట్టింది? ఈ బాట ఎక్కడినుంచి ఎక్కడకు వెళుతుంది?" అని అడిగాడు.


అప్పుడు చిత్రకారుడు "ఏమో మహారాజా! నాకూ తెలీదు. చూసి వచ్చి చెబుతాను, ఉండండి" అని ఆ చిత్రపటంలోని బాట ఎక్కి నడిచి, పర్వత శిఖరానికి వెనుకగా వెళ్ళి అదృశ్యమైపోయాడు.

తావో మత గ్రంథాల్లో ఉన్న ఈ కథను ఓషో వివరిస్తూ "ఇది నమ్మశక్యం కాని వింతైన కథ. మార్మికమైన కథ. ఒక చిత్రపటంలోకి చిత్రకారుడు నడిచి వెళ్ళడం ఏమిటి? అదృశ్యుడై, తిరిగి రాకపోవడం ఏమిటి? ఇది కల్పిత కథే. కానీ నిగూఢమైన సత్యాన్ని తెలిపే కథ. ఒక చిత్రకారుడు తాను గీస్తున్న చిత్రంలో నిమగ్నమైతే... ఆ చిత్రానికి అందం వస్తుంది. ఒక కవి తను రాస్తున్న కవిత్వంలో పూర్తిగా లీనమైతే అది దివ్య గీతంగా భాసిస్తుంది. అప్పుడు వారికి తమ సృష్టి విషయంలో ఎలాంటి సందేహాలు ఉండవు. భక్తి విషయం కూడా అంతే. దేవుడి విషయం కూడా అంతే. భగవంతుడి భక్తిలో పూర్తిగా నిమగ్నమైనవారు, దేవుడికి సాధ్యం కానిది ఏదీ లేదని భావించేవారు... ఆ సర్వాంతర్యామితో అనుసంధానం అవుతారు. వారికి దేవుడి ఉనికి పట్ల ఎలాంటి అనుమానం ఉండదు. 'నేను' అనే భావన తొలగిపోతుంది. వారిలో దైవం ప్రకాశిస్తుంది" అని చెప్పారు.

- రాచమడుగు శ్రీనివాసులు

సుభాషితం

వివేకం కోల్పోతే...



ఆకాశంబుననుండి శంభుని శిరం
బందుండి శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి
భూలోకంబునందుండి య
స్తోకాంభోధి బయోధినుండి
పవనాంధోలోకముం జేరె గం
గాకూలంకష పెక్కుభంగులు వి
వేకభ్రష్ట సంపాతముల్

భర్తృహరి 'నీతి శతకం'లోని 'శిరః శార్వం స్వర్గాత్పశుపతి శిరస్తః క్షితిధరం...' అనే అనే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి పై పద్య రూపంలో అందించారు.

భావం: స్వర్గ లోకంలో ఉండే గంగానది ఆకాశం నుంచి పరమశివుడి శిరస్సుపైకి ఉరికింది. అక్కడి నుంచి హిమాలయాల మీదకు దూకింది. ఆ తరువాత భూమిపైకి చేరింది. సముద్రంలో కలిసింది. చివరకు పాతాళ లోకానికి జారింది. వివేకాన్ని కోల్పోయినవారి తీరు పలు విధాలుగా ఉంటుంది. వారికి ఇటువంటి ఇక్కట్లు తప్పవు. వారు అధఃపాతాళానికి దిగజారిపోతారు.

ఆ నలుగురు

దైవమార్గం

దైవ పుత్రుడైన ఏసు క్రీస్తు మానవుడిగా ఈ భూమిపై జన్మించాడు. మానవులతో మమేకమయ్యాడు. సామాన్యులకు అర్థమయ్యే భాషలో, ఉపమానాలతో కూడిన కథలతో వారికి బోధ చేశాడు. శిలువపై మరణించిన క్రీస్తు పునరుత్థానం చెందిన తరువాత... నలభై రోజుల పాటు భూమిపై ఉన్నాడు. తదుపరి కర్తవ్యంపై తన శిష్యులకు దిశా నిర్దేశం చేశాడు. తాను చెప్పినవాటిలో వారు నమ్మినవాటిని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించాడు. క్షమాగుణంతో, ప్రేమతో మసలుకోవాలన్నాడు. తన బోధలు ప్రజలకు సువార్తలుగా చేరుకోవాలని, అవి దుఃఖంతో కలత చెందిన హృదయాలతో ఉన్న ప్రజలను మేలుకొలిపేలా, కష్ట సమయాల్లో తగినంత ఓదార్పు ఇచ్చేలా ఉండాలని సూచించాడు.

ఆ విధంగా ఆయన చెప్పిన సూక్తులను, బోధలను సువార్తలుగా గ్రంథస్థం చేసి, ప్రజలకు అందించిన మహనీయులు నలుగురు... మత్తయి, మార్కు, లూకా, యోహాన్. వారిని 'సౌవార్తికులు' అంటారు. వారు రాసిన సువార్తలు వారి పేరిటే (మత్తయి సువార్త, మార్కు సువార్త, లూకా సువార్త, యోహాను సువార్త) ప్రాచుర్యం పొందాయి. నూతన నిబంధన గ్రంథానికి ఆయువుపట్టు అయిన గ్రంథాలివి. క్రీస్తు జీవితాన్ని ఉన్నది ఉన్నట్టుగా వారు చిత్రీకరించారు. ఈ అదృష్టం దాదాపుగా క్రీస్తు శిష్యులకే దక్కడం విశేషం. కాగా. వీరితో పాటు పౌలు తదితరులు రాసిన లేఖలు, ఇతర శిష్యులు (అపోస్తలులు) చేసిన కార్యాలు కూడా ప్రముఖంగా కనిపిస్తాయి. ఏసు బోధలు, వాటిని అక్షరబద్ధం చేసిన గ్రంథాలు, ఏసు శిష్యులు సాగించిన సువార్తయాత్రలు ప్రజలకు దిక్సూచులు అయ్యాయి. ఆనాటి మూఢ నమ్మకాలు, మూఢాచారాలు తొలగి పోవడానికి సాయపడ్డాయి. వెలుగును చూడాలని తపనపడిన నాటి ప్రజలకు నాయకత్వం వహించాయి. వెన్నంటి తోడుగా నిలిచాయి.



- డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

అక్రమ నిర్మాణాలపై కఠినంగా ఉండండి

- రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వొద్దు
- న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, మే 1: అనుమతుల్లేని నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు అన్ని న్యాయస్థానాలకు సూచించింది. అక్రమ కట్టడాలకు చట్టపరంగా రెగ్యులరైజ్ చేసే అవకాశం కల్పించవద్దని తెలిపింది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థిస్తూ బుధవారం జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల విషయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమ కట్టడాలను రక్షించుకుంటూపోతే ఎలాంటి శిక్షలు పడవులే అన్న ధోరణి పెరిగిపోతుందని తెలిపింది. అందువల్ల తగిన అధికారి నుంచి సరైన అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టారా, లేదా అని చూడాల్సిన తప్పనిసరి బాధ్యత కోర్టులపై ఉందని పేర్కొంది. ఆ విధంగా చట్టబద్ధపాలనను బలపరచాల్సి ఉంటుందని తెలిపింది. చట్టమంటే గౌరవం లేని వారికి రెగ్యులరైజేషన్ చేయాలని కోరే హక్కు ఉండదని పేర్కొంది. అక్రమంగా నిర్మించిన రెండు అంతస్తులను కూల్చివేయాలని కోల్‌కతా మునిసిపాలిటీ నోటీసులు పంపించగా దాన్ని సవాలు చేస్తూ యజమానులు తొలుత హైకోర్టును ఆశ్రయించారు. అందుకు హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. హైకోర్టు నిర్ణయాన్ని ధర్మాసనం సమర్థించడంతోపాటు 'ధైర్యం, నిబద్ధత'తో వ్యవహరించిందని ప్రశంసించింది. రెగ్యులరైజ్ చేయాలన్న వినతిని తిరస్కరించింది. కోర్టులు కూడా చట్టం ప్రకారమే వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపింది. అతిక్రమించే వారిపై ఎలాంటి సానుభూతి చూపాల్సిన పనిలేదని, క్షమించాల్సిన అవసరం లేదని పేర్కొంది. అక్రమ కట్టడాలను కూల్చి వేయాల్సిందేనని స్పష్టం చేసింది.



బెంచ్‌ల తీరు ఆందోళనకరం

- పొంతన లేని తీర్పులతో జూదరి క్రీడలా మారిన వ్యాజ్యాలు
- ఓ కేసులో కర్ణాటక హైకోర్టు తీరుపై సుప్రీం ఫైర్

న్యూఢిల్లీ, మే 1: ధర్మాసనాలు ఇస్తున్న పొంతనలేని, పరస్పర విరుద్ధ తీర్పులు న్యాయవ్యవస్థ పట్ల ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వాటి తీరుతో జూదరి క్రీడలా వ్యాజ్యం తయారైందని ఆందోళన వ్యక్తంచేసింది. నిర్ణయాల్లో బెంచ్‌ల అస్థిర వైఖరి కక్షదారులు తమకు అనుకూలంగా ఉండే కోర్టును ఎంచుకునే పరిస్థితిని (ఫోరమ్ షాపింగ్) తెచ్చిందని ఆక్షేపించింది. భర్తపై నమోదైన గృహహింస అభియోగాలను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు వెలువరించిన తీర్పుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ వ్యాజ్యాన్ని బాధిత భార్య సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. భర్త, అత్తామామలు తనపై గృహహింసకు పాల్పడ్డారంటూ ఆమె కేసు పెట్టగా, ఆకేసును రద్దు చేయాలంటూ నిందితులు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఒక బెంచ్ అత్తామామల పిటిషన్‌ను కొట్టివేయగా.. మరో బెంచ్ ఆమె భర్తకు ఊరట కల్పించింది. పూర్వ బెంచ్ తీర్పును పరిశీలించకుండానే అతనిపై మోపిన అభియోగాలను రద్దుచేసింది. దీనిపై భార్య సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల బెంచ్ విచారించింది. ఒకే కేసులో రెండు బెంచ్‌లు వేర్వేరు తీర్పులు, పొంతనలేని నిర్ణయాలు ఎలా వెలువరించాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తాజా ఘటనలో ఒక బెంచ్ తీర్పును మరో బెంచ్ కనీసం పరిశీలించలేదని, నిందితుడికి ఊరటను కల్పించడానికి కారణాలను తీర్పులో ప్రస్తావించలేదని జస్టిస్ బాగ్చీ తెలిపారు. బాధిత భార్య పిటిషన్‌ను అనుమతిస్తూ నిందితుడిపై తిరిగి క్రిమినల్ అభియోగాలు మోపి కేసు దర్యాప్తును కొనసాగించాలన్నారు.


ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

- క్రియేట్ ఇన్ ఇండియా.. క్రియేట్ ఫర్ వరల్డ్
- వేవ్స్ సదస్సులో ప్రధాని మోదీ ఆకాంక్ష
- ముంబైలో అట్టహాసంగా వేవ్స్ ప్రారంభం
- వేవ్స్‌తో 'ఆరెంజ్ ఎకానమీ'కి నాంది: మోదీ
- భానుమతి, గురుదత్, సలీల్ స్టాంపుల విడుదల
- 400 కోట్లతో క్రియేటివ్ టెక్నాలజీ: అశ్వినీ వైష్ణవ్



ముంబై, మే 1: ప్రపంచ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్ మారనుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ముంబైలో నాలుగు రోజుల పాటు జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్)ను ఆయన గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. సినీ నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం, ప్రత్యక్ష సంగీత కచేరీలకు వేవ్స్ వేదికకానుంది. 100కు పైగా దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. వినోదరంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సదస్సును ఏర్పాటు చేయగా.. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ దిగ్గజాలు షారుఖ్‌ఖాన్, ఆమీర్‌ఖాన్, అక్షయ్‌కుమార్, హేమమాలిని, దీపిక పదుకొనే, అలియా భట్, రణ్‌బీర్ కపూర్, చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, ఎంఎం కీరవాణి, శ్రీలీల, రజనీకాంత్, మోహన్‌లాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కీరవాణి స్వరకల్పనలో రుగ్వేదంలోని శ్లోకాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ గీతాన్ని శ్రేయాఘోషల్, చిత్ర, మంగ్లి, లిప్సిక ఆలపించారు. భానుమతి, గురుదత్, సలీల్ చౌదరిల శత జయంతి సందర్భంగా ఇదే వేదికపై వారి స్టాంపులను ప్రధాని ఆవిష్కరించారు. భానుమతి మనవరాలు మీనాక్షి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతోందని, వేవ్స్ వల్ల ఆరెంజ్ ఎకానమీకి నాంది పడుతుందన్నారు. "సృజనాత్మకతకు కేంద్రంగా వేవ్స్ తయారై.. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. 1913లో రాజా హరిశ్చంద్ర సినిమాతో మన దేశ ఘనత నలుదిశలకు వ్యాపించింది. ఇటీవల 50 దేశాల గాయకులు 'వైష్ణవ జనతో' గీతాన్ని ఆలపించారు. సృజన ఉన్న యువత దేశానికి అసలుసిసలు ఆస్తి. కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహిస్తాం. క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ వరల్డ్"అని పేర్కొన్నారు. "వేవ్స్ అనేది సంస్కృతి, సృజనల అనుసంధానం. సృజనను ప్రోత్సహించేందుకు త్వరలో 'వేవ్స్ అవార్డు'లను ప్రవేశపెడతాం" అన్నారు. ప్రధాని మోదీ పోరాటయోధుడని ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రశంసించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వేవ్స్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తారని కొందరు భావించారని చెప్పా రు. కానీ ఈ కార్యక్రమం వాయిదా పడదని తాను గాఢంగా నమ్మానన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో వినోద రంగంలో భారత్ అగ్రగామిగా నిలుస్తుందని బాలీవుడ్ నటుడు షారుఖ్ అభిప్రాయపడ్డారు. కాగా ఐఐఎం,ఐఐటీల తరహాలో క్రియేటర్ల కోసం రూ.400 కోట్లతో ముంబైలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీని ప్రారంభిస్తామని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం దీనికి భూమిని ఇవ్వటానికి అంగీకరించిందన్నారు.





చిత్రజ్యోతి
SINCE 1965

ప్రపంచ ఆడియో వీడియో ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను గురువారం ప్రధాని మోదీ ముంబైలో ప్రారంభించారు. 100కు పైగా దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశాలు నాలుగో తేదీ వరకు జరుగుతాయి. వినోద రంగంలో మన దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు వేవ్స్‌ను ఒక వేదికగా ప్రభుత్వం తయారుచేసింది. ఈ కార్యక్రమంలో షారూక్‌ఖాన్, ఆమీర్‌ఖాన్, రజనీకాంత్, చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, అల్లు అర్జున్, అక్షయ్‌కుమార్, హేమమాలిని, దీపిక పదుకోణ్, ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్, రాజమౌళి, కార్తీక్ ఆర్యన్, శ్రీలీల, రాజ్‌కుమార్‌రావు, కబీర్ బేడీ సహా అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆస్కార్ విజేత కీరవాణి ప్రత్యేకంగా రూపొందించిన గీతంతో ప్రారంభమైంది. శ్రేయా ఘోషల్, చిత్ర, మంగ్లీ, లిప్సిక ఆలపించారు. ఆ తరువాత ఈ ఏడాది శతజయంతి జరుపుకొంటున్న- గురుదత్, భానుమతి, సలీల్ చౌదరీ ల స్టాంపులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రధాని ఆవిష్కరించారు. భానుమతి మనమరాలు మీనాక్షి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కమల్‌హాసన్ నుంచి స్ఫూర్తిపొందా
-చిరంజీవి



అమితాబ్ బచ్చన్, మిథున్ చక్రవర్తి, కమల్ హాసన్ వంటి నటుల నుంచి తాను స్ఫూర్తి పొందానని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. గురువారం ముంబైలో జరిగిన వేవ్స్ కార్యక్రమం సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మోహన్‌లాల్, హేమమాలినితో కలిసి పాల్గొన్నారు. దీనిని బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నిర్వహించారు. "నేను సినిమా రంగంలోకి వచ్చే సరికి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు వంటి అనేక మంది నటులు అగ్రస్థానాల్లో ఉన్నారు. 'నేను వాళ్లంతటి స్టార్‌ని అవుతానా?' అని అనుకుంటూ ఉండేవాడిని, వాళ్లను చూసి భయపడటం కన్నా- నేను వాళ్ల కన్నా అదనంగా ప్రేక్షకులకు ఏం అందించగలను?' అని ఆలోచించేవాడిని. 1977లో నేను ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్నప్పుడు మిథున్ చక్రవర్తి నటించిన 'మృగయా' సినిమా విడుదలయింది. అందులో ఆయనకు ఎటువంటి మేకప్ లేదు. చాలా సహజమైన పాత్ర అది. ఆ సినిమా నాపై ప్రభావం చూపించింది. ఆ తర్వాత నేను ఎక్కువ మేకప్ వేసుకోవటం మానేశాను. మన చుట్టూ పక్కల ఉండే యువకుడిలా కనిపించాలనుకొనేవాడిని. అమితాబ్ బచ్చన్ వల్ల కూడా నేను స్ఫూర్తి పొందాను. ఆ సమయంలో ఫైట్స్ చిత్రీకరణలో డూప్‌లను పెట్టుకొనేవారు. కానీ షోలే సినిమా చూసిన తర్వాత - ఎంత కష్టమయినా నా ఫైట్స్ నేనే స్వయంగా చేయాలని నిర్ణయించుకున్నా. ఇక డ్యాన్స్ విషయానికి వస్తే- కమల్‌హాసన్ నా కన్నా కొద్దిగా సీనియర్. తనలా డ్యాన్స్ చేయాలని అనుకొనేవాడిని. ఇతరుల నుంచి స్ఫూర్తి పొందటం.. కష్టపడి పనిచేయటం.. కొత్తగా చేయాలనే తపనతోనే నా ప్రస్థానం సాగింది" అన్నారు.

కోట్ల కథలు మనకున్నాయి
రాజమౌళి



వినోద రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా ఎదిగే సామర్థ్యం మన దేశానికి ఉందని దర్శకుడు రాజమౌళి అభిప్రాయపడ్డారు. "మన దగ్గర కొన్ని కోట్ల కథలు ఉన్నాయి. వేల కళారూపాలు ఉన్నాయి. సంస్కృతి వైభవానికి సంబంధించిన విషయంలో ప్రపంచంలో ఏ దేశం మనతో పోటీ పడలేదు. అయినా అంతర్జాతీయంగా మనం అమెరికా, చైనా, ఉత్తర కొరియా, వంటి దేశాలతో పోటీ పడలేకపోతున్నాం. మన శక్తిపై నాకు ఎటువంటి అనుమానం లేదు. మనకు ఒక లాంచ్ ప్యాడ్ కావాలి. అది వేవ్స్ రూపంలో మనకు లభించింది" అని పేర్కొన్నారు.

చిరంజీవి ప్రభావం నాపై చాలా ఉంది
అల్లు అర్జున్



"'వేవ్స్' నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. చిన్నప్పటినుంచి నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. సినీ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు అధిగమించాను. నాకు సినిమా తప్ప మరో ప్రపంచం లేదు. ఎంతోమంది ఆదరాభిమాణాలతో ఈ స్థాయికి చేరుకున్నా. సాధించాల్సింది ఇంకా చాలా ఉంది" అని అల్లు అర్జున్ అన్నారు. వేవ్స్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "చిరంజీవిగారే నాకు స్ఫూర్తి. ఆయన ప్రభావం నాపై చాలా ఉంది. అట్లీతో నేను చేస్తున్న చిత్రం ఎంతో ప్రత్యేకంగా ఉండబోతోంది. ఆయన చెప్పిన కథ అద్భుతంగా ఉంది. భారీ హంగులతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచబోతోంది" అని తెలిపారు.

నిర్మాతగా ఈ సక్సెస్ నాకు ప్రత్యేకం
నాని



'నేనూ ప్రేక్షకుల్లో ఒకణ్ణే అని నమ్మిన ప్రతిసారీ మీరు మంచి విజయాలను అందించారు. 'హిట్ 3' అద్భుత విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ సినిమా పెద్ద హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. ఇది తెలుగు సినిమా విజయం. ఒక నిర్మాతగా కూడా ఈ సక్సెస్ నాకు చాలా ప్రత్యేకం. ఈ విజయం శైలేష్ విజన్‌కి టీజర్, ట్రైలర్ లాంటిది మాత్రమే. అతను మున్ముందు మరిన్ని గొప్ప సినిమాలు చేయగలడు' అని నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'హిట్ 3' చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంచి టాక్‌తో కొనసాగుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ "హిట్ 3', సినిమాకు వచ్చిన స్పందన చాలా ఆనందాన్నిచ్చింది. నాని గారి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను. యూనిట్ కష్టం వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సూపర్ హిట్ లేకుండానే వేసవి సీజన్ ముగుస్తుందేమో అనుకున్నాను. ఇప్పుడు 'హిట్ 3' విజయంతో తెలుగు సినీ పరిశ్రమ మళ్లీ ఊపిరి తీసుకుంది' అని చెప్పారు.

ప్రేక్షకులను మెప్పించే కథతో



'దక్ష, మిస్టరీ, ఎందరో మహానుభావులు' లాంటి చిత్రాలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు తల్లాడ సాయికృష్ణ. ఆయన దర్శకత్వంలో మరో చిత్రం తెరకెక్కుతోంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ ప్రకటించింది. తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ 'నిత్యజీవితంలో తారసిల్లే జీవితాల్ని, వాటి తాలూకు భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తుందీ సినిమా. ప్రేక్షకులు కోరుకుంటున్న అంశాలతో కథను సిద్ధం చేసేందుకు చాలా సమయం పట్టింది. అగ్రతారలతో ఈ సినిమా ఉండబోతోంది' అని చెప్పారు.

ఈసారి దేత్తడి



రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలతో హీరోగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు ఆశిష్. ఆదిత్యరావు గంగసాని దర్శకత్వంలో ఆయన హీరోగా ఓ చిత్రం (ఎస్‌వీసీ 60-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రుతమ్ స్టోరీ ల్యాబ్‌తో కలసి దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. గురువారం ఆశిష్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. 'దేత్తడి' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. హైదరాబాద్ నేపథ్యంలో కథ సాగుతుంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో డప్పు వాద్యకారుడి గెటప్‌లో ఆశిష్ కనిపించారు.


అప్పులు తీర్చడానికే నటుడినయ్యా
అజిత్‌కుమార్



తమిళ హీరో అజిత్‌కుమార్ ఇటీవలే న్యూఢిల్లీలో పద్మభూషణ్ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. సినిమాల్లోకి యాక్టర్‌గా రావడం వెనుకున్న పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "అసలు నాకు సినిమాల్లోకి రావాలనే ఉద్దేశం ఏనాడూ లేదు. అనుకోకుండా యాక్టర్ అయ్యా. మొదట్లో నా నటన ఘోరంగా ఉండేది. కెరీర్ తొలినాళ్లలో నేను చేసిన సినిమాలకు వేరేవారు డబ్బింగ్ చెప్పేవారు. ఆ తర్వాత కఠోర సాధనతో నన్ను నేను చాలా మెరుగుపరుచుకున్నా. ఇప్పటికీ కొందరు మిమిక్రీ ఆర్టిస్టులు మొదట్లో నేను చేసిన పేలవ నటన ఆధారంగా విమిక్రీ చేస్తుంటారు. నిజానికి నాకు రేసర్ కావాలనే ఆశ ఉండేది. రేసింగ్ కోసం డబ్బులు సమకూర్చుకునే పనిలో మోడలింగ్ అవకాశం వచ్చింది. ఆ క్రమంలోనే సినిమా అవకాశాలూ వచ్చాయి. ఎవరైనా ఏదైనా అడిగితే నిజాయితీగా సమాధానం చెప్పేవాణ్ని. అప్పట్లో ఓ విలేకరి 'మీరు యాక్టింగ్‌ను ఎందుకు ఎంచుకున్నారు' అని అడిగారు. 'వ్యాపారంలో నష్టం వచ్చింది. నాకున్న అప్పులు తీర్చడానికి ఇండస్ట్రీలోకి వచ్చా' అని తడుముకోకుండా చెప్పేశా".

రాజస్థాన్ ఇంటికి..

- ప్లేఆఫ్స్ రేసు నుంచి అవుట్
- 100 రన్స్ తేడాతో చిత్తు
- ముంబైకి వరుసగా ఆరో విజయం



రోహిత్ (53)

సూర్యకుమార్ (48 నాటౌట్)

జైపూర్: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు నుంచి రాజస్థాన్ రాయల్స్ కూడా వెనుదిరిగింది. గుజరాత్‌పై వారెవా.. అనే రీతిలో చెలరేగిన ఈ జట్టు తమ తర్వాతి మ్యాచ్‌లోనే పూర్తిగా చేతులెత్తేసింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లోనూ విఫలమై ముంబై ఇండియన్స్ చేతిలో 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో ఈ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకొంది. అటు తొలి ఐదు మ్యాచుల్లో నాలుగింటిని కోల్పోయిన ముంబై ఇండియన్స్.. ఆ తర్వాత వరుసగా ఆరో విజయాన్ని ఖాతాలో వేసుకోవడం విశేషం. అలాగే 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 2 వికెట్లకు 217 పరుగులు చేసింది. ఓపెనర్లు రికెల్టన్ (61), రోహిత్ (53) అర్ధసెంచరీలు సాధించగా సూర్యకుమార్ (48 నాటౌట్), హార్దిక్ (48 నాటౌట్) వేగం కనబర్చారు. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలో 117 పరుగులకు కుప్పకూలింది. ఆర్చర్ (30) టాప్ స్కోరర్. కర్ణ్, బౌల్ట్‌లకు మూడేసి, బుమ్రాకు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రికెల్టన్ నిలిచాడు.

పేకమేడలా..: తమ చివరి మ్యాచ్‌లో 210 పరుగులను 15.5 ఓవర్లలోనే పూర్తి చేసిన రాజస్థాన్.. ఈసారి 217 పరుగుల ఛేదనలో అతికష్టంగా 100 పరుగులను దాటించి 16.1 పరుగులకే కుప్పకూలింది. కానీ అంతకుముందు ఈ లక్ష్య ఛేదనలో 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ పటిష్ట బౌలింగ్ లైనప్ కలిగిన ముంబైని ఎలా ఎదుర్కొంటాడోనని అంతా ఎదురు చూశారు. కానీ ఎలాంటి అద్భుతాలూ జరుగలేదు. తొలి ఓవర్‌లోనే వైభవ్‌ను పేసర్ చాహర్ డకౌట్‌గా పంపి ఆర్ఆర్‌కు షాకిచ్చాడు. ఇక రెండు సిక్సర్లతో జోరు మీదున్న జైస్వాల్ (13), రాణా (9)లను బౌల్ట్ అవుట్ చేయగా.. ఆ తర్వాత బుమ్రా వరుస బంతుల్లో పరాగ్ (16), హెట్‌మయెర్ (0)ల పనిబట్టాడు. దీంతో ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే రాజస్థాన్ 47/5 స్కోరుతో నిలిచింది. అయినా పవర్‌ప్లేలో జట్టు 62 పరుగులు సాధించడం గమనార్హం. మిగిలిన ఆటగాళ్లను కూడా ముంబై బౌలర్లు చకచకా అవుట్ చేయడంతో 12 ఓవర్లలోనే 91/9 స్కోరుతో నిలిచింది. చివర్లో ఆకాశ్ (4 నాటౌట్)ను అండగా చేసుకుని ఆర్చర్ చెలరేగడంతో కనీసం వంద పరుగులైనా దాటగలిగింది. 17వ ఓవర్ తొలి బంతికి ఆర్చర్‌ను బౌల్ట్ అవుట్ చేయడంతో 23 బాల్స్ ఉండగానే ఆర్ఆర్ ఆట ముగిసింది.

ఓపెనర్ల శతక భాగస్వామ్యం: ముంబై ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన నలుగురు బ్యాటర్లూ చెలరేగారు. రికెల్టన్-రోహిత్ జోడీ కచ్చితమైన షాట్లతో ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. అలాగే చివరి ఐదు ఓవర్లలో సూర్య, హార్దిక్‌ల ప్రతాపంతో 71 పరుగులు రాబట్టింది. రెండో ఓవర్‌లోనే రోహిత్‌ను ఎల్బీగా ప్రకటించినా.. రివ్యూకు వెళ్లి బతికిపోయాడు. పవర్‌ప్లేలో జట్టు 58 పరుగులకు చేరింది. అయితే ప్రమాదకరంగా మారిన ఓపెనింగ్ జోడీని వరుస ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లు పెవిలియన్‌కు చేర్చారు. 12వ ఓవర్‌లో రికెల్టన్‌ను తీక్షణ బౌల్డ్ చేయగా.. అర్ధసెంచరీ పూర్తి చేసిన రోహిత్‌ను పరాగ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత బాధ్యతను సూర్యకుమార్, హార్దిక్ తీసుకోవడంతో ఆర్ఆర్ బౌలర్లకు ఫలితం దక్కలేదు. ఆర్చర్ కాస్త కట్టడి చేసినా ఆఖరి ఓవర్‌లో మరో 13 పరుగులతో స్కోరు 210+ దాటగలిగింది. ఈ జోడీ మధ్య మూడో వికెట్‌కు అజేయంగా 94 పరుగులు జత చేరాయి.

1. ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో టాప్ నలుగురు బ్యాటర్లు 45+ రన్స్ సాధించడం ఇదే తొలిసారి.
2. టీ20ల్లో ఒకే జట్టు తరపున ఎక్కువ పరుగులు (ముంబై, 6024) చేసిన రెండో బ్యాటర్‌గా రోహిత్. విరాట్ (ఆర్‌సీబీ, 8871) టాప్‌లో ఉన్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ముంబై	11	7	4	0	14	1.274
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ప్రతీ సిక్సర్‌తో ఆరు గృహాలకు విద్యుత్

ముంబైతో మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు పూర్తి గులాబీ రంగు జెర్సీలతో ఆడింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు మద్దతుగా ఆర్ఆర్ 'పింక్ ప్రామిస్' క్యాంపెయిన్ నిర్వహిస్తుండగా.. దీంట్లో భాగంగానే జట్టంతా పూర్తి పింక్‌లోకి మారింది. అలాగే రాజస్థాన్‌లో మహిళల ఆధ్వర్యంలో నడిచే గ్రామాల అభివృద్ధికి ప్రతీ టిక్కెట్ ధర నుంచి రూ.100లను విరాళంగా ఇవ్వనుంది. అంతేకాకుండా మ్యాచ్‌లో నమోదయ్యే ఒక్కో సిక్సర్‌కు ఆరు ఇళ్లచొప్పున సంభార్ ప్రాంతంలోని సౌరశక్తితో కరెంట్‌ను అందివ్వబోతున్నట్టు రాజస్థాన్ రాయల్స్ ఫౌండేషన్ పేర్కొంది.

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (బి) తీక్షణ 61; రోహిత్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 53; సూర్యకుమార్ (నాటౌట్) 48; హార్దిక్ (నాటౌట్) 48; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 217/2. వికెట్ల పతనం:** 1-116, 2-123; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-42-0; ఫరూఖి 4-0-54-0; తీక్షణ 4-047-1; కార్తికేయ 2-0-22-0; ఆకాశ్ 4-0-39-0; పరాగ్ 2-0-12-1.

రాజస్థాన్: జైస్వాల్ (బి) బౌల్ట్ 13, వైభవ్ సూర్యవంశీ (సి) జాక్స్ (బి) చాహర్ 0, రాణా (సి) తిలక్ (బి) బౌల్ట్ 9, పరాగ్ (సి) రోహిత్ (బి) బుమ్రా 16, జురెల్ (సి) అండ్ (బి) కర్ణ్ శర్మ 11, హెట్‌మయెర్ (సి) సూర్య (బి) బుమ్రా 0, శుభమ్ దూబే (సి) బౌల్ట్ (బి) హార్దిక్ 15, ఆర్చర్ (సి) బుమ్రా (బి) బౌల్ట్ 30, తీక్షణ (సి) సూర్య (బి) కర్ణ్ శర్మ 2, కార్తికేయ (సి) చాహర్ (బి) కర్ణ్ శర్మ 2, ఆకాశ్ మధ్వాల్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు 15, మొత్తం: 16.1 ఓవర్లలో 117 ఆలౌట్; వికెట్లపతనం:** 1-1, 2-18, 3-41, 4-47, 5-47, 6-64, 7-76, 8-87, 9-91, 10-117; **బౌలింగ్:** దీపక్ చాహర్ 2-0-13-1, బౌల్ట్ 2.1-0-28-3, బుమ్రా 4-0-15-2, బాష్ 3-0-29-0, హార్దిక్ పాండ్యా 1-0-2-1, కర్ణ్ శర్మ 4-0-23-3.

లిఫ్టింగ్‌లో రెండు కాంస్యాలు



జోష్న సాహు

లిమా (పెరూ): యూత్, ప్రపంచ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్లు మరో రెండు కాంస్యాలు సాధించారు. గురువారం యూత్ బాలికల 40 కి. విభాగంలో జోష్నా సబర్ మొత్తం 129 కేజీలు (56కి.+72కి.) ఎత్తి కాంస్య పతకం నెగ్గింది. బుధవారం..క్లీన్ అండ్ జెర్క్‌లో ఆమె రజత పతకం అందుకుంది. ఇక యూత్ బాలుర 49 కి. కేటగిరీలో హర్షవర్ధన్ సాహు మొత్తం 197 కి. (87కి.+110కి.) ఎత్తి కాంస్యం దక్కించుకున్నాడు. క్లీన్ అండ్ జెర్క్‌లోనూ సాహు కాంస్యం గెలుపొందాడు.

శ్రేయా‌స్‌కు రూ. 12 లక్షల జరిమానా

చెన్నయ్: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నయ్ సూపర్ కింగ్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ నిర్ణీత సమయానికి ఓవర్లను పూర్తి చేయకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు.

భారత్‌కు ఓదార్పు విజయం

- ఇంగ్లండ్‌పై 3-2తో గెలుపు
- సుదీర్మన్ కప్

గ్జియామెన్ (చైనా): సుదీర్మన్ కప్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో నాకౌట్‌కు చేరడంలో విఫలమైన భారత్‌కు ఓదార్పు విజయం లభించింది. గ్రూప్-డిలో భాగంగా గురువారం జరిగిన ఆఖరి పోరులో 3-2తో ఇంగ్లండ్‌పై గెలుపొందింది. సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ, సతీష్ కరుణాకరన్, డబుల్స్‌లో తనీషా/శ్రుతి మిశ్రా తమ మ్యాచ్‌ల్లో నెగ్గారు. గ్రూప్ తొలి రెండు మ్యాచ్‌ల్లో డెన్మార్క్, ఇండోనేసియా చేతిలో ఓడడంతో భారత్ నాకౌట్ అవకాశాలు గల్లంతయ్యాయి.

లార్డ్స్‌లో ఫైనల్



మహిళల టీ20 వరల్డ్‌కప్ వేదికలను ఖరారు చేసిన ఐసీసీ

దుబాయ్: వచ్చే ఏడాది జరిగే మహిళల టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌కు ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ మైదానాన్ని వేదికగా ఐసీసీ ఖరారు చేసింది. 12 జట్ల పోటీ కప్ 2026, జూన్ 12న ఆరంభం కానుండగా.. జూలై 5న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. టోర్నీలో 7 వేదికల్లో మొత్తం 33 మ్యాచ్‌లు జరుగుతాయి. లార్డ్స్‌తోపాటు ఓల్డ్ ట్రాఫర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇప్పటిదాకా 10 జట్లతో జరిగిన ఈ టోర్నీలో ఈసారి మరో 2 టీమ్‌లు అదనంగా చేరుతాయి. పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ త్వరలో విడుదల చేయనుంది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ సహా ఎనిమిది జట్లు ఈపాటికే అర్హత సాధించగా.. మిగిలిన నాలుగు బెర్తులను టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ ద్వారా నిర్ణయిస్తారు.

నేటి మ్యాచ్

వేదిక అహ్మదాబాద్

గుజరాత్ x హైదరాబాద్ రా.7.30 నుంచి



సాత్విక్ జంటకు 'ఖేల్‌రత్న' ప్రదానం

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ ఎట్టకేలకు మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకొంది. గురువారం కేంద్ర క్రీడామంత్రి మన్సుఖ్ మాండవీయ..ఈ అవార్డును ప్రదానం చేశారు. 2023లో ప్రదర్శనకు గాను గతేడాది సాత్విక్ జంటను ఖేల్‌రత్నకు ఎంపిక చేశారు. గత ఫిబ్రవరిలో అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని షెడ్యూల్ చేయగా.. ఇందు కోసం వెళ్తున్న సమయంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథం గుండెపోటుతో మరణించడంతో వాయిదా పడింది.

ఆఖరి రోజు 4 స్వర్ణాలు

రెండో స్థానంలో భారత్ :ఆసియా బాక్సింగ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 చాంపియన్‌షిప్‌లో ఆఖరిరోజు గురువారం భారత బాక్సర్లు నాలుగు స్వర్ణాలు కొల్లగొట్టారు. దాంతో మొత్తం 43 పతకాల (15 స్వర్ణ, 6 రజత, 22 కాంస్య)తో భారత్ పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్ అగ్రస్థానం దక్కించుకుంది. అండర్-17 బాలికల విభాగంలో ఖుషీ చంద్ (46కి.), అహానా శర్మ (50కి.), జానత్ (54కి.), అన్షిక (80+) పసిడి పతకాలతో, సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హర్షిక (63కి.), రజత పతకాలతో టోర్నీని ముగించారు. ఇక..బాలుర అండర్-17 కేటగిరీలో దేవాన్ష్ (80కి.) రజత పతకం అందుకున్నాడు.

విఘ్నేష్ స్థానంలో రఘు శర్మ



రఘు

ముంబై: ముంబై ఇండియన్స్ లెఫ్టామ్ స్పిన్నర్ విఘ్నేష్ పుతుర్ గాయంతో ఐపీఎల్‌కు దూరమయ్యాడు. తాజా సీజన్‌లోనే అరంగేట్రం చేసిన తను ఐదు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు తీశాడు. అతడి స్థానంలో జట్టు 32 ఏళ్ల పంజాబ్ లెగ్ స్పిన్నర్ రఘు శర్మను ఎంపిక చేసుకుంది. 11 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అతడు 57 వికెట్లు తీశాడు. అలాగే గత విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ తరపున పేసర్ అర్షదీప్ తర్వాత 14 వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ పేస్ బౌలర్ సందీప్ శర్మ కూడా రాబోయే అన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. గుజరాత్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో సందీప్ చేతి వేలికి గాయమైంది. వైద్య పరీక్షల్లో దాన్ని ఫ్రాక్చర్‌గా నిర్ధారించారు.

బిజినెస్

జీఎస్‌టీ వసూళ్లలో సరికొత్త రికార్డు



ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లకు చేరిక ● వార్షిక ప్రాతిపదికన 12.6 శాతం వృద్ధి

జీఎస్‌టీ చరిత్రలో నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటడం ఇది రెండో సారి

న్యూఢిల్లీ: ఏప్రిల్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు పెరిగాయి. 2024 ఏప్రిల్‌లో నమోదైన రూ.2.10 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే 12.6 శాతం వృద్ధి నమోదైంది. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు జోరందుకోవడంతోపాటు వ్యాపారుల ఆర్థిక సంవత్సరాంతర సర్దుబాట్లు ఇందుకు దోహదపడ్డాయి. ఎందుకంటే, వ్యాపారులు మార్చి నెల ఆర్థిక లావాదేవీలపై జీఎస్‌టీని ఏప్రిల్‌లో చెల్లిస్తారు. 2017 జూలై నుంచి జీఎస్‌టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి నెలవారీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇది రెండోసారి. వసూళ్లలో రెండో అత్యధిక రికార్డుతో పాటు గతంలో రూ.2 లక్షల కోట్లకు పైగా వసూళ్లు కూడా క్రితం ఏడాది ఏప్రిల్‌లోనే నమోదు కావడం గమనార్హం. కాగా, ఈ మార్చిలో వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లుగా ఉంది.

ఆర్థిక జోరుకు సంకేతం: కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.7 శాతం పెరిగి రూ.1.90 లక్షల కోట్లకు చేరాయి. వస్తు దిగుమతులపై పన్ను రాబడి 20.8 శాతం వృద్ధి చెంది రూ.46,913 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం రూ.27,341 కోట్ల పన్నును రిఫండ్ చేసింది. ఈ రిఫండ్ సర్దుబాటు అనంతరం జీఎస్‌టీ నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా ఉన్నాయి.ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే జీఎస్‌టీ నికర ఆదాయం రూ.2 లక్షల కోట్లు దాటడం ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరుకు సంకేతమని డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మణి అన్నారు.

జీఎస్‌టీ ఆదాయ తాజా గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకత, సహకార సమాఖ్యవాద ప్రభావానికి నిదర్శనం. వసూళ్లు రికార్డు స్థాయికి చేర్చటంలో పాలు పంచుకున్న పన్ను చెల్లింపుదారులకు కృతజ్ఞతలు. పన్ను వసూళ్ల వృద్ధిలో కేంద్ర, రాష్ట్ర జీఎస్‌టీ అధికారుల పాత్ర ఎంతో ఉంది.
-నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

1.5 కోట్లు దాటిన జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి నాటికి జీఎస్‌టీ నెట్‌వర్క్‌లోని రిజిస్టర్డ్ వ్యాపారుల సంఖ్య 1.5 కోట్లు దాటింది. అందులో 25 లక్షల మంది 2024-25లో రిజిస్టర్ చేసుకున్నారు. కాగా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడులో 10 లక్షల చొప్పున జీఎస్‌టీ రిజిస్టర్డ్ వ్యాపారులున్నారు.

కాగ్నిజెంట్‌లో 25,000 మంది ఫ్రెషర్ల హైరింగ్



న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రాంగణ నియామకాల ద్వారా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ఫ్రెషర్లకు ఉద్యోగాలివ్వనున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ వెల్లడించారు. బలమైన మానవ వనరుల వ్యవస్థ నిర్మాణంతో పాటు గడిచిన రెండేళ్లలో పెరిగిన మేనేజ్డ్ సర్వీసెస్ ప్రాజెక్టులు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్‌కు మద్దతుగా ఫ్రెషర్ల నియామకాలను పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఫ్రెషర్ల నియామకాలతో పాటు ఏఐ ద్వారా ఉత్పాదకత పెంపు, మానవ వనరులను మరింత మెరుగ్గా వినియోగించుకోవడంపై దృష్టి సారించిందన్నారు. ఈ మార్చి 31 నాటికి కాగ్నిజెంట్‌లో మొత్తం 3,36,300 మంది ఉద్యోగులున్నారు. అందులో 85 శాతానికి పైగా కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లో పనిచేస్తున్నారు.

త్రైమాసిక ఆదాయం 510 కోట్ల డాలర్లు: మార్చితో ముగిసిన త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.45 శాతం పెరిగి 510 కోట్ల డాలర్లకు చేరింది. ఈ ఏడాది మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 2.6-5.1 శాతం నుంచి 3.9-6.4 శాతానికి పెంచింది. 2025లో మొత్తం 2050-2,100 కోట్ల డాలర్ల రాబడి నమోదు కావచ్చని సంస్థ అంచనా వేసింది.

ఇక 15 సెకన్లలోనే యూపీఐ చెల్లింపులు

జూన్ 16 నుంచి అమలు

న్యూఢిల్లీ: డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే యూపీఐ చెల్లింపుల ప్రక్రియ మరింత త్వరితం కానుంది. ప్రస్తుతం ఒక్కో యూపీఐ చెల్లింపు లావాదేవీ పూర్తయ్యేందుకు 30 సెకన్లు పడుతోంది. వచ్చే నెల 16 నుంచి ఇది 15 సెకన్లకు తగ్గనుంది. దీనికి సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గురువారం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తమ వ్యవస్థలను సిద్ధం (అప్‌డేట్) చేసుకోవాలని బ్యాంకులు, పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఎన్‌పీసీఐ ఆదేశించింది. మరోవైపు చెల్లింపులు, బదిలీలు, బ్యాలెన్స్ చెక్, పిన్ మార్పు వంటి ఏపీఐ రెస్పాన్స్ టైమ్‌ను బ్యాంకులు, పేమెంట్ యాప్స్ ఇక నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి. లేకపోతే చర్యలు తప్పవని ఎన్‌పీసీఐ హెచ్చరించింది.

పెంచిన ఏటీఎం చార్జీలు అమలు షురూ

ఏటీఎం చార్జీల పెంపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు గురువారం నుంచి అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం ఒక నెలలో ఉచితంగా విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన పరిమితి దాటితే చేసే ఒక్కో లావాదేవీపై బ్యాంకులు రూ.23 చార్జీ చేయనున్నాయి. గతంలో ఈ చార్జీ రూ.21 ఉండేది. ఒక్కో లావాదేవీపై రూ.2 పెంచుకునేందుకు బ్యాంకులను అనుమతిస్తూ మార్చి 28న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేసింది. కస్టమర్ల ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంలలో ఉచిత లావాదేవీల (ఆర్థిక, ఆర్థికేతర) పరిమితి మెట్రో నగరాల్లో అయితే నెలకి మూడు కాగా నాన్ మెట్రో నగరాల్లో అయితే ఐదుగా ఉంది.

వచ్చే దశాబ్దిలో రూ.8.5 లక్షల కోట్లు

మీడియా, వినోద రంగంపై అంబానీ అంచనా



ముంబై: దేశంలో మీడియా, వినోద రంగం వచ్చే దశాబ్ది కాలంలో మూడు రెట్లు పెరిగి 10 వేల కోట్ల డాలర్లకు (రూ.8.5 లక్షల కోట్లు) చేరవచ్చని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ అన్నారు. ప్రస్తుతం ఈ రంగం పరిమాణం 2800 కోట్ల డాలర్లుగా (రూ.2.38 లక్షల కోట్లు) ఉంది. దేశంలో అతిపెద్ద మీడియా సంస్థ నెట్‌వర్క్ 18 అధిపతి కూడా అయిన అంబానీ ముంబైలో గురువారం ప్రారంభమైన వేవ్స్ 2025 సదస్సులో మాట్లాడుతూ.. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి లక్షల్లో ఉద్యోగావకాశాలు కల్పించగల సామర్థ్యం ఉన్నదని అన్నారు. వీటి అనుకూల ప్రభావం ఇతర రంగాలపై కూడా ఉంటుందని తెలిపారు. కథలు వినిపించడం, డిజిటల్ టెక్నాలజీ విభాగాలు రెండింటిలోనూ భారత్‌కు కీలక స్థానం ఉన్నదని, ఇవి వ్యూహాత్మకంగా కీలకమైనవని చెప్పారు. ఏఐ, ఇమ్మెర్సివ్ టెక్నాలజీలు కథలు చెప్పడాన్ని మరింత సజీవం చేస్తాయని, అన్ని భాషల ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తాయని అంబానీ అన్నారు. ఈ సాధనాలు వినియోగించుకోవడం ద్వారా భారత్‌కు చెందిన అత్యంత ప్రతిభావంతులైన యువ క్రియేటర్లు ప్రపంచ వినోద రంగానికి బ్లాక్‌బస్టర్లు అందించవచ్చని సూచించారు. తీవ్ర అస్థిరతలు, కల్లోలాలతో కూడిన ప్రస్తుత ప్రపంచంలో మన కథలు భవిష్యత్తుకు ఆశాజ్యోతిగా నిలుస్తాయని, అవి అందరినీ ఐక్యం చేసి స్ఫూర్తిని, చైతన్యాన్ని నింపుతాయని ఆయన అన్నారు. ఐదు వేల సంవత్సరాల నాగరిక వైభవం గల మన దేశం ప్రపంచానికి రామాయణ, మహాభారతాలను, అద్భుతమైన జానపద గేయాలను అందించిందని అంబానీ చెప్పారు.

- రెమెడియం లైఫ్‌కేర్ రైట్ ఇష్యూ ద్వారా రూ.49.19 కోట్లు సమీకరించను న్నట్లు ప్రకటించింది. ఈ ఇష్యూ ఈ నెల 14న ముగియనుంది. కంపెనీ ఈ మధ్యనే యూకేకు చెందిన ఫార్మా కంపెనీ నుంచి రూ.182.70 కోట్లు సమీకరించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.
- బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్, యాక్సిస్ ఎనర్జీకి చెందిన జాయింట్ వెంచర్ సంస్థ ఎవ్రెన్‌లో 10 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రైవేట్ క్లైమెట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అల్టెర్రా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌ల్లో 11 గిగావాట్ల సామర్థ్యం గల సౌర, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల అభివృద్ధికి ఈ పెట్టుబడులు దోహదపడతాయని ఎవ్రెన్ తెలిపింది.
- బోయింగ్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 2024-25 నాలుగో ఎడిషన్ విజేతలను ప్రకటించింది. విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఎర్లీ స్టేజ్ స్టార్టప్‌ల నుంచి ఏడుగురు విజేతలను ఎంపిక చేసింది. ఇందులో ట్రస్ట్ వర్క్స్ డైనెటిక్స్, నెక్సస్ పవర్, ఎక్స్‌ట్రైవ్ ఇన్నోవేషన్, ఉన్నాయి.
- బయోలాజికల్స్ విభాగంలో నవకల్పనలను ఆవిష్కరించటం ద్వారా భవిష్యత్ ఆహార భద్రతతో పాటు రైతులు త్వరితగతిన భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు అవకాశం లభిస్తుందని సింజెంటా ఇండియా ఎండీ సుశీల్ కుమార్ అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ రంగం అందరికీ అనువైనదిగా మార్చేందుకు బహుళ వ్యూహాలను ఆవిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	460
వరంగల్	437	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	97
కర్నూలు	125	నెల్లూరు	102
విశాఖపట్నం	126	అనంతపురం	102
గోదావరి	127		

సవాళ్లున్నా ఆటో ముందుకే

రెండు, మూడు స్థానాల్లోకి మహీంద్రా, టాటా

న్యూఢిల్లీ: తీవ్ర సవాళ్లతో కూడిన వాతావరణంలో కూడా ఆటో రంగం అమ్మకాలను పెంచుకుంది. ఏప్రిల్ నెలలో మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కార్ల అమ్మకాలు పెరిగాయి. అయితే టాటా మోటార్స్, హ్యుండయ్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన తగ్గాయి. దీంతో ఇంతకాలం రెండో స్థానంలో ఉంటూ వచ్చిన హ్యుండయ్ మోటార్స్ ఆ స్థానాన్ని కోల్పోగా మహీంద్రాకు కోల్పోగా మూడో స్థానంలో టాటా మోటార్స్ నిలిచింది. కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా మొత్తం అమ్మకాలు ఏప్రిల్ నెలలో ఏడు శాతం పెరిగి 1,79,791కి చేరాయి. గత ఏడాది ఏప్రిల్‌లో కంపెనీ 1,68,089 కార్లను విక్రయించింది. కాగా దేశీయ విక్రయాలు మాత్రం ఒక శాతం పెరిగి 1,37,952 నుంచి 1,38,704కి చేరాయి. ఎగుమతులు 22,160 యూనిట్ల నుంచి 27,911 యూనిట్లకు పెరిగాయి.

కంపెనీ	విక్రయాలు ఏప్రిల్ 2025	ఏప్రిల్ 2024	వృద్ధి (%)
మహీంద్రా అండ్ మహీంద్రా	84,170	----	19
టాటా మోటార్స్	45,199	47,883	-6
హ్యుండయ్ మోటార్స్	50,201	44,374	-12
కియా ఇండియా	23,623	19,968	18
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్	5,829	4,725	23
హోండా కార్స్	3,360	4,351	-23
ద్విచక్ర వాహనాలు			
సుజుకీ మోటార్ సైకిల్	1,12,948	99,377	14
టీవీఎస్ మోటార్	4,43,896	3,83,615	16
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6

మార్కెట్లో మోసాలను అడ్డుకునే సత్తా మాకుంది

సెబీ చైర్మన్ పాండే

ముంబై: స్టాక్ మార్కెట్లో జరిగే మోసాలు, కుట్రలను అడ్డుకునే సత్తా తమకు ఉందని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదన్నారు. మోసగాళ్ల ఆటకట్టించేందుకు ఇప్పటికే అవసరమైన నియంత్రణలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా ఈ నియంత్రణలు పనిచేయడం లేదనే అభిప్రాయంతో ఉంటే, వారు వెంటనే ఆ అభిప్రాయం నుంచి బయటికి రావాలని పాండే కోరారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,730 ▼	87,750 ▼	1,07,000 ▼
విజయవాడ	96,200 ▼	90,000 ▼	96,000 ▼
విశాఖపట్నం	95,820 ▼	87,750 ▼	1,07,000 ▼
రాజమండ్రి	95,730 ▼	87,750 ▼	96,500 ▼
ప్రొద్దుటూరు	95,700 ▼	88,040 ▼	96,800 ▼
ముంబై	94,360 ▼	86,440 ▼	94,110 ▼

రాష్ట్రంలో 5,414 కోట్ల భారీ ప్రాజెక్టులు

- 5న ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గడ్కరీ: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రూ.5,413 కోట్ల భారీ వ్యయంతో రహదారుల అభివృద్ధి పనులను మే 5న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నట్లు కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో 3,694 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన 123 కి.మీ. పొడవైన రహదారిని ప్రారంభిస్తారని, రూ.168.47 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 8.1 కి.మీ. పొడవైన రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. అలాగే 895.64 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 22.57 కి.మీ. పొడవైన రహదారిని ప్రారంభిస్తారని, రూ.657.27 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 20.87 కి.మీ. రోడ్డు నిర్మాణ పనులకు హైదరాబాద్‌లో శంకుస్థాపన చేస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

ప్రభుత్వంతో చర్చలకు సిద్ధం: ఆర్టీసీ జేఏసీ

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చలకు ఎప్పుడు పిలిచినా వస్తామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. తమ సమ్మె డిమాండ్లలో 90 శాతం ఆర్థిక అంశాలులేనివే ఉన్నాయన్నారు. అధికారులు సీఎంకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, తాము వాస్తవాలను ప్రభుత్వ పెద్దలకు చెప్పుకునే అవకాశం కల్పించాలని సీఎంను కోరారు. గతంలో స్వయంగా ముఖ్యమంత్రే ఆర్టీసీలో సంఘాలు ఉండాలని, కార్మికులకు సమస్యలు ఎదురైతే సామరస్యంగా ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుకుని పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారని ఆయన తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కో చైర్మన్ కె.హనుమంతు ముదిరాజ్ పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ల పేరుతో యథేచ్ఛగా నిర్మాణాలు

- జీవో 111 పరిధిలో అక్రమ కట్టడాలు..హైకోర్టులో పిల్

జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిధిలో 10 కిలోమీటర్ల వరకు ఉన్న బయో కన్జర్వేషన్ జోన్‌లో మళ్లీ యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదు చేస్తూ హైకోర్టులో మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన రైతు ఎం.మాధవరెడ్డి దీనిని దాఖలు చేశారు. కొత్తగా కన్వెన్షన్ సెంటర్ల పేరుతో నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆనంద కన్వెన్షన్, నియో కన్వెన్షన్, ఆర్యా కన్వెన్షన్, కేఎల్ఎన్ ఉత్సవ్, కే కన్వెన్షన్ సెంటర్ల నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు అందజేసినప్పటికీ ప్రభుత్వ సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌కు రెగ్యులర్ నెంబర్ ఇవ్వాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ, ప్రైవేటు ప్రతివాదులందరికీ వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ జూన్ నెలకు వాయిదాపడింది.

పిఆర్సీ నివేదిక బహిర్గతపరచండి:కొమరయ్య

పీఆర్సీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ఉప ముఖ్యమంత్రిని కోరారు. గురువారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను కలిసిన ఆయన ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న దానికంటే మెరుగైన ఫిట్మెంట్‌తో పిఆర్‌సీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు ఎంతో కాలంగా పెండింగ్ బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే విద్యారంగ సమస్యలపై సానుకూల నిర్ణయాలను తీసుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ కొమురయ్య తెలిపారు.

బీఆర్ఎస్ గెలిచిన చోట కాంగ్రెస్ కార్యకర్తలకు ఇబ్బందులు:మధుయాష్కీ

రంగారెడ్డి అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ గెలిచిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం నేత మధుయాష్కీగౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, వారు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సీఎం రేవంత్ కులగణన చేపట్టారని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను కేంద్రం దేశమంతా అమలు చేస్తోందని ఆయన అన్నారు. కష్టపడిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలా? లేదా ఇంకా ఏవైనా పదవులు ఇవ్వాలా? అనే విషయం త్వరలోనే తేలుతుందని మధుయాష్కీగౌడ్ తెలిపారు.

12న అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభ

పంజాగుట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) 50 వసంతాల పరిపూర్తి స్ఫూర్తి సభను ఈనెల 12న నిర్వహిస్తున్నామని ఏసీఎఫ్ తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రచయిత ఏకే ప్రభాకర్, ఎనిశెట్టి శంకర్, సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులతో కలిసి అరుణోదయ 50 వసంతాల పరిపూర్తి స్ఫూర్తి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1974, మే 12న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చొరవతో అరుణోదయ ఏర్పడిందని తెలిపారు. ఈ 50 ఏళ్లలో ఎన్నో ఒడిదొడుకులు, ఆటుపోట్లను ఎదుర్కొందని అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్.వీ.కే) డాక్టర్ కె.ముత్యం స్మారక హాలులో నిర్వహించే స్ఫూర్తి సభలో సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, చెన్నైకి చెందిన రచయిత్రి మీనా కంద స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

ముస్లింలను బీసీలుగా చూపి, తీవ్ర అన్యాయం!

- రేవంత్ సర్కారు కులగణన అశాస్త్రీయం
- తెలంగాణ రోల్‌మోడల్ అనడం విడ్డూరం
- బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కె.లక్ష్మణ్

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్ సర్కారు చేసిన కులగణన అశాస్త్రీయమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. 12 శాతం ముస్లింలలో 10 శాతం మందిని ఓబీసీలుగా చూపి, బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అంబేడ్కర్ సిఫారసు చేసిన బీసీ కమిషన్‌ను కాంగ్రెస్ గతంలో పార్లమెంట్‌లో చర్చకు తీసుకురాలేదన్నారు. నెహ్రూ నుంచి రాజీవ్ వరకు కాంగ్రెస్ నేతలంతా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమేనని లక్ష్మణ్ తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చివరిసారిగా 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులగణన చేసిందని, 94 ఏళ్ల తర్వాత మోదీ మళ్లీ ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కులగణన విషయంలో తెలంగాణ రోల్ మోడల్ అంటూ రాహుల్, రేవంత్ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తొలిసారిగా ఎన్డీయే ప్రభుత్వం బిహార్‌లో కులగణన చేపట్టిందని, ఆ నివేదికను అసెంబ్లీలో చట్టరూపం దాల్చేలా చేసిందని లక్ష్మణ్ చెప్పారు. తెలంగాణలో ఇటీవల చేసిన కులగణన వివరాలను ఇంతవరకూ ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 51 శాతం బీసీలున్నారని గతంలో పేర్కొనగా.. కాంగ్రెస్ కులగణనలో 46 శాతంగా చూపించి బీసీలకు ద్రోహం చేసిందని ఆరోపించారు. కులాల ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తే దేశం ముక్కలవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతిభ దెబ్బతింటుందని అప్పట్లో నెహ్రూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారని గుర్తుచేశారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్నప్పుడు బీసీల అభ్యున్నతి కోసం మండల్ కమిషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. కానీ, జనతా ప్రభుత్వం పడిపోవడం వల్ల ఆ కమిషన్ మరుగునపడిందన్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసినా మండల్ కమిషన్ ఊసే ఎత్తలేదని విమర్శించారు. 1990లో వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తే, ప్రతిపక్ష నేతగా ఉన్న రాజీవ్ గాంధీ వాటికి వ్యతిరేకంగా మాట్లాడి, ప్రధానిని కుల నాయకుడిగా అభివర్ణించారని లక్ష్మణ్ తెలిపారు. 2010లో యూపీఏ ప్రభుత్వం రూ.5000 కోట్ల ఖర్చుతో ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వే చేపట్టి, వివరాలను బహిర్గతం చేయలేదని విమర్శించారు. భవిష్యత్తులో జనగణనతో పాటే కులగణన కూడా జరుగుతుందని 2018లోనే రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారన్నారు. ఇంత జరుగుతున్నా రాహుల్ ఏనాడూ స్పందించలేదని చెప్పారు.

కులగణనలో..

తెలంగాణ రాంగ్ రోల్ మోడల్

50% ఇళ్లలో కూడా సర్వే చేయలేదు.. మాకు ఏమాత్రం అవసరం లేదు

- రేవంత్ సర్కారుది బీసీ వ్యతిరేక సర్వే
- రాహుల్, రేవంత్‌కు భయపడి కులగణన చేయట్లేదు
- 2026లో జనగణన మొదలయ్యే చాన్స్
- కులగణనకు 'జనగణన చట్టం-1948' సవరణ అవసరం
- వచ్చే సమావేశాల్లో బిల్లు:కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కులగణనలో తెలంగాణ రాంగ్ రోల్ మోడల్ అని, తమకు అవసరం లేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. "రేవంత్ సర్కారుది బీసీ వ్యతిరేక సర్వే. కాంగ్రెస్ కులగణన అసంపూర్తిగా, అశాస్త్రీయంగా జరిగింది. తెలంగాణలో కనీసం 50% ఇళ్లలోనూ సర్వే చేయలేదు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఓ సారి సర్వే చేసి, లోపాలుంటే మరో రెండ్రోజులు సమయం తీసుకుని, ఇష్టారీతిన కులగణన చేశారని ఆరోపించారు. 2010లోనే కులగణనకు అనుకూలమని బీజేపీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పదేళ్లుగా మోదీ కులగణన చేయలేదనే వారు ఒక విషయాన్ని గుర్తుచేసుకోవాలని, జనాభా లెక్కలతోపాటే ఈ సర్వే సాధ్యమవుతుందని, అందుకే ఇంతకాలం ఆగారని వివరించారు. "2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సుష్మాస్వరాజ్ తాము కులగణనకు అనుకూలమని పేర్కొంటూ అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. అప్పటి హోంమంత్రి చిదంబరం కులగణనను వ్యతిరేకించారు" అని వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎప్పటి నుంచో.. జనాభా లెక్కల సమయంలో కులగణన చేస్తామని చెప్పారన్నారు. అప్పట్లో సుష్మా స్వరాజ్ ఇచ్చిన లేఖ ఆధారంగా.. ఇప్పుడు కులగణన నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ నిర్ణయంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మోదీ సర్కారు నిర్ణయాన్ని తమ ఘనతగా రాహుల్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. "రాహుల్, రేవంత్‌కు భయపడి మేం కులగణన చేయడం లేదు. కర్ణాటక, తెలంగాణల్లో జరిపిన కులగణనలో చిత్తశుద్ధి లేదు. శాస్త్రీయ పద్ధతిలో సర్వే జరగలేదు. అసలు అవి కులగణనలే కావు. తెలంగాణలో 50% జనాభాను కూడా చేరుకోకుండా.. మొత్తం సర్వే చేశామనడం హాస్యాస్పదం. బీసీల్లో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే.. నిష్పక్షపాతంగా, శాస్త్రీయపద్ధతుల్లో సర్వే నిర్వహించాలి. మోదీ సర్కారు ఆలోచన ఇదే" అని స్పష్టం చేశారు. మోదీని ప్రశ్నించే ముందు.. దశాబ్దాలుగా దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఎందుకు కులగణన చేయలేదో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల కంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ముందుంటుందని విమర్శించారు. "ఎద్దుల బండి కింద కుక్క.. మొత్తం బండిని తానే మోస్తున్నానని అనుకుంటుంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అలానే ఉంది" అని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్‌లో బీసీలకు అన్యాయం


గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో బీసీలకు 50 సీట్లను రిజర్వ్ చేసిన విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ సీట్లలో 30 చోట్ల ముస్లింలే గెలిచారని, అలాంటప్పుడు బీసీలకు న్యాయం జరిగినట్లు ఎలా అవుతుందని నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏనాడూ బీసీలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. మోదీ ప్రధాని అయ్యాక.. తొలిసారి 2026లో జనగణన జరగనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆలోగా కులగణనకు అనుకూలంగా 'జనగణన చట్టం-1948'ని సవరించాల్సి ఉంటుందన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో సవరణ బిల్లును తీసుకొస్తామని ప్రకటించారు.

బీసీ ప్రధానిని కులం పేరుతో దూషించారు

కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజలను మతం పేరుతో విడగొడుతోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. మత ఘర్షణలు, కులాల పేరుతో సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలపై కపట ప్రేమను చూపుతోందని, అవకాశం చిక్కినప్పుడల్లా విషం కక్కుతోందని అన్నారు. ఎస్సీ కులానికి చెందిన కోవింద్, ఎస్టీ కులానికి చెందిన ముర్మును రాష్ట్రపతి అభ్యర్థులుగా ప్రకటిస్తే, కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. బీసీ అయిన ప్రధాని మోదీని కులం పేరుతో దూషించిన నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదంటూ మండిపడ్డారు. దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న మాదిగ రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించామన్నారు. 2018లో జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించామని, 2019లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల కోసం 10 శాతం రిజర్వేషన్లు(ఈడబ్ల్యూఎస్) అమల్లోకి తీసుకొచ్చామని గుర్తుచేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీదేనని చెప్పారు. 'ట్రిపుల్ తలాక్' వంటి అనాగరికమైన విధానాలను రద్దు చేశామన్నారు.

మిస్ వరల్డ్ అతిథుల హెరిటేజ్ వాక్‌కు భారీ బందోబస్తు

- 13న చార్మినార్‌ను సందర్శించనున్న సుందరీమణులు, విదేశీ ప్రతినిధులు



హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మిస్ వరల్డ్ పోటీదారులు, విదేశీ ప్రతినిధులు మే 13న చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు చేపట్టనున్న హెరిటేజ్ వాక్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో చార్మినార్ లాడ్‌బజార్, మోతీగల్లి, చౌమహల్లా ప్యాలెస్ వరకు రోడ్డుకు ఇరువైపులా సాయుధ బలగాలు, పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మేరతో కూడిన అధికారుల బృందం గురువారం సాయంత్రం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు ఉన్న ప్రాంతాన్ని సందర్శించింది. అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌లో సమావేశమైన అధికారులు భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులు, వారి వెంట వచ్చే ప్రతినిధులు మే13వ తేదీ సాయంత్రం చార్మినార్‌నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు సందర్శిస్తారు. ఈ కార్యక్రమానికి హెరిటేజ్ వాక్ అని పేరు పెట్టారు. అయితే, హెరిటేజ్ వాక్ జరిగే సమయంలో ఎంపిక చేసిన గాజులు, ముత్యాలు, నగల దుకాణాలు మాత్రమే తెరిచి ఉంచాలని అధికారులు నిర్ణయించారు. ఆయా దుకాణాల యజమానులు, వాటిల్లో పని చేసే కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డులు లేని వారిని హెరిటేజ్ వాక్ సమయంలో లోపలికి అనుమతించరు. అలాగే, హెరిటేజ్ వాక్‌కు ఎంత సమయం అవసరం, షాపింగ్‌కు ఎంత సమాయాన్ని కేటాయించాలి, చౌమహల్లా ప్యాలెస్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు, రాత్రికి వెల్కం డిన్నర్ ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులు సమీక్షించారు.

కులగణన హీరో రాహుల్‌గాంధీ

రాష్ట్రంలో రేవంత్, మూడో హీరో మోదీ.. ప్రధాని నిర్ణయం హర్షణీయం.. క్రెడిట్ రాహుల్‌దే

- రాహుల్‌గాంధీ ముందు చూపునకు కులగణనే నిదర్శనం
- ఆయన బాటలో నడిచి రేవంత్ జాక్‌పాట్
- రేవంత్ కులగణనపై కిషన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్ మాటలను ప్రజలు పట్టించుకోరు
- దేశవ్యాప్త కుల గణనలో మతాల ప్రస్తావన ఉండదని చెప్పాల్సింది కిషన్‌రెడ్డి కాదు
- అదేమైనా గ్రామ పంచాయతీ తీర్మానమా..?
- హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సమస్త కులాల వారు భరత మాత బిడ్డలే కదా..?
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): కులగణనకు దేశంలో హీరో రాహుల్‌గాంధీనే అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. రాష్ట్రంలో హీరో రేవంత్‌రెడ్డి అని, ప్రధాని మోదీది మూడో హీరో పాత్ర అని తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలంటూ ప్రధాని మోదీ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, కానీ ఆ క్రెడిట్ మాత్రం రాహుల్‌గాంధీకే దక్కుతుందని స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో గురువారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా జనగణనలో కులగణన చేపట్టాలంటూ రాహుల్ గాంధీ పదే పదే డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని హామీ కూడా ఇచ్చారని తెలిపారు. రాహుల్ ముందు చూపునకు కులగణన నిదర్శనమన్నారు. కులగణన చేపట్టాలనే కేంద్రం నిర్ణయం పట్ల బీజేపీ నేతలు సంతోషపడినా ఏమీ లాభం లేదన్నారు. ఈ అంశంలో దేశ స్థాయిలో రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో కులగణన నిర్వహించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి హీరోలని తెలిపారు. మోదీ కులగణన చేయకపోతే.. రాహుల్ ప్రధాని కాగానే చేసేవారని చెప్పారు. కులగణన క్రెడిట్ రాహుల్‌గాంధీకి రావడం బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదని, రాహుల్‌కు వచ్చిన ఆలోచన మోదీకి ఎందుకు రాలేదని వారికి నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ కుటుంబం.. బీజేపీ నేతల తరహాలో పదవుల కోసం ఎదురు చూసే కుటుంబం కాదని.. ప్రధాన మంత్రులను చేసే కుటుంబమని తెలిపారు. కులగణన విషయంలో సీఎం రేవంత్ అదృష్టవంతుడని, రాహుల్‌గాంధీ లైన్లో వెళ్లి జాక్ పాట్ కొట్టేశారని అన్నారు. రేవంత్ కులగణనపై కిషన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావు ఏం మాట్లాడినా ప్రజలు పట్టించుకోరని చెప్పారు. కులగణనలో మతాల ప్రస్తావన ఉండదని కిషన్‌రెడ్డి చెబుతున్నారని, అది చెప్పాల్సింది ప్రధాని మోదీ అని అన్నారు. "కిషన్‌రెడ్డికి ఇష్టం లేదని వదిలేస్తారా..? కులగణనపై తీర్మానం చేయాల్సింది కేంద్ర క్యాబినెట్. అదేమైనా గ్రామపంచాయతీ తీర్మానం అనుకుంటున్నారా..? ముస్లింలు ఈ దేశ పౌరులు కాదా..? దేశంలో పుట్టిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారు, సమస్త కులాల వారు భరత మాత బిడ్డలే కదా?" అని జగ్గారెడ్డి అన్నారు. దీనిపై ప్రధాని ఏం చెబుతారో చూసి ఆపై స్పందించవచ్చని తెలిపారు.

ఏఈవోలు, ఏవోల మెడకు బిగుస్తున్న ఉచ్చు!

జిన్నింగ్ మిల్లర్లకు యథేచ్ఛగా ధ్రువపత్రాల పంపిణీ

- ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ పుస్తకాలు పంచుకుని దందా
- రైతులకు తెలియకుండా వారిపేర్ల మీద పత్తి అమ్మకాలు
- భద్రాద్రి-కొత్తగూడెంలో ఏకంగా నకిలీ పుస్తకాల ముద్రణ
- కొత్తగూడెం రైతుల పేరిట సిద్దిపేట జిల్లాలో విక్రయాలు


హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు తెలియకుండా వారి పేర్లపై పత్తి సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటం, ప్రభుత్వం పంపిణీ చేసిన తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) పుస్తకాలను వాటాల వంతున పంచుకోవటం, మరో అడుగు ముందుకేసి నకిలీ టీఆర్ పుస్తకాలు ముద్రించి జిన్నింగ్ మిల్లర్లకు అప్పజెప్పటం, ఒక మండలంలో పనిచేస్తూ మరో మండలానికి చెందిన రైతుల పేరిట ధ్రువపత్రాలు ఇవ్వడం... ఇలా వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవోల లీలలు అన్నీ ఇన్నీ కావు. పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తీగ లాగితే డొంక కదులుతోంది. రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని, కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు భారత పత్తి సంస్థ (సీసీఐ)కు అమ్మి అక్రమార్కులు లాభపడ్డారు. ఇందుకు వ్యవసాయ శాఖ జారీ చేసిన 60 వేల సాగు ధ్రువీకరణ పత్రాలే కారణం కావటం గమనార్హం. ఈ వ్యవహారంలో ఏఈవోలు, ఏవోల మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు చేసిన విస్తీర్ణానికి మించి విక్రయాలు జరిగాయి. పంటల నమోదు పోర్టల్‌లో పేర్లు లేని రైతులు సీసీఐకి పత్తి విక్రయించాలంటే వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) టీఆర్ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ముందుగా సంబంధిత రైతులకు ఎంత భూమి ఉంది? పత్తి వేశారా? లేదా? అని ధ్రువీకరించుకోవాలి. దీనికి భిన్నంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల వ్యవసాయాధికారి జిన్నింగ్ మిల్లర్లతో మిలాఖత్ అయ్యి కొన్ని టీఆర్ పుస్తకాలను వారి చేతిలో పెట్టారు. మరికొన్ని పుస్తకాలను ఏఈవోకు అప్పజెప్పారు. రైతులతో సంబంధం లేకుండా మిల్లర్లు పత్తిని సీసీఐకి విక్రయించుకునేందుకు వీలుగా మూడు మండలాలకు చెందిన రైతుల పేరిట టీఆర్‌లు జారీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే... ఇచ్చోడ ఏవో తన మండల పరిధి దాటి సిరికొండ, గుడిహత్నూర్ మండలాల్లో కూడా టీఆర్‌లు జారీ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఇంద్రవెల్లి మండలంలో కూడా రైతులకు బదులుగా జిన్నింగ్ మిల్లర్ల చేతికే టీఆర్ పత్రాలు ఇచ్చినట్లు తేలింది. అయితే ఇచ్చోడ ఏవో జాదవ్ కైలాష్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి సాయిశంతన్ కుమార్... టీఆర్‌ల జారీకి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఈ వ్యవహారంలో జిన్నింగ్ మాఫియా హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అశ్వాపురం మండలంలో పనిచేసే ఒక ఏఈవో... ప్రభుత్వం పంపిన టీఆర్ పుస్తకాలు కాకుండా, స్థానిక ప్రింటింగ్ ప్రెస్‌లో తానే టీఆర్ పుస్తకాలు ముద్రణ చేయించి, జిన్నింగ్ మిల్లర్లకు సంతకాలు చేసి ఇచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నెల్లిపాక సీసీఐ కొనుగోలు కేంద్రంలో సుమారు రూ.5 కోట్ల విలువైన అక్రమ ట్రేడింగ్ జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచిత్రం ఏమిటంటే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రైతుల పేరుతో సిద్దిపేట జిల్లాలో పత్తి అమ్మకాలు జరిగాయి. కొత్తగూడెం రైతుల పేర్లతో ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో అమ్మకాలు జరిగాయంటే... పొరుగు జిల్లాలే కదా? రైతులు తీసుకెళ్లి అమ్ముకుంటారులే! అనుకోవచ్చు. కానీ కొత్తగూడెం నుంచి 265 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేటకు రైతులు పత్తి తీసుకెళ్లి అమ్ముకున్నట్లు విచారణలో వెలుగుచూసింది. సిద్దిపేటలోని సాయివెంకట కాటన్ జిన్నింగ్ మిల్లులో అశ్వాపురం మండలానికి చెందిన రైతుల పేర్లతో కొనుగోళ్లు చేసినట్లు నకిలీ టీఆర్‌లు సృష్టించారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పెద్దఎత్తున పత్తి అక్రమ కొనుగోళ్లు జరిగిన ఉదంతంపై విచారణాధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన మార్కెటింగ్‌శాఖ అధికారులను విచారించి అక్రమాలు జరిగిన తీరును తెలుసుకుంటున్నారు. మార్కెటింగ్‌శాఖ అధికారులతోపాటు వ్యవసాయాధికారులు, విస్తరణాధికారుల మెడకు అక్రమ కొనుగోళ్ల ఉచ్చు బిగుస్తోంది.

సీఎంవోలో అధికారుల శాఖల మార్పు

- ముఖ్య కార్యదర్శి శేషాద్రికి అదనంగా వ్యవసాయం, పౌరసరఫరాల బాధ్యతలు
- శ్రీనివాసరాజుకు విద్య, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్.. విద్యాశాఖ నుంచి మాణిక్‌రాజ్ ఔట్


హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లో పని చేస్తున్న అధికారుల శాఖల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇటీవల సీఎంవో నుంచి ముగ్గురు అధికారులు బదిలీ కావడం, కొత్తగా సీఎం ముఖ్య కార్యదర్శిగా రిటైర్డ్ ఐఏఎస్ శ్రీనివాసరాజు నియమితులవడంతో ఆయా శాఖలను సర్దుబాటు చేశారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ శేషాద్రికి ఇప్పటికే ఉన్న శాఖలతోపాటు వ్యవసాయం, పౌరసరఫరాలను అదనంగా అప్పగించారు. ఇప్పటిదాకా విద్య(పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్య)తో పాటు మరికొన్ని శాఖల బాధ్యతలను మాణిక్‌రాజ్ పర్యవేక్షిస్తుండగా.. విద్యా శాఖ నుంచి ఆయన్ను తప్పించారు. శ్రీనివాసరాజుకు ఆ శాఖతోపాటు ఆర్ అండ్ బీ, అటవీ, ఎస్సీ-ఎస్టీ-బీసీ-మైనారిటీ సంక్షేమం, హౌసింగ్ వంటి కీలక శాఖలను అప్పగించారు. సీఎం ఓఎస్డీగా ఉన్న వేముల శ్రీనివాసులుకు మహిళాశిశు సంక్షేమం సహా ప్రజావాణి, సీఎంఆర్ఎఫ్ బాధ్యతలు అప్పజెప్పారు.

వి.శేషాద్రి, సీఎం ముఖ్య కార్యదర్శి



సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు, హోం, రెవెన్యూ, న్యాయ, ఆర్థిక, పౌరసరఫరాలు, వ్యవసాయం, శాసనసభ వ్యవహారాల శాఖలు, ప్రణాళిక విభాగం, ఓవరాల్ ఇన్‌చార్జి ఆఫ్ సీఎంవో

శ్రీనివాసరాజు, సీఎం ముఖ్య కార్యదర్శి



విద్య, ఆర్‌అండ్‌బీ, రవాణా, హౌసింగ్, అటవీ, పర్యావరణం, బీసీ-ఎస్సీ-ఎస్టీ-మైనారిటీల సంక్షేమం, దేవాదాయ శాఖలు

కె.మాణిక్‌రాజ్, సీఎం కార్యదర్శి




మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ(కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్), మైన్స్, వైద్యం, విపత్తుల నిర్వహణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి

బి.అజిత్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి



పరిశ్రమలు, విద్యుత్తు, ఐటీ, స్పోర్ట్స్, కార్మిక, యువజన వ్యవహారాల శాఖలు, సీఎం భద్రత, అపాయింట్‌మెంట్లు, సీఎంవో నిర్వహణ

వేముల శ్రీనివాసులు, సీఎం ఓఎస్డీ



మహిళాశిశు సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, టూరిజం శాఖలు, ప్రజావాణి, సీఎంఆర్ఎఫ్, సీఎంవోలో కంప్యూటరీకరణ

కార్మికుల ఐక్యత కోసం కలిసి నడుద్దాం: కేటీఆర్

- సామాజిక తెలంగాణ సాధించలేకపోయాం: కవిత

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల రెక్కల కష్టం జాతి సంపదను సృష్టిస్తోందని, మేడే స్ఫూర్తితో కార్మికుల ఐక్యత, సమానత్వం కోసం కలిసి నడుద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అడుగడుగునా కార్మికులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. సింగరేణి శ్రామికులకు బోనస్‌లు, ఉద్యోగభద్రత, మెరుగైన సౌకర్యాలతో గౌరవించామని, టీజీఆర్టీసీ కార్మికులకు జీతభత్యాల పెంపు, ఆరోగ్యబీమా వంటి సంక్షేమ పథకాలతో భరోసా కల్పించినట్లు తెలిపారు. మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత కల్పించి సాధికారతను పెంచామని గుర్తు చేశారు. కాగా, భౌగోళికంగా తెలంగాణ తెచ్చుకున్నా... సకలజనులు, సబ్బండ వర్గాలకు న్యాయం జరిగే.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మేడే సందర్భంగా తన నివాసంలో సింగరేణి, జీహెచ్ఎంసీ, భవన నిర్మాణ, హమాలీ, ఆటో కార్మికులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి కృషి చేయాలని, సమసమాజ నిర్మాణం దిశగా మరొక తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగిద్దామని ఆమె పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణ భవన్‌లో మేడే ను పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. కాగా, భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు అనే అంశంపై జూన్ 20, 21తేదీల్లో ఇంగ్లాండ్‌లో నిర్వహించే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆక్స్‌ఫర్డ్ ఇండియాఫోరం వ్యవస్థాపకుడు సిద్ధార్థ్‌సేఠీ గురువారం ఆయనకు లేఖ రాశారు.



వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డికి అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్

వాటర్‌బోర్డుకు ఉత్తమ యాజమాన్య అవార్డు

» ఆ సంస్థ ఎండీకి అందజేసిన సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న చర్యలు, మంచి పారిశ్రామిక సంబంధాలకుగానూ రాష్ట్రప్రభుత్వం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా వాటర్‌బోర్డుకు ఉత్తమ యాజమాన్య అవార్డును ప్రకటించింది. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ప్రపంచ కార్మిక దినోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అందుకున్నారు. ప్రభుత్వ విభాగాల్లో వాటర్‌బోర్డుకు మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం. తమ సంస్థలో పనిచేస్తోన్న కార్మికులు పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా వాటర్ బోర్డు చూస్తోంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో వాటర్ బోర్డు డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకోండి

» ఎస్సీ యువతకు మంత్రి దామోదర సూచన

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ఫలాలను ఎస్సీ యువత అందిపుచ్చుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులతో గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును అనుసరించి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయం సామాన్యులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థి నాయకులకు సూచించారు. ఎస్సీ వర్గీకరణను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకున్నప్పుడే... ఫలితం దక్కుతుందన్నారు. త్వరలోనే పలు ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయబోతున్నామని, అభ్యర్థులందరూ ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు.



గోవిందరావుపేటలో వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయండి

» అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

ములుగు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. గురువారం ములుగు జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్క ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటి దఫాలో పేదలకు ప్రాధాన్యమిచ్చి, రెండవ దఫాలో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు ఇంటి నిర్మాణ పనుల పురోగతిని యాప్‌లలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం గోవిందరావుపేటలో వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు. తదనంతరం ములుగులో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. ఈ మేరకు గురువారం పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. 3, 4, 5 తేదీల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పరీక్షలు, 6, 9, 10, 11 తేదీల్లో ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఫ్యూచర్ సిటీ పనులు వేగవంతం చేయండి

» అధికారులకు కమిషనర్ శశాంక ఆదేశాలు

కందుకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీ, స్కిల్ యూనివర్సిటీ పనులను వేగవంతం చేస్తూనే.. భూములు ఇచ్చిన రైతులకు అన్ని హంగులతో అభివృద్ధి చేసిన ప్లాట్లను పంపిణీ చేయాలని ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్ఖాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూలో 600 ఎకరాల్లో చేపట్టిన ప్లాట్ల అభివృద్ధి పనులను టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీర్ఖాన్‌పేటలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏవోసీ-ఇన్-చీఫ్‌గా తేజేందర్ సింగ్



అల్వాల్, మే 1 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళం శిక్షణ కమాండ్ విభాగానికి ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్(ఏవోసీ-ఇన్-సీ)గా ఎయిర్ మార్షల్ తేజేందర్‌సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి పట్టభద్రుడైన ఎయిర్ మార్షల్ తేజేందర్‌సింగ్ 1987 జూన్ 13న భారత వైమానిక దళంలో ఫైటర్ స్ట్రీమ్‌లో నియమితులయ్యారు. కేటగిరీ 'ఏ' అర్హత కలిగిన ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్. ఆయన 4,500 గంటలకుపైగా విమాన ప్రయాణం చేశారు. తన కెరీర్‌లో ఫైటర్ స్క్వాడ్రాన్, రాడార్ స్టేషన్, ప్రీమియర్ ఫైటర్ బేస్‌కు నాయకత్వం వహించారు. జమ్మూకశ్మీర్‌లో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్‌గా విధులు నిర్వర్తించారు.



హైకోర్టులో కొత్త లా చాంబర్స్

హైకోర్టు ఆవరణలో లా చాంబర్స్ బ్లాక్-2 ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ కార్తీక్, జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ కె.సుజన, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి విజారత్ అలీ పాల్గొన్నారు.

రైజింగ్ తెలంగాణను ఎవరూ ఆపలేరు

(మొదటిపేజీ తరువాయి)

సమస్యను పరిష్కరించడంలో తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. గురువారం కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన 'మే' డే వేడుకలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీలో మళ్లీ సమ్మె అని చర్చలు చేస్తున్నారని, రాజకీయ నేపథ్యంలో ఎవరైనా సమ్మెకు ప్రోత్సహిస్తే మొత్తం సంస్థే దెబ్బతినే పరిస్థితి ఉంటుందని, సమ్మె పోటు రాష్ట్రానికే నష్టమన్నారు. ఈ సందర్భంగా పంతాలకు, పట్టింపులకు వెళ్లకుండా చర్చిద్దామని, చేయగలిగింది చేస్తామని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్న ప్రభుత్వంలో సమ్మెల పేరుతో, ఇతర కారణాలతో.. తప్పు జరిగితే మళ్లీ పునరుద్ధరించడానికి అవకాశాలు లేవన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యం బాగోలేదని, అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.18,500 కోట్లు ఆదాయం వస్తుందని, వీటిలో రూ.6,500 కోట్లు అప్పులకు చెల్లిస్తున్నామని, రూ.6వేల కోట్లు జీతభత్యాలు, పింఛన్‌లకు ఇస్తున్నామని, ఇవి పోను మిగిలేది రూ.5,500 కోట్లేనని చెప్పారు. ఇందులోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కనీసం నెలకు రూ.22,500 కోట్లు ఉంటే ప్రాథమిక అవసరాలు తీర్చుకోగలుగుతామన్నారు. కానీ రూ.12వేల కోట్ల ఆదాయం తక్కువ ఉందన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, అధికారులను కార్మికుల సంఘాల ముందు కూర్చోపెడతానని.. ఏది ఆపమంటారో, ఏది ఖర్చు చేయమంటారో చెప్పండన్నారు. ఈ విషయంలో ఒక అడ్వైజరీ బోర్డు పెట్టుకుని, సూచనలు చేయాలన్నారు. అణా పైసా కూడా తాను ఇంటికి తీసుకెళ్లడంలేదని, ఒక్క పైసా కూడా అవినీతికి పాల్పడబోనని చెప్పారు. గడిచిన పదేళ్లలో ఒకటో తారీఖున జీతం పడిందా అని ప్రశ్నించారు, కానీ ప్రజాప్రభుత్వంలో మొదటి తేదీనే జీతం ఇస్తున్నామన్నారు.

కేసీఆర్ ఒక్కరే 8లక్షల కోట్ల అప్పులు..

60ఏండ్లు, 16 మంది ముఖ్యమంత్రులు కలిసి రూ.72వేల కోట్లు అప్పులు చేస్తే.. ఒక వ్యక్తి, ఒక పార్టీ, ఒక కుటుంబం పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2023 డిసెంబర్ 7న అధికారం తమకు వచ్చే నాటికి రూ.8.29లక్షల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు. కాళేశ్వరం నిర్మించిన కాంట్రాక్టర్లకు రూ.1.02 లక్షల కోట్ల బిల్లులు చెల్లించారని, కానీ మూడేళ్లలోనే కాళేశ్వరం కట్టడం, కూలడం జరిగిపోయిందన్నారు. రూ.1.02లక్షల కోట్లతో నిర్మించిన (సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ) ప్రాజెక్టులు కుప్పకూలిపోవడం ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. పేదోళ్లు కట్టుకునే గుడిసే కూడా కనీసం పదేళ్లు ఉంటుందన్నారు. రూ.8లక్షల కోట్లు ఎటు వెళ్లాయో కూడా ఆనవాళ్లు దొరకడంలేదన్నారు. 15 నెలల తమ ప్రభుత్వంలో రూ.1,58,000 కోట్ల అప్పులు చేస్తే.. ఇందులో రూ.1,52,000 కోట్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకే చెల్లిస్తున్నామన్నారు. ప్రతీ నెలా సరాసరి రూ.10వేల కోట్లు అప్పులు చేసి కట్టాల్సి వస్తోందన్నారు. గడచిన 15 నెలలు తాను, సహచర మంత్రులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపామని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నామని, అందరి సహకారం ఉండాలన్నారు.



మే డే సందర్భంగా రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు సన్మానం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

> రాష్ట్రంలో పదేళ్లలో ఆర్థిక ఉగ్రవాదం, విధ్వంసం జరిగింది. దేశంలో, రాష్ట్రంలో పేదవాళ్లు మరింత పేదవాళ్లయ్యారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రం టీవీలు, పేపర్లు, ఫామ్ హౌస్‌లు, వ్యాపారాలు, వేల కోట్ల ఆస్తులు వచ్చాయి. తప్పులు చేసి.. మళ్లీ ఇప్పుడు వచ్చి అధికారం ఇవ్వాలని అడుగుతున్నారు. కొత్త ముసుగుతో కపటనాటక సూత్రధారి కేసీఆర్ మళ్లీ బయలుదేరాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
>
> 
>
> - మే డే వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హౌలా మాటలు మాట్లాడుతున్నారు..

పదేళ్లు అధికారంలో ఉన్న వ్యక్తి.. అధికారం కోల్పోవడంతో ఆ బాధ, ఆవేదన మొత్తాన్ని వరంగల్ సభలో చెప్పారని, 40ఏళ్లు అధికారం అనుభవించిన వ్యక్తికి అంత విషం ఉంటుందా అని రేవంత్.. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కడుపునిండా విషమేనని, మరో ఆలోచనే లేదన్నారు. అసెంబ్లీకి ఆయన పంపిన పిల్లలకే సమాధానం చెప్పడం లేదని అంటున్నారని, కానీ ఆయన పంపిన పిల్లలు (కేటీఆర్, హరీశ్) హౌలా మాటలు మాట్లాడుతున్నారని తాను ఎప్పుడో చెప్పానని అన్నారు. దళితుడిని సీఎం చేస్తానని చెయ్యలేదని, కనీసం ప్రతిపక్ష నేతగానైనా చేసి, పాపాలను కొన్నింటినైనా కడుక్కోవాలని కేసీఆర్‌కు సూచించారు.

బీజేపీకి 400 సీట్లు వచ్చుంటే..

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వాళ్లు అనుకున్నట్లుగా 400 సీట్లు వచ్చుంటే ఈ పాటికే రిజర్వేషన్లు రద్దయి ఉండేవని, రాజ్యాంగం రూపు రేకలే మారిపోయేవని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ రోజున కులగణన నిర్ణయమూ జరిగుండేది కాదన్నారు. రేవంత్‌రెడ్డి అమలు చేసిన దాన్ని మోదీ అనుసరిస్తున్నాడని చెప్పి బీజేపీ రాష్ట్ర నాయకులు కొంత అసూయ, దుఃఖంలో ఉన్నారని సీఎం ఎద్దేవా చేశారు. మోదీ ఏం ఆలోచిస్తున్నాడన్నది వారికి తెలియట్లేదని, ఈ పిల్లగాళ్ల మాటలను తాను పట్టించుకోమన్నారు. ఒత్తిడి, అవసరం మేరకు మోదీ ఈ నిర్ణయం తీసుకున్నా.. అంతిమంగా బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నారు.

కులగణనలో దేశానికి మోడల్

రాహుల్ గాంధీ 150 రోజులు 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ అన్ని వర్గాలను కలుస్తూ.. వారి అభిప్రాయాలను సేకరించి.. రాష్ట్రంలో కులగణన చేపట్టాలని సూచించారని అన్నారు. ఆయన సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమైందని, రాష్ట్ర ప్రభుత్వం చట్టం కూడా చేసిందన్నారు. ఇప్పుడు కేంద్రం కూడా జనగణనలో కులగణన చేర్చి తొందర్లోనే ఎవరు ఎంతమంది ఉన్నారనే లెక్కలను తేలుస్తామని ప్రకటించిందన్నారు. దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా కులగణన ప్రక్రియ చేపట్టేందుకు తెలంగాణ మోడల్‌ను పరిశీలించాలంటూ ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ విషయంలో కేంద్రానికి సహకరించేందుకు.. కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులను పంపితే కులగణన సర్వేకు సంబంధించి తమ అనుభవాలను, అభిప్రాయాలను వారితో పంచుకుంటామని చెప్పారు. లేదూ.. తమనే ఢిల్లీకి రమ్మన్నా వెళతామన్నారు. బలహీన వర్గాల ప్రయోజనాల కోసం ఒక మెట్టు దిగే విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలూ లేవని స్పష్టం చేశారు. ఆలస్యంగానైనా .. కులగణన చేపట్టాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఈ ప్రక్రియను నిర్ణీత కాల పరిమితిలో పూర్తి చేయాలని, అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కీలకమన్నారు. ఎప్పటి కల్లా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారో చెప్పాల్సిన బాధ్యత ప్రధాని మోదీపై ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ బీసీ ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నేతలతో కలిసి సీఎం మాట్లాడారు.

రాజ్యహింసకు మా ప్రభుత్వం వ్యతిరేకం

హింసకు తమ ప్రభుత్వం, పార్టీ వ్యతిరేకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హింస.. రాజ్యం చేసినా, సామాన్యుడు చేసినా, సంఘాలు చేసినా దానికి తాము వ్యతిరేకమన్నారు. హింసకు బదులుగా చర్చలు జరగాలన్నారు. ఎంత పెద్ద సమస్యకైనా చర్చలే పరిష్కారం అని విశ్వసించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. అయినా అధికారికంగా తమ అధిష్ఠానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మావోయిస్టుల అంశంలో కేంద్రానికి ఏం సూచిస్తున్నారన్న ప్రశ్నకు ఈ మేరకు స్పందించారు.

తెలంగాణ నంబర్ వన్

రాష్ట్రంలో 8.8 శాతం నుంచి 6.2 శాతానికి నిరుద్యోగ సమస్యను తగ్గించి, దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. సింగరేణి కూడా లాభాల బాటలో నడవడమే కాకుండా.. ప్రజాప్రభుత్వంలో ఔట్ సోర్సింగ్ కార్మికులకూ 5వేల బోనస్ ఇచ్చి వారిని గుర్తించిందన్నారు. విద్యుత్ వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమై, ఉత్తర, దక్షిణ డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కోలు దెబ్బతిని వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయన్నారు. సింగరేణి సంస్థలను లాభాల బాటలోకి నడిపించడంతో పాటు, బొగ్గు ఉత్పత్తిని పెంచి, భవిష్యత్‌లో కొత్త గనులను తెరవాలని, తద్వారా నూతన ఉపాధి అవకాశాలను కల్పించాలని ప్రయత్నిస్తున్నామన్నారు.

కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై సీఎం సమీక్ష

» పాల్వంచ, మరో 6 ఎయిర్‌పోర్టుల ఏర్పాటు

» వివరాలను ఆరా తీసిన సీఎం

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సమీక్షించారు. వరంగల్ మామునూరు విమానాశ్రయానికి కేంద్రం అనుమతినిచ్చిన నేపథ్యంలో.. అక్కడ నిర్మించే ఎయిర్‌పోర్టు నమూనా, ఇతర అంశాలపై చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలో ఒకటి, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో కలిపి 6 విమానాశ్రయాల ఏర్పాటు అంశంలో పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఒక్కో విమానాశ్రయానికి సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించినట్లు తెలిసింది. మామునూరు విమానాశ్రయం నిర్మాణం కోసం నమూనాలను పరిశీలించాలన్న సీఎం ఆదేశాల మేరకు.. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవల కేరళలోని కొచ్చి ఎయిర్‌పోర్టుకు వెళ్లి అధ్యయనం చేశారు. ఆ విమానాశ్రయం నిర్మాణం, విమానాల రాకపోకలు, ప్రయాణికుల సంఖ్య, ఏటేటా వృద్ధిరేటు తదితర అంశాలను సమీక్షలో సీఎంకు వివరించారు. మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి ప్రస్తుత పరిస్థితి, చేపట్టాల్సిన చర్యల వివరాలను వెల్లడించారు. కాగా, పాల్వంచ ఎయిర్‌పోర్టుకు సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం (ఫీజిబులిటీ స్టడీ) జరుగుతుండగా, మిగతా విమానాశ్రయాల కోసం భూముల కేటాయింపు, ఇతర అంశాలపై ఆర్ అండ్ బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీఎంకు వివరించినట్టు సమాచారం. ఈ సమీక్షలో జీఎంఆర్ గ్రూపు కీలక ప్రతినిధులు కూడా పాల్గొన్నట్టు తెలిసింది.

స్లాట్ బుకింగ్ విధానంతో సత్ఫలితాలు

» 12 నుంచి మరో 25 రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అమలు

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

» జూన్ 3 నుంచి రాష్ట్రమంతా అమలుకు ఆదేశాలు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తెచ్చిన స్లాట్ బుకింగ్ విధానం మంచి ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ నెల 12 నుంచి మరో 25 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామని వెల్లడించారు. ఏప్రిల్ 10న రాష్ట్రంలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామని, ఏప్రిల్ 30 నాటికి ఈ విధానంలో 866 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. సచివాలయంలో గురువారం రిజిస్ట్రేషన్ శాఖపై మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రెండో దశలో రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి.. జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, గజ్వేల్, సిద్దిపేట అర్బన్, రూరల్, రంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ సౌత్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌పై ప్రజల స్పందన ఎలా ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు మంత్రికి తెలిపారు. పోస్టు కార్డులో ఉన్న ఫోన్ నంబరు ద్వారా చంపాపేటలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విష్ణుగౌడ్‌తో మంత్రి మాట్లాడారు. ఇంటర్నెట్ వేగాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని అధికారులకు సూచించారు. జూన్ 3 నాటికి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తేవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి ఆధార్-ఈ సంతకం విధానాన్ని త్వరగా అమల్లోకి తేవాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు.

ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది.. నిధులకు ఇబ్బంది రాదు

మీ ప్రాంతానికి కావాల్సిన నిధులెన్ని?.. స్థానికంగా ఉన్న ఇబ్బందులేమిటి?

» 'మహబూబ్‌నగర్' పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్

» స్థానిక ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

» ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి ముఖాముఖి ప్రారంభం

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకోసం అవసరమైనన్ని నిధులు విడుదల చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పార్టీ ఎమ్మెల్యేల కష్టనష్టాలు, అవసరమైన నిధులు, నియోజకవర్గాల్లో సమస్యలను తెలుసుకునేందుకు వారితో ముఖాముఖి కార్యక్రమాన్ని సీఎం గురువారం ప్రారంభించారు. మొదటగా మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కమాండ్ కంట్రోల్‌లో భేటీ అయ్యారు.

ఇచ్చిన హామీ మేరకు ముఖాముఖిగా..

విదేశీ పర్యటన నుంచి వచ్చాక నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలను కలుస్తానని.. జపాన్ పర్యటనకు వెళ్లే ముందు సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను సిద్ధం చేసుకుని ఉండాలని కూడా సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీలను రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, శంకరయ్య, అనిరుధ్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. వారి నియోజకవర్గాల్లోని అభివృద్ధి కార్యక్రమాల వివరాలు, ఏయే పనులను తక్షణమే పూర్తి చేస్తే ప్రజల్లో అసంతృప్తి తగ్గుతుందన్న అంశాలను ఆరా తీశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, మరో ఆరు నెలల్లో ఇంకా మెరుగవుతుందని.. నిధుల మంజూరుకు ఇబ్బంది రాబోదని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, కష్టపడి పనిచేయాలని సూచించారు. ఆయా ఎమ్మెల్యేలకు నియోజకవర్గంలో రాజకీయంగా ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారి పట్ల వ్యతిరేకత ఉన్న అంశాలేమిటి, వాటిని ఎలా సరి చేసుకోవాలన్నదీ వివరించారు. కొందరు నేతలు నియోజకవర్గాల్లో పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని, వారిని నియంత్రణలో పెట్టాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధించాలని, గెలిచే అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను పరిశీలించిన సీఎం.. అత్యవసరమైన వాటిని పూర్తి చేసేందుకు రూ.10 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తామని చెప్పినట్టు సమాచారం. కాగా, ఈ ఆరుగురు ఎమ్మెల్యేలకు సీఎం సుమారు 3 గంటల సమయం ఇచ్చి మాట్లాడారు. ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను అధికారులు దగ్గరుండి నమోదు చేసుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించి, వివరాలను తనకు తెలపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

జనగణనలో భాగంగా కులగణన కూడా చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో.. శుక్రవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమావేశంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ ఢిల్లీకి వెళుతున్నారు. తెలంగాణలో రేవంత్ సర్కారు నిర్వహించిన కులగణన సర్వే దేశానికే ఆదర్శమని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ బీసీ నేతలు కలసి అభినందించారు. అందులో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మధుయాష్కీ గౌడ్‌తోపాటు పార్టీ బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు ఉన్నారు.

4 మండలాల్లో భూభారతి విజయవంతం

» 5 నుంచి 28 మండలాల్లో అమలు: పొంగులేటి



హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి చట్టాన్ని విజయవంతంగా అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణ్‌పేట్ జిల్లా మద్దూరు మండలం, ములుగు జిల్లా వెంకటాపురం, కామారెడ్డి జిల్లా లింగంపేట, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలాల్లో 72 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. ప్రతి దరఖాస్తుదారుకు రశీదు అందించినట్లు తెలిపారు. నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో గురువారం ఆయన సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా పట్టాదారు పాస్‌పుస్తకం కావాలని కోరుతూ 3,446, సాదా బైనామాలకు సంబంధించి 2,796 దరఖాస్తులు వచ్చాయన్నారు. వెంకటాపురంలో 3,969, లింగంపేటలో 3,702, నేలకొండపల్లిలో 2,618, మద్దూరులో 1341 దరఖాస్తులు వచ్చాయన్నారు. నాలుగు మండలాల నుంచి మొత్తం 11,630దరఖాస్తులను అధికారులు స్వీకరించారని తెలిపారు. వీటన్నింటిని నిశితంగా పరిశీలించి జూన్ 2 నాటికి పరిష్కరిస్తామన్నారు. మరోవైపు.. హైదరాబాద్ మినహా 605మండలాలకు గాను 555 మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు 20 జిల్లాల పరిధిలో నిర్వహించిన 45సమావేశాల్లో స్వయంగా తాను పాల్గొని చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు వివరించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 28 జిల్లాల పరిధిలోని 28 మండలాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించామన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో 3.5 కిలోల బంగారం పట్టివేత



హైదరాబాద్, శంషాబాద్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గురువారం రూ.3.45 కోట్ల విలువైన 3.5 కిలోల బంగారు బిస్కట్లు స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ ద్వారా దుబాయి నుంచి వచ్చిన ఒక ప్రయాణికుడు లో దుస్తుల్లో పెట్టుకుని వచ్చిన బంగారం అక్రమ రవాణాకు యత్నించాడు. విమానం దిగగానే విమానాశ్రయంలోని గ్రౌండ్ హ్యాండ్లింగ్ సిబ్బందిలో ఒకరికి బంగారు బిస్కెట్లను అందజేశారు. ఆ ఉద్యోగి మరో మరో ఉద్యోగికి ఇచ్చేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు వారిద్దరితో పాటు ఆ బిస్కట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడితో పాటు అతనికి సహకరించిన ఆ ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఆర్ఐ అధికారులు పేర్కొన్నారు. ఈ బంగారాన్ని ఆ వ్యక్తికి ఎవరు ఇచ్చారు? హైదరాబాద్‌లో ఎవరికి వీటిని డెలివరీ చేయాల్సి ఉందనే విషయాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

రూ.156 కోట్లకు 'యూ-పిక్స్ క్రియేషన్స్' ఐపీ

- తెలుగు రాష్ట్రాల్లో 102 మంది పెట్టుబడిదారులు
- రూ.3 లక్షల నుంచి 10 కోట్ల వరకు చెల్లింపులు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): యానిమేషన్ సర్వీసెస్ పేరిట తెలుగు రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగించిన యూ పిక్స్ క్రియేషన్స్ అండ్ యూ పిక్స్ గ్రూపు యజమాని నిడుమోలు వెంకట సత్యలక్ష్మీ కిరణ్ దాదాపు రూ.156 కోట్లకు ఐపీ పిటిషన్ దాఖలు చేశారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి కోసం రెండు రాష్ట్రాలకు చెందిన 102 మంది వద్ద రూ.3 లక్షల నుంచి రూ. 10 కోట్ల వరకు వసూలు చేశారు. అన్ని ఏజెన్సీలు, వ్యాపారాల్లో నష్టం రావడంతో అప్పులు తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడం, డబ్బుల కోసం పెట్టిబడిదారులు ఒత్తిడి చేస్తుండటంతో ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి కోర్టులో ఐపీ పిటిషన్ దాఖలు చేశారు. వ్యాపార అభివృద్ధికి పెట్టుబడి కోసం సొంత బంగారు ఆభరణాలు, కారు, వెండి విక్రయించినా నష్టాల నుంచి తేరుకోలేదని.. చేపట్టిన ప్రాజెక్టులు సరైన సమయానికి విజయవంతం కాకపోవడంతో ఐపీ పెట్టినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. తన వద్ద ప్రస్తుతం ఆఫీస్ కార్యాలయ ఫర్నీచర్, కంప్యూటర్లు కలుపుకొని రూ.2.72 కోట్ల ఆస్తులు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు.

భూదాన్ భూముల అక్రమాలపై ఈడీ నజర్

- సర్వోదయ మండలి నేత శంకర్ వాంగ్మూలం నమోదు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భూదాన్ భూముల అక్రమ క్రయ విక్రయాలపై ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం సర్వోదయ మండలి అధ్యక్షుడు, సీపీఐ నేత శంకర్‌నాయక్‌ను విచారించారు. సైదాబాద్‌లోని సింగరేణి కాలనీలోని ఇంటికెళ్లి ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. భూదాన్ భూములు చేతులు మారడంలో ఎవరెవరి పాత్ర ఎంత? అన్న వివరాలు వారు అడిగి తెలుసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొనుగోలు చేసిన స్థలాలు, వాటిపై రెవెన్యూశాఖ నుంచి జారీ చేసిన నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) తదితర వివరాలు సేకరించినట్లు సమాచారం. దీంతో భూదాన్ భూముల విషయమై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని తెలుస్తున్నది.

జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ దూకుడు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా మందగించిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో రాష్ట్రం దూకుడు ప్రదర్శించింది. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే గత నెల జీఎస్టీ వసూళ్లలో 12 శాతం వృద్ధిరేటు నమోదైంది. గతేడాది ఏప్రిల్‌లో రూ.6,236 కోట్లు వసూలైతే గత నెలలో రూ.6,983 కోట్ల వసూళ్లు రికార్డయ్యాయి. గతేడాది (2024)తో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెల జీఎస్టీ వసూళ్లలో 12 శాతం వృద్ధిరేటు నమోదైందని కేంద్ర ఆర్థికశాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం చివరి రెండు నెలల్లో రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు దారుణంగా తగ్గిపోయాయి. ఫిబ్రవరిలో ఒకశాతం.. మార్చిలో జీరో వృద్ధి శాతం రికార్డయింది. ఇదిలా ఉంటే, 2024తో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో గత నెలలో జీఎస్టీ వసూళ్లు మైనస్ 3 శాతం వృద్ధి రికార్డయాయి. గతేడాది ఏప్రిల్‌లో రూ.4,850 కోట్లు వసూలైతే, గత నెలలో రూ.4,686 కోట్లు వసూలయ్యాయి.

యాదాద్రి పవర్ ప్లాంట్ సీఈపై బదిలీ వేటు

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో తెలంగాణ జెన్‌కో కళ్లు తెరిచింది. ప్లాంట్ సిద్ధమైనా ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడంపై విమర్శలు వచ్చాయి. దీంతో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) జే సమ్మయ్యను విద్యుత్ సౌధకు బదిలీ చేస్తూ జెన్‌కో సీఎండీ సందీప్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వి.రమేష్‌బాబును చీఫ్ ఇంజనీర్‌గా యాదాద్రికి బదిలీచేశారు. ఎస్ఈగా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసరావును యాదాద్రి ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. 203 మంది అసిస్టెంట్ ఇంజినీర్ /అదనపు అసిస్టెంట్ ఇంజినీర్‌లకు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏడీఈ)గా పదోన్నతులు కల్పించిన సందీప్ సుల్తానియా.. వారిలో సగానికి పైగా యాదాద్రి ప్లాంట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. మరికొందరికి భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తోపాటు కేటీపీఎస్‌లో పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)ల్లో ముగ్గురికి యాదాద్రిలో, మరొకరికి శ్రీశైలంలో, ఇంకొకరికి కేటీపీపీలో పోస్టింగ్ ఇచ్చారు.

నేటి నుంచి ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

- 4 వరకు రోజూ రెండు సెషన్లలో నిర్వహణ
- 2,20,371 మంది కోసం 124 పరీక్ష కేంద్రాలు
- నిమిషం లేటైనా పరీక్ష కేంద్రంలోకి నో ఎంట్రీ

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం వరకు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సెషన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతి సెషన్‌కు 90 నిమిషాల ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం లేటైనా లోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ పరీక్షల కోసం 124 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 2,20,371 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మే 15లోగా ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ఫలితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచే దాకా పోరాటం: జాజుల

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): కులగణన ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. జన గణనతో పాటు కుల గణన చేపట్టినంత మాత్రాన బీసీలకు రిజర్వేషన్లు దక్కవని, అందుకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్నారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీనివాస్‌గౌడ్.. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని అఖిలపక్ష పార్టీలు, బీసీ ఉద్యమ నేతలను తీసుకుని ప్రధాని మోదీని కలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. కుల గణన నిర్ణయంతో తాము పాక్షిక విజయం సాధించామని.. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచినపుడే బీసీ ఉద్యమానికి సంపూర్ణ విజయం సాధించినట్లు అవుతుందన్నారు. కులగణన ఉద్యమానికి విజయ సంకేతంగా ఈ నెల 6న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

రాజ్‌భవన్‌లో గుజరాత్, మహారాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



రాజ్‌భవన్‌లో జరిగిన మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

జాతి ప్రగతిలో ఆ 2 రాష్ట్రాలు కీలకం:గవర్నర్

హైదరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, గుజరాత్ ప్రజలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. జాతి ఆర్థిక ప్రగతిలో ఈ రెండు రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ ఆర్థిక రాజధానిగా మహారాష్ట్ర నిలిస్తే, దేశానికి గుజరాత్ పటిష్టమైన నాయకత్వం అందించిందని చెప్పారు. దేశ సమగ్రతను పెంపొందిస్తూ జాతీయ భావ వ్యాప్తికి ఏక్ భారత్ - శ్రేష్ట భారత్ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఆ రెండు రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణ, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవరత్ పంపిన వీడియో సందేశాలను ప్రదర్శించారు.

నేడు గవర్నర్‌తో కాంగ్రెస్ బీసీ నేతల భేటీ

రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపినందుకుగాను ధన్యవాదాలు చెప్పేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బీసీ మంత్రులు, నాయకులు శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలవనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను రాష్ట్రమంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు పార్టీ నేతలు కలిసి ధన్యవాదాలు తెలుపుతారని కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు తెలిపారు.

అమరావతి 2.0కు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. ప్రధాన వేదికపై పరిమితంగా 14 మంది వీఐపీలు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలి వస్తున్నారు. వారి కోసం 8 వేల బస్సులు ఏర్పాటు చేశారు. రాజధాని చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాలకే మొత్తం 6,600 బస్సులు కేటాయించారు.

మంత్రుల బృందం పర్యవేక్షణ

ప్రధాని సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రుల బృందం నిరంతరాయంగా పర్యవేక్షిస్తోంది. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వెల్లడించింది. పర్యవేక్షణకు నియమితులైన పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్‌తో కూడిన మంత్రుల బృందం గురువారం సభావేదిక ప్రాంగణంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లను సమీక్షించింది. అనంతరం ప్రధాన సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని పర్యటనకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలి రానున్నారని, వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. ప్రతి బస్సుకు ఒక ప్రభుత్వ అధికారిని ఇన్‌చార్జిగా పెట్టడంతో పాటు 25 బస్సులకు ఒక ప్రత్యేక ఇన్‌చార్జి అధికారిని నియమించినట్టు చెప్పారు. ఎక్కడా ఆటంకాలు కలగకుండా సభాస్థలికి చేర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. బస్సులు బయలుదేరే సమయంలోనే అల్పాహారం, తాగునీరు ఇవ్వడంతో పాటు దారి మధ్యలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పార్కింగ్ ప్రాంతాల్లో కూడా భోజన వసతి కల్పించామని, సభానంతరం తిరిగి గమ్యస్థానాలకు బయలుదేరే ముందు రాత్రి భోజనం కూడా అందిస్తామని అన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాల ప్రజలు సుమారు 34 వేల ఎకరాలను ఇచ్చారని, వారందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికే సీఎం ఆదేశాల మేరకు రాజధాని రైతులకు ఆహ్వానాలను అందించామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని కార్యక్రమానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో అద్భుతమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి అమరావతి రాజధానిని నాశనం చేసిందన్నారు. తిరిగి అమరావతి పనులను ప్రారంభించుకోవడం రాష్ట్రమంతా గర్వించదగ్గ పరిణామమన్నారు.

57,962 కోట్ల ప్రాజెక్టులు

- రాజధాని అమరావతిలో రూ.49,040 కోట్ల వ్యయంతో 74 ప్రాజెక్టుల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు భవనాలతో పాటు ఇతర ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తారు.
- రాజధాని పనులతో పాటు మరో రూ.8 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 1,459 కోట్లతో కృష్ణా జిల్లా నాగాయలంకలో డీఆర్‌డీవో చేపట్టే క్షిపణి ప్రయోగ కేంద్రానికి, రూ.100 కోట్లతో విశాఖలో డీపీఐఐటీ చేపట్టే యూనిటీ మాల్‌కు, రూ.293 కోట్లతో గుంతకల్లు వెస్ట్-మల్లప్ప గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, 3,176 కోట్లతో ఎన్‌హెచ్ఏఐ చేపట్టే 6 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు.
- రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ప్రారంభిస్తారు.
- రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ట్రిప్లింగ్, డబ్లింగ్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు.

మోదీ పర్యటన షెడ్యూల్ ఇదీ

- ప్రధాని మోదీ శుక్రవారం మధ్యాహ్నం తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రధానికి మంత్రులు, కూటమి నేతలు స్వాగతం పలుకుతారు.
- గన్నవరం విమానాశ్రయం నుంచి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్ద ప్రధానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్వాగతం పలుకుతారు.
- మధ్యాహ్నం 3.20 గంటలకు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో సభావేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అమరావతి పనుల పునఃప్రారంభోత్సవాన్ని సూచించేలా ఏ ఆకారంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ప్రధాని ఆవిష్కరిస్తారు. ప్రధాన వేదికపై 14 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస భూపతివర్మ, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నారాయణ ఇతర వీఐపీలు కూర్చుంటారు.

రెండున్నర గంటల పాటు మోదీ పర్యటన

ప్రధాని మోదీ పర్యటనను పురస్కరించుకుని అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక విమానంలో శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి రానున్న మోదీ.. రాజధాని అమరావతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం 5.20కి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు. మొత్తంగా మోదీ రెండున్నర గంటలు రాష్ట్ర పర్యటనలో ఉంటారు.

గ్రూప్-1 తెలుగులో రాసిన వారికి మార్కులెలా కేటాయించారు?

- టీజీపీఎస్సీని ప్రశ్నించిన హైకోర్టు
- ఆయా సబ్జెక్టు నిపుణులే మూల్యాంకనం చేసి, మార్కులు కేటాయించారన్న టీజీపీఎస్సీ

హైదరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న పిటిషన్లపై హైకోర్టులో గురువారం కూడా విచారణ కొనసాగింది. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్ నంబర్లు, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేర్వేరుగా ఉంటాయన్న విషయాన్ని నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని గుర్తుచేశారు. మెయిన్స్‌లో హాల్‌టికెట్ నంబర్లు మారడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారని తెలిపారు. అలాగే మెయిన్స్ రాసిన అభ్యర్థుల సంఖ్యను కూడా ఒక్కోసారి ఒక్కోరకంగా ప్రకటించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సెంటర్ల కేటాయింపుల్లోనూ తప్పులు జరిగాయని, కొన్ని సెంటర్లలో పరీక్షలు రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. మళ్లీ మూల్యాంకనం చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోరారు. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చెప్పిందే చెప్పి, కోర్టు సమయం వృథా చేస్తున్నారన్నారు. పిటిషనర్లు అపోహ పడుతున్నారని, నిపుణుల పర్యవేక్షణలోనే మూల్యాంకనం జరిగిందని తెలిపారు. తెలుగులో పరీక్ష రాసిన వారికి మార్కులు ఎలా కేటాయించారని ధర్మాసనం ప్రశ్నించగా.. ఆయా సబ్జెక్టుల నిపుణులే మూల్యాంకనం చేసి, మార్కులు కేటాయించారని చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. కాగా, బుధవారం జరిగిన విచారణలో జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు స్పందిస్తూ.. తమిళనాడులో ప్రజలకు అన్ని భాషలూ వచ్చినా, మాతృభాష అయిన తమిళంలోనే మాట్లాడతారని చెప్పారు. మన దగ్గర మాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారన్నారు. ఇది తన స్వీయ అనుభవం కూడా అని తెలిపారు.

వారికి ఎస్సీ హోదా వర్తించదు

- క్రైస్తవంలోకి మారగానే దానిని కోల్పోతారు
- ఎస్సీ, ఎస్టీ యాక్టు రక్షణను పొందలేరు
- ఫిర్యాదుదారు పాస్టరు..ఆయన ఫిర్యాదు చెల్లదు
- స్పష్టం చేసిన హైకోర్టు



అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) క్రైస్తవంలోకి మారిన తక్షణమే ఆ హోదా కోల్పోతారని, వారు ఎస్సీఎస్టీ చట్టంలోని నిబంధనల కింద రక్షణ పొందలేరని హైకోర్టు స్పష్టం చేసింది. క్రైస్తవ మతానికి కుల వ్యవస్థ దూరమని పేర్కొంది. గుంటూరు జిల్లాకు సంబంధించిన కేసులో చర్చి పాస్టర్‌గా సేవలు అందిస్తున్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పిటిషనర్లపై పోలీసులు ఎస్సీఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టింది. ఎస్సీ ఎస్టీలపై దాడులను నిరోధించేందుకు, వారికి రక్షణ కల్పించేందుకు ఎస్సీఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేసింది. ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారు క్రైస్తవ మతంలోకి మారి గత పదేళ్లుగా తాను పాస్టర్‌గా సేవలు అందిస్తున్నట్లు స్వయంగా పేర్కొన్నారని గుర్తు చేసింది. అధికారులు కులధ్రువీకరణపత్రం ఇచ్చారనే కారణం చూపి మతం మారిన ఫిర్యాదుదారు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని జస్టిస్ హరినాథ్ ధర్మసనం ఇటీవల ఇచ్చిన తీర్పులో పేర్కొంది.

గాలివానతో అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



ఖమ్మం జిల్లా వైరా ఏఎంసీలో తడిసి ముద్దయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

నేలవాలగా.. తోటల్లో మామిడి కాయలు రాలి రైతాంగానికి తీవ్ర నష్టం చేకూరింది. భూపాలపల్లి జిల్లాలో కాటారం, మలహర్, రేగొండ, గణపురం మండలాల్లో ఈదురుగాలులు కల్లోలాన్ని సృష్టించాయి. వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. చేలల్లో ధాన్యం రాలిపోయింది. పలుచోట్ల విద్యుత్తు తీగలు తెగిపడడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. మలహర్ మండలం తాడిచర్లలో పలు రేకుల ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గంట పాటు ఈదురుగాలులతో వాన కురిసింది. భూపాలపల్లి-హనుమకొండ ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షం కారణంగా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ములుగు జిల్లాలో ఈదురుగాలుల బీభత్సానికి చాలాచోట్ల విద్యుత్తు స్తంభాలు విరిగిపడి కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. ములుగుతో పాటు పలు గ్రామాల ప్రజలు రాత్రంతా అంధకారంలో గడపాల్సి వచ్చింది. గోవిందరావుపేట మండలంలోని చల్లాయిలో సుమారు 200 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో వైరా, కామేపల్లి, సింగరేణి, సత్తుపల్లి, మధిర, పెనుబల్లి, తల్లాడ, కల్లూరు ప్రాంతాల్లో గాలివాన పడింది. పలుచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. బలమైన గాలులు వీయడంతో కోతకు వచ్చిన మామిడికాయలు నేల రాలడంతో ఉద్యాన రైతులకు నష్టం జరిగింది.

తీవ్రంగానే ఎండలు..

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. అన్ని జిల్లాల్లో 41 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో 44.8 డిగ్రీలు, అదే జిల్లా గొల్లపల్లిలో 44.7, బుగ్గారంలో 44.6, ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో 42.1, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 42 డిగ్రీల చొప్పున రికార్డయింది. పెద్దపల్లి జిల్లా మంథని మునిసిపాలిటీ పరిధిలోని గంగాపురిలో వడదెబ్బ కారణంగా హమాలీ కూలీ పులి మణి (55) మృతి చెందాడు.

వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోండి: ఎన్‌హెచ్‌ఆర్సీ

ఎండల తీవ్రత, వడగాడ్పుల నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) సూచించింది. 2018 నుంచి 2022 మధ్య వేడిగాలులు, వడదెబ్బ వల్ల 3,798 మంది మృతి చెందిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఎన్‌హెచ్‌ఆర్సీ లేఖలు రాసింది. బలహీన వర్గాలు, కార్మికులు, వృద్ధులు, పిల్లలు, నిరాశ్రయుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. కార్మిక కాలనీల్లో ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని, పని గంటలను సవరించాలని, నీడ ప్రాంతాల్లో విశ్రాంతి తీసుకునేలా చూడాలని తెలిపింది. వేడిగాలుల నుంచి ప్రజలను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యలపై నివేదిక అందించాలని ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది.

పాక్ నుంచి తిరిగొచ్చిన బెజవాడ కోడలు!

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఈ క్రమంలో మోనికా రజని వద్ద ఎన్‌వోఆర్ఐ సర్టిఫికెట్, దీర్ఘకాలిక వీసా ఉండటంతో తన కుమార్తె సైమరా(5)తో పాటు పాకిస్థాన్ నుంచి బయలుదేరి గురువారం అటారీ సరిహద్దుకు చేరుకున్నారు. మోనికా రజని తొమ్మిదేళ్ల క్రితం విజయవాడకు చెందిన పవన్‌ను వివాహం చేసుకున్నారు. వీరి కుటుంబం స్థానిక గురునానక్ కాలనీలో నివసిస్తోంది. భర్త ఆటోనగర్‌లో రబ్బర్ ఇండస్ట్రీ నిర్వహిస్తుంటారు. మోనికా రజని భారత్‌కు తిరిగి వస్తుండటంతో ఆమె భర్త, కుటుంబీకులు అంతా అమృత్‌సర్ వెళ్లారు. అటారీ సరిహద్దు వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు (ఐసీపీ) వద్దకు చేరుకున్నానని, ఇక్కడ కస్టమ్స్, ఇమిగ్రేషన్ క్లియరెన్స్ కోసం దాదాపు 3గంటలు పట్టిందని తెలిపారు. విజయవాడకు వెళ్లేముందు తాను, కుటుంబ సభ్యులు స్వర్ణ దేవాలయాన్ని సందర్శిస్తామని పేర్కొన్నారు. తాను కూడా పాకిస్థాన్‌లో హిందూ కుటుంబంలోనే జన్మించానని, తమది పెద్దలు కుదిర్చిన వివాహమని వివరించారు. వారి కుటుంబం విజయవాడ వస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

భారత యువతికి.. పాక్ పౌరసత్వం

కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని సనత్‌నగర్‌కు చెందిన మహిళ పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నారు. అక్కడే కొంత కాలం ఉన్న తర్వాత భర్తతో విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని తిరిగి తన స్వస్థలానికి తిరిగొచ్చారు. అనంతరం వేరే వ్యక్తిని వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నారు. పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఆమె దీర్ఘకాలిక వీసాపై ఇక్కడ ఉంటున్నారు. ఆమె ఇక్కడ ఉండేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని పోలీసు వర్గాలు నిర్ధారించాయి. ఆమెకు సంబంధించిన పత్రాలు అన్నీ సమర్పించాలని పోలీసులు సూచించారు.

70 మందికి పైగా పాక్ మహిళలు భారత్‌కు

చండీగఢ్, మే 1: భారతీయులను వివాహం చేసుకున్న 70మందికి పైగా పాకిస్థానీ మహిళలు అటారీ సరిహద్దు మీదుగా భారత్‌కు చేరుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థానీయులకు జారీ చేసిన అన్ని వీసాలను కేంద్రం రద్దు చేసింది. తమ తల్లిదండ్రులను కలుసుకోవడానికి పాక్ వెళ్లిన మహిళలను సరైన పత్రాలు ఉన్నప్పటికీ అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు భారత్‌కు తిరిగి రాకుండా అడ్డుకున్నారు. అయితే చర్చల అనంతరం పాకిస్తాన్ పాస్‌పోర్టుతో పాటు ఎన్‌వోఆర్ఐ (నో అబ్జెక్షన్ టు రిటర్న్ టు ఇండియా) సర్టిఫికెట్, దీర్ఘకాలిక వీసా (ఎల్‌టీవీ) ఉండి, భారతీయులను వివాహం చేసుకున్నవారికి తిరిగి వెళ్లడానికి మినహాయింపు ఇచ్చారు. దీంతో 70మందికి పైగా ఎన్‌వోఆర్ఐ వీసాదారులతో సహా మొత్తం 240 మంది గురువారం భారత్‌లోకి ప్రవేశించారు. మరోవైపు భారత్ నుంచి 140 మంది అటారీ సరిహద్దు మీదుగా పాక్‌కు వెళ్లిపోయారు. కాగా, స్వల్పకాలిక పర్యటనల కోసం పాకిస్థాన్‌కు వెళ్లేవారికి విదేశీ వ్యవహారాల శాఖ ఎన్‌వోఆర్ఐ సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. ఇవి ఉన్నవారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా భారత్‌కు తిరిగి రావడానికి అనుమతిస్తారు.

సమాచార కమిషనర్లుగా పార్టీ వాళ్లా?

- నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక..
- గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్న హక్కుల కార్యకర్త

పంజాగుట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియ జరిగిందని.. స్క్రీనింగ్ కమిటీ సూచించిన వారిని కాకుండా ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారని 'సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ' ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్ రాజు ఆరోపించారు. ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తిస్థాయి సెలక్షన్ కమిటీ లేకుండానే సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియ జరిగిందని.. ఇది సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని చెప్పారు. ఏ పార్టీకీ అనుకూలంగా ఉన్న వారిని నియమించవద్దనే నిబంధనలను తోసిపుచ్చి.. ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. అందులో ఒకరు గాంధీభవన్ పీఆర్వోకాగా, మరొకరు సీఎం కార్యాలయంలో సీపీఆర్వో, ఇంకొకరు ఒక పార్టీకి సంబంధించిన వారని.. వారిని సమాచార కమిషనర్లుగా ఎలా నియమించారని ప్రశ్నించారు. ఈ అంశంలో గవర్నర్ స్పందించాలని, ప్రభుత్వం పంపించిన పేర్లను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టం నిర్వీర్యం కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.